
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల నొప్పులకు వనమూలికలతో వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :25 | సంచిక :58 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | బుధవారం 08 జూలై 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


## ఏఐ రంగంలో ప్రపంచానికి
# దిక్సూచిగా తెలంగాణ

### బాధ్యతాయుతమైన సాంకేతికతకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్

కృత్రిమ మేధస్సు రంగంలో ప్రపంచ దేశాలకు తెలంగాణ సరికొత్త దిశానిర్దేశం చేస్తోంది. కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ మరియు సామాజిక ప్రయోజనాలను జోడించి 'ఏఐ ప్రమాణాలకు దిక్సూచి'గా తెలంగాణ నిలుస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచ్.ఐ.సి.సి **(HICC)** వేదికగా జరిగిన 'గ్రీన్ గ్రోత్ ఎకానమిక్ సమ్మిట్ – ది హైదరాబాద్ కలెక్టివ్' కార్యక్రమాన్ని, పరిశ్రమలు మరియు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. 'ది మెరీడియన్ కలెక్టివ్' ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది.ఈ సమ్మిట్ కు వివిధ దేశాల నుంచి హాజరైన ప్రతినిధులను



ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ "ఏఐ అంటే కేవలం క్లౌడ్ కంప్యూటింగ్, సర్వర్లు మాత్రమే కాదని, దీని వెనుక విద్యుత్, నీరు, భూమి మరియు మానవ వనరుల భాగస్వామ్యం ఉంటుందని ప్రభుత్వం గుర్తించింది. "మేము ఏఐ వద్దు అనడం లేదు, కానీ ఆ ఏఐ ఎలా ఉండాలో ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తున్నాము" అని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను, ముఖ్యంగా నీరు మరియు విద్యుత్తును హరిస్తూ ఏఐని నిర్మించడం కాకుండా, పునరుత్పాదక ఇంధనం మరియు బాధ్యతాయుతమైన వనరుల నిర్వహణతో తెలంగాణ ఏఐకి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.పెట్టుబడులను ఆహ్వానించడంలో తెలంగాణ దూకుడుగా ఉన్నప్పటికీ, అది పర్యావరణానికి మరియు స్థానిక ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "కేవలం భూమి, నీరు, విద్యుత్ ఇచ్చి - మిగతా3లో

## డిజిటల్' పాలిటిక్స్ వర్సెస్
# 'రోడ్ పాలిటిక్స్

**హైదరాబాద్, జూలై 7:**తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత కీలకమైన, అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నట్లు బీఆర్ఎస్ ఇంకా పూర్తిస్థాయి ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదు అనే అసంతృప్తి నిజమేనని నిరూపిస్తూ.. గులాబీ గూటిలో పెద్ద చీలికే వచ్చేసింది. కేటీఆర్ లీడర్‌షిప్ స్టైల్ నచ్చక, పార్టీ అంతర్గత విభేదాలతో బీఆర్ఎస్ నుండి సస్పెండ్ అయిన కల్వకుంట్ల కవిత.. ఏకంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో సరికొత్త ప్రాంతీయ పార్టీని స్థాపించి జోరుగా ప్రజల్లోకి వెళ్తున్నారు. కేటీఆర్ కేవలం సోషల్ మీడియా వేదికగా, ఏసీ రూముల్లో ప్రెస్ మీట్లు పెడుతూ డిజిటల్ పోరాటాలు చేస్తుంటే.. సొంత పార్టీ పెట్టుకున్న కవిత మాత్రం పాత ఉద్యమ శైలిని అందిపుచ్చుకుని నేరుగా రోడ్లెక్కి వీధి పోరాటాలు చేస్తుండటం గులాబీ కేడర్‌లో హాట్ టాపిక్‌గా మారింది.కార్పొరేట్ తరహాలో సాగే కేటీఆర్ హైటెక్ పాలిటిక్స్‌కు కాలం చెల్లిందని భావించిన



కవిత.. గ్రౌండ్ లెవెల్‌లో కరడుగట్టిన తెలంగాణ సెంటిమెంట్‌ను, నిరుద్యోగుల సమస్యలను ఎజెండాగా మార్చుకున్నారు. ఇటీవల బోడుప్పల్ పరిధిలో ప్రభుత్వ భూముల కేటాయింపు, ఉద్యమకారుల సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆమె నేరుగా రంగంలోకి దిగి, పోలీసులతో - మిగతా3లో

## టీఆర్ఎస్ పార్టీ పేరుపై కవితకు
# ఢిల్లీ హైకోర్టులో ఊరట

**హైదరాబాద్:**తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరు కేటాయింపు వివాదంలో కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. టీఆర్ఎస్ పేరును కేటాయించడం సాధ్యం కాదంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది మే 12, జూన్ 23 న నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై




వారం రోజుల్లో సమాధానం ఇవ్వడానికి కవితకు అవకాశం కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం నోటీసులకు ఇప్పటివరకు స్పందించని కవిత నేరుగా మంగళవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం వారం రోజుల్లో కవిత తన అభిప్రాయాలను తెలిపిన తర్వాత వ్యక్తిగతంగానూ ఆమె వాదనలు విని తుది నిర్ణయం తీసుకోవాలని ఈసీకి హైకోర్టు సూచించింది. విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది కీలక అంశాలను కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే టీఆర్ఎస్ పేరుతో పోలిక ఉన్న రెండు రాజకీయ పార్టీలు నమోదై ఉన్నందున అదే పేరును కవితకు కేటాయించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. అంతేకాకుండా టీఆర్ఎస్ పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని, గతంలో ఇలాంటి వ్యవహారాల్లో ఎవరికీ వ్యక్తిగతంగా వాదనలు వినడానికి అవకాశం ఇవ్వలేదని కోర్టుకు వివరించారు. టీఆర్ఎస్ పేరును కేటాయించడం సాధ్యం కాదని ఇప్పటికే కవితకు స్పష్టం చేసినట్లు ఈసీ తరఫు న్యాయవాది తెలిపారు. మరోవైపు కవిత తరఫు న్యాయవాది మాత్రం టీఆర్ఎస్ పేరును ఆమెకు కేటాయించాలని కోర్టులో వాదనలు వినిపించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసుల నేపథ్యంలో కవితకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండానే ప్రతికూల నిర్ణయం తీసుకోవడం సముచితం కాదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు వారం రోజుల్లో కవిత అభిప్రాయాలను తెలిపిన తర్వాత వ్యక్తిగతంగానూ ఆమె వాదనలు విని తుది నిర్ణయం తీసుకోవాలని ఈసీకి ఢిల్లీ హైకోర్టు సూచించింది.

## ఉగ్రం' రైఫిల్‌కు కేంద్రం
# పచ్చజెండా..

**హైదరాబాద్, జూలై 7:**రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో మరో కీలక ముందడుగు పడింది. తెలంగాణకు చెందిన స్టార్టప్ సంస్థ 'ద్వీప డిఫెన్స్' స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 7.62ఇ51 ఎంఎం 'ఉగ్రం' అసాల్ట్ రైఫిల్, భారత సైన్యం మరియు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఏ) నిర్వహించిన కఠిన పరీక్షల్లో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించింది. ఈ ఫలితంతో కేంద్ర సాయుధ పోలీస్ బలగాల (సీఏపీఎఫ్) అమ్ములపొదిలోకి ఈ స్వదేశీ ఆయుధం చేరేందుకు మార్గం సుగమమైంది.రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) పరిధిలోని 'ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్' (ఏఆర్‌డీఈ) సహకారంతో ద్వీప డిఫెన్స్ కేవలం 100 రోజుల రికార్డు సమయంలో ఈ రైఫిల్ ప్రోటోటైప్‌ను సిద్ధం చేసింది. దేశంలోని విభిన్న వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించిన ఫీల్డ్ ట్రయల్స్, విశ్వసనీయత మరియు సామర్థ్య పరీక్షల్లో ఇది తన సత్తా చాటింది. దీంతో సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, - మిగతా3లో

## సింగరేణికి కేంద్రం పూర్తి
# సహాయ సహకారాలు

**: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**న్యూఢిల్లీ, జులై 7**: దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమార్ 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు. సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్‌మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాములయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ కోల్ బ్లాక్



సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వు ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు - మిగతా3లో

# తెలంగాణ కాంగ్రెస్లో మరో అలజడి...



**హైదరాబాద్:**తెలంగాణ కాంగ్రెస్ లో మరోసారి అలజడి బయటపడింది. మంత్రి కొండా సురేఖకు తెలియకుండా దేవాదాయ శాఖ కమిషనర్తో కడియం శ్రీహరి ఎండోమెంట్ రివ్యూ నిర్వహించారు. స్టేషన్ఘన్పూర్ పరిధిలోని ఆలయాల పరిస్థితులపై హైదరాబాద్లో కడియం శ్రీహరి రివ్యూ నిర్వహించారు. దేవదాయ శాఖ మంత్రినైన తనకే తెలియకుండా కడియం శ్రీహరి రివ్యూ చేయడంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. కడియం శ్రీహరిపై స్టేట్ కమాండ్కి కాకుండా నేరుగా హైకమాండ్కి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మరోవైపు, తనకు చెప్పకుండా హైకమాండ్కి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేయడంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరా తీసారు. హైకమాండ్కు రాసిన లేఖను బహిర్గత పరచొద్దని మంత్రి కొండా సురేఖకు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

## ఎలాంటి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో
# తాగునీటి సమస్య తలెత్తనివ్వం

**వర్షాలు ఆలస్యమైనా.. ఎల్‌నినో ప్రభావం ఉన్నా ముందస్తు కార్యాచరణతో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా**

**జలాశయాల నీటి నిల్వలపై రోజువారీ పర్యవేక్షణ.. అవసరమైతే ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగానికి ఆదేశాలు: మంత్రి సీతక్క**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అధ్యక్షతన తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ బోర్డు సమావేశం తెలంగాణ సచివాలయంలో జరిగింది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా పరిస్థితి, జలాశయాల్లో నీటి నిల్వలు, రాబోయే నెలల్లో తాగునీటి అవసరాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. వర్షాలు ఆలస్యమైనా, వర్షపాతం తగ్గినా, ఎల్‌నినో ప్రభావం ఉన్నా రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని ఆదేశించారు.రాష్ట్రంలోని గ్రామీణ జనావాసాలకు ప్రధానంగా కృష్ణా, గోదావరి బేసిన్‌ల ఉపరితల జల వనరుల నుంచి శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు సమావేశంలో వివరించారు. తాగునీటి కోసం వినియోగిస్తున్న 29 జలాశయాల నుంచి 123 నీటి శుద్ధి కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు నీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో, ప్రతి జలాశయంలో 45 రోజులు, 90 రోజులు, 180 రోజుల అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యతపై మంత్రి సమీక్షించారు.అన్ని జలాశయాల్లో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ ఇరిగేషన్ శాఖ అధికారులతో



నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలను ప్రతి జలాశయంలో ముందుగానే నిర్ధారించాలని సూచించారు.జూలై నెలాఖరు వరకు తగిన నీటి ప్రవాహం లేకపోతే అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఉదయసముద్రానికి, తుపాకులగూడెం బ్యారేజ్ నుంచి దుమ్ముగూడెంకు నీటిని విడుదల చేసేలా ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు.ప్రస్తుతం - మిగతా3లో

## డిజిటల్ గవర్నెన్స్‌తో పారదర్శక
# పరిపాలన అందిస్తాం


**: సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, జులై 7** : కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయంలో ఈరోజు(మంగళవారం) ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం



చేశారు. డిజిటల్ గవర్నెన్స్ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసి, అవసరమైన చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పరిపాలన వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేస్తూ ముందుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని సీఎం సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. వివిధ విభాగాల్లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను డిజిటలైజ్ చేయాలని నిర్దేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తిస్థాయి కసరత్తు చేసేందుకు ఒక కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు. 100 రోజుల్లో ఆ కమిటీకి నివేదిక సమర్పించి ఒక కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వం చెల్లింపులు చేసినా సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## బీఎల్‌వోలను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారు



**రాంచందర్‌రావు**

**హైదరాబాద్, జులై 7:** బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆ పార్టీ బృందం కలిసింది. ఈ సందర్భంగా **SIR** విషయంలో ఎంఐఎం పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని రాంచందర్ రావు ఫిర్యాదు చేశారు. **SIR** ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరారు. అనంతరం బీజేపీ తెలంగాణ చీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో బీఎల్‌వో లను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లకుండా బీఎల్‌ఓలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పలువురు ఓటర్లకు ఫారాలు అందడం లేదని రాంచందర్ రావు తెలిపారు. తెలుగు ఫారాలతో ఇతర రాష్ట్రాల ఓటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హైదరాబాదే కాకుండా అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఇంగ్లీషు ఫారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా లోపాలపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరినట్లు రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ముప్పేట దాడిలో పాకిస్తాన్

పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం ఇప్పుడు కొత్త రూపం తీసుకుంది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) పాకిస్తాన్ భద్రతా దళాలను మాత్రమే కాకుండా, చైనా ప్రయోజనాలను కూడా నేరుగా లక్ష్యంగా చేసుకుంటోంది. ఇటీవలి దాడులు ఈ మార్పును స్పష్టంగా చూపిస్తున్నాయి. చైనా--పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) ప్రాజెక్టుల భద్రతపై ఇది తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది.గ్వాదర్ పోర్టు సమీపంలోని జివానీ ప్రాంతంలో జరిగిన ఇటీవలి ఘటనలో బీఎల్ఏ పాకిస్తాన్ సైన్యానికి చెందిన రాడార్ స్టేషన్, ఎయిర్ స్టేషన్ ఔట్‌పోస్టుపై దాడి చేసింది. ఈ ప్రాంతానికి సమీపంలో చైనాకు సంబంధించిన స్థావరం ఉండటం వల్ల ఈ దాడి చైనాపై కూడా ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. గ్వాదర్ పోర్టుకు సుమారు 60 కిలోమీటర్ల దూరంలో జరిగిన ఈ దాడి, హార్ముజ్ జలసంధికి సమీపంలో ఉండటం వల్ల వ్యూహాత్మక ప్రాధాన్యతను సంతరించుకుంది. బీఎల్ఏ మందుగుండు వాహనంతో ఆత్మాహుతి దాడి చేసినట్లు సమాచారం. దీంతో పాకిస్తాన్ భద్రతా దళాల్లో భారీ ప్రాణనష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఇంతకు ముందు బీఎల్ఏ నాలుగైదు ప్రధాన వంతెనలను పేల్చివేసి, ఇప్పుడు తీర భద్రతా దళాలపై కూడా దాడులు చేస్తోంది. బీఎల్ఏ తన స్వంత నేవీ ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు ప్రకటనలు వచ్చాయి. గతంలో కోస్ట్ గార్డ్ సిబ్బందిపై దాడులు జరిపి, ముగ్గురిని చంపినట్లు బీఎల్ఏ పేర్కొంది.చైనా ఇప్పటికే పాకిస్తాన్ భద్రతా ఏర్పాట్లపై నమ్మకం కోల్పోయి, తన స్వంత రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంది. అయినప్పటికీ, ఇలాంటి ఘటనలు చైనా పెట్టుబడుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. చైనా--పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో కీలక భాగం. గ్వాదర్ పోర్టు ద్వారా చైనాకు అరేబియన్ సముద్రంలో ప్రత్యక్ష ప్రవేశం లభిస్తుంది. ఈ ప్రాంతంలో దాడులు పెరగడం వల్ల ప్రాజెక్టుల అమలు ఆలస్యం కావడం, ఖర్చులు పెరగడం, పెట్టుబడిదారుల నమ్మకం తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. బీఎల్ఏ దాడులు ఇప్పుడు చైనా నియంత్రణలో ఉన్నట్లు భావించే ప్రాంతాల్లోకి విస్తరించాయి. ఇది చైనా ప్రణాళికలను భంగపరచడమే కాకుండా, పాకిస్తాన్‌తో చైనా సంబంధాలను కూడా పరీక్షిస్తోంది. చైనా ఇప్పటికే ఉలిక్కిపడి, భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేసుకుంటోంది.బీఎల్ఏ దాడులు ఇప్పుడు మరింత సంఘటితంగా, వ్యూహాత్మకంగా మారాయి. గ్వాదర్ పోర్టును తదుపరి టార్గెట్‌గా ఎంచుకోవచ్చని చర్చలు జరుగుతున్నాయి. బీఎల్ఏ తన దాడుల వీడియోలు, సాక్షాలతో సహా విడుదల చేస్తోంది. దీని వల్ల ప్రచారం విస్తృతంగా వ్యాపిస్తోంది. అయితే పాకిస్తాన్ అధికారులు ఈ ఘటనల గురించి బహిరంగంగా మాట్లాడడం లేదు. పత్రికల్లో కూడా విస్తృతంగా కవరేజ్ రావడం లేదు. ఇది ప్రభుత్వం దాడుల పరిమాణాన్ని తక్కువ చేయడానికి లేదా చైనా పెట్టుబడులపై నమ్మకం కల్పించడానికి చేస్తున్న ప్రయత్నంగా కనిపిస్తోంది. అయినప్పటికీ, బీఎల్ఏ ప్రచారం వల్ల వాస్తవాలు సామాజిక మాధ్యమాల్లో వ్యాపిస్తున్నాయి.ఈ దాడుల నేపథ్యంలో అమెరికా బలూచ్ ఉద్యమానికి మద్దతు ఇస్తోందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇది చైనా ప్రభావాన్ని అడ్డుకోవడానికి భాగంగా ఉండవచ్చని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇవి ఇప్పటికి అనుమానాలే. చైనా బలూచిస్తాన్ నుంచి వెళ్లిపోవాలనే ఉద్దేశంతో బీఎల్ఏ ఈ దాడులు చేస్తోందని కూడా భావన ఉంది. గ్వాదర్ పోర్టు, సమీప ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు కొనసాగితే, చైనా తన ప్రాజెక్టులను పునఃసమీక్షించవచ్చు లేదా భద్రతా ఖర్చులను బాగా పెంచవచ్చు.బలూచిస్తాన్ సమస్య ఇప్పుడు స్థానిక స్థాయిని దాటి ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలను కలిగిస్తోంది. చైనా, పాకిస్తాన్ మధ్య సంబంధాలు బలంగా ఉన్నప్పటికీ, భద్రతా సవాళ్లు రెండు దేశాలను కూడా ఒత్తిడిలోకి తెస్తున్నాయి.జైష్ ఎ మహ్మద్‌కు కేటాయించిన భూమి సుమారు 5 ఎకరాలు. ఒక ఎకరం సుమారు 4,800 గజాలకు సమానం కాబట్టి మొత్తం స్థలం 24,000 గజాలు అవుతుంది. సాధారణంగా ఒక వ్యక్తిని సమాధి చేయడానికి 6 గజాలు సరిపోతాయని పరిగణిస్తే, ఈ భూమిలో సుమారు 4 వేల మంది వరకు సమాధి చేయవచ్చు. ఇంత పెద్ద ప్రాంతాన్ని కేటాయించడం సాధారణం కాదు. ఇది భవిష్యత్తులో ఎక్కువ సంఖ్యలో మరణాలను ఊహించి లేదా ఇప్పటికే జరిగిన పెద్ద నష్టాలను సూచిస్తోంది.ఈ సమాధి స్థలాలు ఆపరేషన్ సిందూర్ అనే సైనిక చర్యతో నేరుగా ముడిపడి ఉన్నాయి. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం లష్కర్ ఎ తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్, జైష్ ఎ మహ్మద్‌తోపాటు మరో రెండు ఉగ్రవాద సంస్థలకు చెందిన మొత్తం 11 స్థావరాలపై దాడి చేసింది. బ్రహ్మోస్ క్షిపణులు ఉపయోగించి ఈ దాడులు నిర్వహించారు. నివేదికల ప్రకారం వందల మంది ఉగ్రవాదులు ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఉమర్ అనే ఒక్క వ్యక్తి మాత్రమే బతికి ఉన్నట్లు సమాచారం.ఈ వైరల్ ఫొటోలు, స్థల కేటాయింపులను పరిశీలిస్తే ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాద సంస్థలపై ఎంత బలమైన దెబ్బ తగిలించిందో అర్థమవుతుంది. ఒక్క జైష్ ఎ మహ్మద్‌కే 5 ఎకరాలు కేటాయించడం, మిగతా సంస్థలకు ప్రత్యేక స్థలాలు ఇవ్వడం. ఇవి అన్నీ ఒకేసారి జరిగిన పెద్ద మరణాలను సూచిస్తున్నాయి. 4 వేల మంది వరకు సమాధి చేయగల స్థలం కేటాయించడం అంటే ఆ సంస్థలు తమ సభ్యులను కోల్పోయిన స్థాయి చాలా ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. బ్రహ్మోస్ వంటి అధునాతన క్షిపణులతో ఏకకాలంలో బహుళ స్థావరాలపై దాడి చేయడం భారత సైన్యం యొక్క ఖచ్చితత్వం, సామర్థ్యం, ఉగ్రవాద వ్యతిరేక నిబద్ధతను చూపిస్తోంది. ఒక్క ఉమర్ మాత్రమే బతికి ఉండటం మిగతా వారందరూ ఆ దాడిలో చనిపోయినట్లు స్పష్టం చేస్తోంది. ఇది పాకిస్తాన్ భూభాగం నుంచి నడిచే ఉగ్రవాద కార్యకలాపాలకు తీవ్రమైన ఎదురుదెబ్బగా మారింది.అవి ఆపరేషన్ సిందూర్ విజయం, ఉగ్రవాద సంస్థలకు కలిగిన భారీ నష్టానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇలాంటి చర్యలు సరిహద్దు ఉగ్రవాదాన్ని అరికట్టడంలో భారత్ తీసుకుంటున్న చర్యల ప్రభావాన్ని మరింత స్పష్టంగా చూపుతాయి.బీఎల్ఏ దాడులు ఇలాగే కొనసాగితే, సీపీఈసీ ప్రాజెక్టుల వేగం మందగించడం, ప్రాంతీయ అస్థిరత పెరగడం తప్పదు. ఈ పరిస్థితి బలూచిస్తాన్‌లోని స్థానిక గుర్తింపు, వనరుల పంపిణీ సమస్యలను పరిష్కరించకపోతే, మరింత తీవ్రమవుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# మహారాష్ట్రను ముంచెత్తుతున్న వానలు

## 200 మిమీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదు

**ముంబై, జూలై 7:**మహారాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు ఉగ్రరూపం దాల్చాయి. గత 48 గంటలుగా కురుస్తున్న అసాధారణ భారీ వర్షాలకు ఆర్థిక రాజధాని ముంబైతో పాటు సాంస్కృతిక రాజధాని పుణె నగరం పూర్తిగా స్తంభించిపోయాయి. ముఖ్యంగా పుణె జిల్లాలోని పశ్చిమ కనుమలు పరిధిలో మేఘమథనం జరుగుతోంది. ఘాట్ సెక్షన్లలోని పలు వాతావరణ కేంద్రాల్లో ఇప్పటికే 200 మిమీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కాగా, పుణె నగర పరిసర ప్రాంతాల్లో సగటున 100 మిమీ మార్కును దాటేసింది. ఈ జలప్రళయం కారణంగా ఇటు పుణె, అటు ముంబై, కొంకణ్ రీజియన్‌లలో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. భారత వాతావరణ శాఖ ముంబై, ఠాణే, పాల్ఘర్, రాయ్‌గఢ్ జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ భారీ వర్షాల ధాటికి ముంబై-పుణె నగరాల మధ్య రవాణా వ్యవస్థ పూర్తిగా పడకేసింది. నిరంతరాయంగా కురుస్తున్న వానలకు ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వే లోని ఖోపోలి-కుస్గావ్ మిస్సింగ్ లింక్ సొరంగం సమీపంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. టన్నుల కొద్దీ రాళ్లు, మట్టి రోడ్డుపైకి దూసుకురావడంతో ఎక్స్‌ప్రెస్‌వేతో పాటు పాత ముంబై-పుణె హైవేపై కూడా రాత్రీపగలు ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేశారు. ముంబై డివిజన్ పరిధిలోని థాకూర్వాడి - మంకీ హిల్ సెక్షన్ల



మధ్య రైల్వే ట్రాక్‌లపై కూడా కొండరాళ్లు పడటంతో ముంబై-పుణె మధ్య నడిచే ఇంటర్‌సిటీ మరియు సుదూర ప్రాంతాల రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది లేదా దారిమళ్లించింది. వర్షాల తీవ్రతను దృష్ట్యా ముంబై, పుణె, ఠాణే, నవీ ముంబై పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలకు విద్యాశాఖ తక్షణ సెలవు ప్రకటించింది. ప్రైవేట్ ఆఫీసుల ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పుణె జిల్లాలోని మావల్ తహసీల్ పరిధిలో ఒక ఇల్లు కొండచరియల కింద నలిగిపోగా, ఇంద్రాయణి నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఆలంది మున్సిపల్ కౌన్సిల్ నదిపై ఉన్న అన్ని వంతెనలను మూసివేసింది. పుణె-కోలాడ్ రోడ్డు ఒక విభాగంలో కుంగిపోవడంతో ఆ రూట్ క్లోజ్ అయింది. పర్యాటకుల భద్రత దృష్ట్యా ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన సింహగడ్ కోట ను రెండు రోజుల పాటు పూర్తిగా బంద్ చేశారు. పుణె శివార్లలో వరదల్లో చిక్కుకుపోయిన ఒక ప్రైవేట్ బస్సులోని 37 మంది ప్రయాణికులను ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ప్రాణాలకు తెగించి సురక్షితంగా రక్షించాయి. ఇటు ముంబై నగరంలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. విక్రోలి, కొలాబా, మాతుంగ వంటి లోతట్టు ప్రాంతాలు మోకాళ్లోతు నీటిలో మునిగిపోయాయి. పశ్చిమ రైల్వే పరిధిలోని వసాయ్ రోడ్ - విరార్ సెక్షన్లలో పట్టాలు పూర్తిగా నీట మునగడంతో 20 కి పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు మధ్యలోనే నిలిచిపోయాయి. ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో రన్‌వే రక్షణ చర్యల దృష్ట్యా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మహారాష్ట్ర అసెంబ్లీని సైతం వర్షాల కారణంగా ఒకరోజు వాయిదా వేయాల్సి వచ్చింది. గత 3-4 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్ష సంబంధిత ఘటనల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారని విపత్తు నిర్వహణ మంత్రి గిరీష్ మహాజన్ ప్రకటించారు.

# సియా మహానటి..

# స్నాప్ చాట్ లో దొరికిపోయిన చేతన్


**జైపూర్, జూలై 7:**ఆమె అమాయకురాలు కాదు. మహానటి.. కుటుంబ సభ్యుల ముందు నటించింది. కేతన్ అగర్వాల్ ముందు నటించింది. అతడు దగ్గరనుంచి కోటి రూపాయలు డబ్బు తీసుకుంది. కేతన్ అగర్వాల్ తల్లిదండ్రుల ముందు కూడా నటించింది. అతడిని రెండుసార్లు కోటకు తీసుకెళ్లింది. రెండుసార్లు కూడా అతడిని చంపే ప్రయత్నం విఫలమైంది. మూడోసారి బాలిదాకా వెళ్లాలి అనుకుంది. కానీ ఆ ప్లాన్ ఫ్లాఫ్ అయింది. చివరికి తన నటన కౌశలాన్ని ప్రదర్శించి కాబోయే వాడిని కోటకు తీసుకెళ్లింది. తన ప్రేమికుడితో లేపేసింది.మూడో కంటికి తెలియకుండా చంపేశాం కాబట్టి ఇబ్బంది లేదు.. దొరికిపోయే అవకాశం లేదు అనుకుంది సియా. కానీ చేసిన ఘోరం.. ఎప్పటికీ దాగదు. ఒక చిన్న ఆధారం సియాను పట్టించింది. ఆమె ప్రియుడిని దొరికేలా చేసింది. ఆ తర్వాత ఈ కేసును ప్రత్యేక పోలీసుల బృందం దర్యాప్తు చేయడం మొదలుపెట్టింది. ఈ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సియా కేతన్ నుంచి కోటి రూపాయలు వసూలు చేయడం.. వాటిని తన ప్రియుడు చేతన్ కు ఇవ్వడం.. చేతన్ కూడా కేతన్ అగర్వాల్ ను చంపే క్రమంలో తన ఫోన్ వాడకపోవడం.. తన కారును పక్కనపెట్టి వేరే వ్యక్తి బైక్ ఉపయోగించడం.. తన దగ్గర పనిచేస్తున్న వ్యక్తి ఫోన్ వాడటం వంటివి చేశాడు. దీంతో ఈ కేసులో బలమైన ఆధారాలు పోలీసులకు లభించాయి. దీనికి తోడు సియా వాడిన స్పై ఫోన్.. కోడింగ్ లాంగ్వేజ్ వంటివి పోలీసులకు అనుమానం కలిగించాయి. ఆ తర్వాత వాటిని డీకోడ్ చేస్తుంటే అసలు విషయాలు వెలుగు చూస్తున్నాయి.ఇప్పటిదాకా స్పై ఫోన్.. ఇతర ఆధారాలు మాత్రమే పోలీసులు సేకరించగలిగారు. తాజాగా సియా స్నాప్ చాట్ లో జరిపిన ఓ సంభాషణ ఆమెను అడ్డంగా దొరికేలా చేసింది. స్నాప్ చాట్ లో సియా తన స్నేహితురాలికి వివాహ ఆహ్వానాన్ని పంపించింది. గెస్టులకు ఇచ్చే ఇంటర్ టికెట్ బుక్ చేసేందుకు ఆధార్ కార్డు పంపాలని ఆమెను కోరింది.. అయితే ఇక్కడ అసలు ట్విస్ట్ చోటు చేసుకుంది. ఎందుకంటే ఈ పెళ్లి జరగదని సియాకు తెలుసు. అదే విషయాన్ని స్నాప్ చాట్ లో ఆమె పేర్కొంది.. అంతేకాదు ఎలాగైనా సరే కేతన్ అడ్డు తొలగించుకోవాలని.. అతని శాశ్వతంగా వదిలించుకోవాలని సియా భావించింది. అందువల్లే స్నాప్ చాట్ లో ఈ పని చేసింది. వాస్తవానికి కేతన్ అంటే సియాకు ఇష్టం లేకపోయినప్పటికీ.. కుటుంబ సభ్యులు తీసుకురావడంతో ఆమె ఈ పని చేసినట్టు తెలుస్తోంది.. ఇప్పటికే సియా, చేతన్ ఫోన్ కాల్స్ ను పోలీసులు లోతుగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న సియా, చేతన్.. ఇప్పటికే అనేక విషయాలను చెప్పారు. ఇంకా ఈ కేసులో మరిన్ని నిజాలను రాబట్టడానికి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

**కేతన్ తాత మృతి**

నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలి అనుకున్నాడు. పెళ్లి కోసం భారీగా ఏర్పాట్లు చేసుకున్నాడు. దానికోసం భారీగా ఖర్చు పెట్టాడు. ఏకంగా 17 కోట్లు పెట్టి రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్ ప్రాంతంలో ఒక అత్యంత విలాసవంతమైన హోటల్ బుక్ చేసుకున్నాడు. తన పెళ్లికి వచ్చే అతిధులను తీసుకురావడానికి హెలికాప్టర్లను బాడుగకు మాట్లాడుకున్నాడు.. అప్పట్లో ఎంగేజ్మెంట్ కూడా చాలా గట్టిగా చేసుకున్నాడు. బిజినెస్ సర్కిల్స్ మొత్తం తన గురించి మాట్లాడుకునేలాగా చేశాడు.చిన్న వయసులోనే స్థిరాస్తి వ్యాపారం లోకి వచ్చి భారీగా సంపాదించాడు. తన జీవితంలోకి వచ్చే అమ్మాయి గురించి గొప్ప గొప్ప కలలు కన్నాడు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ఆ తర్వాత అతడి జీవితం మరో విధంగా మారింది. విధి పగబట్టింది. కాబోయే భార్య అతడిని చంపేసింది. పైగా ఆమెకు మరొక వ్యక్తితో సంబంధం ఉంది. తన ప్రేమికుడితో కలిసి తనకు కాబోయే భార్య తనను చంపేస్తుందని అతడు ఊహించలేదు. రెండుసార్లు తనను చంపే ప్రయత్నం విఫలమైందని అతడు చనిపోయిన తర్వాత తెలుసుకున్నాడు. అయినప్పటికీ జరగాల్సిన ఘోరం జరిగిపోయింది.ఇదంతా కూడా ఇటీవల కాలంలో మనం చూస్తున్న.. చదువుతున్న కేతన్ అనే స్థిరాస్తి వ్యాపారికి సంబంధించిన దీనగాథ. అతడు పోయిన బాధ నుంచి ఇంకా కుటుంబం తేరుకోలేదు. ఆ కేసు ఇంకా విచారణ దశలో ఉంది. రకరకాల మలుపులు తిరుగుతోంది. అతడు చనిపోయిన విషాదం గుండెను మెలి తిప్పుతుండగానే.. కేతన్ కుటుంబంలో మరో విషాదం చోటు చేసుకుంది.కేతన్ తాత దేవిచంద్ అగర్వాల్ అనారోగ్యంతో కన్నుమూశారు. కేతన్ చనిపోయిన దగ్గరనుంచి ఆయన ఆరోగ్య పరిస్థితి దారుణంగా మారిపోయింది. శనివారం రాత్రి అతనికి గుండెపోటు రావడంతో చనిపోయారు.. దీంతో కేతన్ కుటుంబం మరింత విషాదంలో కూరుకుపోయింది. కొడుకు మరణం.. తండ్రి మరణం.. ఇవన్నీ కూడా కేతన్ అగర్వాల్ తండ్రికి నరకం చూపిస్తున్నాయి. ఆయన విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది.

# త్వరలో గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్

భారతీయులకు బంగారంపై ఉన్న మక్కువ, సెంటిమెంట్ ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. శుభకార్యం ఏదైనా, పండగ ఏదైనా సెంటిమెంట్‌గా కొనే పసిడి.. కాలక్రమేణా ఇళ్లలోని లాకర్లలోనో, బ్యాంకు బీరువాల్లోనో నిరుపయోగంగా ఉండిపోతుంది. దేశ ఆర్థిక చిత్రం పరంగా చూస్తే, ఈ నిర్ణయం అత్యంత కీలకం కానుంది. భారతదేశం ప్రతి ఏటా వందల టన్నుల బంగారాన్ని విదేశాల నుండి దిగుమతి చేసుకోవడం వల్ల భారీగా విదేశీ మారక ద్రవ్యం బయటకు వెళ్ళిపోతూ కరెంట్ అకౌంట్ డెఫిసిట్ పై ఒత్తిడి పెరుగుతోంది. మన దేశ సరిహద్దుల్లోనే ఇళ్లల్లో ఉన్న 30,000 టన్నుల బంగారంలో కేవలం 5 నుండి 10 శాతం భాగాన్ని చలామణిలోకి తీసుకురాగలిగినా.. రాబోయే ఐదేళ్లలో బంగారం దిగుమతులపై భారం సగానికి పైగా తగ్గుతుంది. ఇది అంతర్జాతీయ మార్కెట్లో భారత రూపాయి విలువను మరింత బలోపేతం చేయడానికి ఎంతో దోహదపడుతుంది.అంతర్జాతీయ మార్కెట్ నివేదికల ప్రకారం.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారతీయ కుటుంబాల వద్ద సుమారు 30,000 టన్నుల గృహ వినియోగ బంగారం నిద్రాణంగా ఉంది. అంతర్జాతీయంగా పసిడి ధరలు ఆకాశాన్ని తాకుతున్న ఈ తరుణంలో.. ఈ భారీ సంపదను దేశ ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన సరికొత్త ప్రణాళికను సిద్ధం చేస్తోంది. పెరిగిపోతున్న పసిడి ధరలు దేశ దిగుమతి బిల్లుపై , రూపాయి విలువపై తీవ్ర ప్రభావం చూపుతున్న సమయంలో, పాత గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ కు కీలక మార్పులు చేస్తూ కేంద్రం ఈ కొత్త సంస్కరణను తీసుకురాబోతోంది.ఈ పునరుద్ధరించిన కొత్త విధానాన్ని రాబోయే ఆగస్టు నాటికి దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది. నిజానికి, గతంలో 2015లోనే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ గోల్డ్ మానిటైజేషన్ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, అది ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. నాటి నుండి ఇప్పటివరకు దశాబ్ద కాలంలో కేవలం 39 టన్నుల బంగారాన్ని మాత్రమే ప్రభుత్వం ఈ పథకం కింద సేకరించగలిగింది. కఠినమైన బ్యాంకింగ్ నిబంధనలు, బంగారాన్ని కరిగించడానికి కస్టమర్లకు ఉండే సెంటిమెంట్ అడ్డంకులు, ప్యూరిటీ




వెరిఫికేషన్ సెంటర్ల కొరత , అవగాహన లోపం దీనికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. అందుకే ఈసారి సాంప్రదాయ బ్యాంకులపైనే కాకుండా, ఏకంగా జువెలర్స్ నే నేరుగా రంగంలోకి దించాలని కేంద్రం డిసైడ్ అయింది. ఈ కొత్త పాలసీలోని అత్యంత కీలకమైన మార్పు ఏంటంటే.. ఇకపై సామాన్య ప్రజలు తమ వద్ద ఉన్న నిరుపయోగ బంగారాన్ని డిపాజిట్ చేయడానికి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. తాము క్రమం తప్పకుండా వెళ్లే, నమ్మకమైన స్థానిక జువెల వద్దకే నేరుగా వెళ్లవచ్చు.బంగారం వ్యాపారులే నేరుగా కస్టమర్ల నుంచి ఈ పసిడి డిపాజిట్లను సేకరించి, వాటిని ఒకచోట చేర్చే బాధ్యతను తీసుకుంటారు. తరతరాలుగా స్థానిక వ్యాపారులతో భారతీయ కుటుంబాలకు ఉండే సత్సంబంధాలను, నమ్మకాన్ని వాడుకోవడం ద్వారా ఈ స్కీమ్‌ను విజయవంతం చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. జువెలర్లను కలెక్షన్ అండ్ ప్యూరిటీ టెస్టింగ్ సెంటర్లు గా గుర్తించడం ద్వారా మౌలిక సదుపాయాల కొరతను అధిగమించవచ్చు. ఈ సరికొత్త వ్యూహం వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు జువెలర్లకు , సామాన్య వినియోగదారులకు ముగ్గురికీ లాభం చేకూరనుంది . దేశీయంగానే పాత బంగారం రీసైక్లింగ్ ద్వారా అందుబాటులోకి రావడం వల్ల జువెలర్లకు విదేశాల నుంచి కొత్త బంగారాన్ని దిగుమతి చేసుకునే సోర్సింగ్ ఖర్చులు , ప్రీమియంలు భారీగా తగ్గుతాయి. ఫలితంగా దేశీయ మార్కెట్లో బంగారం కొరత తగ్గుతుంది. మరోవైపు, ఇళ్లలో లాకర్లకే పరిమితమై ఎలాంటి ఆదాయాన్ని ఇవ్వని బంగారానికి ప్రభుత్వం బాండ్ల రూపంలో వార్షిక వడ్డీ కల్పిస్తుంది కాబట్టి, సామాన్య ప్రజలకు ఇది ఒక అద్భుతమైన అదనపు ఆదాయ వనరుగా , సురక్షితమైన పెట్టుబడిగా మారుతుంది. డిపాజిట్ గడువు ముగిసిన తర్వాత అంతే బరువు గల స్వచ్ఛమైన బంగారాన్ని లేదా నాటి మార్కెట్ ధర ప్రకారం నగదును పొందే వెసులుబాటు కూడా ఉంటుంది. రాబోయే ఆగస్టులో ప్రారంభం కానున్న ఈ సరికొత్త గోల్డ్ మానిటైజేషన్ పాలసీ పాత లోపాలను అధిగమించి ఏ మేరకు సక్సెస్ అవుతుందనేది ఇప్పుడు వ్యాపార వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. సాంప్రదాయకంగా గోల్డ్ లాకర్ సెంటిమెంట్ ను, ఆభరణాల రూపాన్ని మార్చడానికి ఇష్టపడని భారతీయ కుటుంబాలు.. ప్రభుత్వం కల్పిస్తున్న లీగల్ గ్యారెంటీని, జువెలర్ల ద్వారా లభించబోయే సులువైన డిపాజిట్ ప్రక్రియను ఏ మేరకు అందిపుచ్చుకుంటాయో వేచి చూడాలి. ఈ పథకం గనుక క్షేత్రస్థాయిలో విజయవంతమైతే.. భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త 'పసిడి వెలుగులు' రావడం ఖాయమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ఒవైసీ విద్యా సంస్థలపై రాజకీయ రంగు...



**హైదరాబాద్, జూలై 7:**తెలంగాణలో ఓవైసీల నేతృత్వంలోని ఫాతిమా విద్యాసంస్థల భూముల వ్యవహారం మరోసారి రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం, కోర్టుల అక్షింతలు, అధికార-విపక్షాల మధ్య సవాల్-ప్రతిసవాళ్లతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న జాప్యంపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేయగా, ఈ వ్యవహారం కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల మధ్య పదునైన విమర్శల యుద్ధానికి దారితీసింది.ఫాతిమా విద్యాసంస్థల ఉల్లంఘనలపై విచారణ సందర్భంగా ప్రభుత్వ విభాగాలు కోర్టుకు సమర్పించిన నివేదికలు, చెప్పిన సమాధానాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాము ఈ సంస్థలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని హైకోర్టుకు స్పష్టం చేసింది. తాము ప్రస్తుతం సర్వే వ్యవహారాల్లో బిజీగా ఉన్నామంటూ కాలయాపన సమాధానం ఇచ్చింది. నివేదిక ఇచ్చేందుకు కొంత గడువు కావాలని కోరింది. చెరువులు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఇతర శాఖల నుంచి స్పష్టమైన నివేదికలు వస్తేనే తాము తదుపరి చర్యలు తీసుకోగలమని వివరించింది. ఒకరిపై ఒకరు నెపం నెట్టేస్తూ, బాధ్యతల నుంచి తప్పుకునేలా ఉన్న ప్రభుత్వ శాఖల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులు ఇన్నిసార్లు చీవాట్లు పెడుతున్నా, క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని న్యాయస్థానం నిలదీసింది.హైకోర్టు వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని విపక్షాలు ప్రభుత్వంపై విమర్శల దాడిని పెంచాయి. ముఖ్యంగా బీజేపీ ఈ వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అక్రమ కట్టడాలపై బుల్డోజర్లు నడుపుతామని చెప్తున్న హైడ్రా, ఫాతిమా విద్యాసంస్థల జోలికి ఎందుకు వెళ్లడం లేదని బీజేపీ ప్రశ్నిస్తోంది.కేంద్రమంత్రి బండి సంజయ్ ఈ వివాదంపై అత్యంత ఘాటుగా స్పందించారు. తాము అధికారంలోకి వస్తే ఓవైసీ విద్యాసంస్థలను కూల్చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపాయి.దీనికి ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ అంతే దీటుగా కౌంటర్ ఇచ్చారు. "ఒక విద్యాసంస్థను కూల్చితే.. వంద విద్యాసంస్థలను కడతాం" అంటూ సవాల్ విసిరారు. తమ విద్యాసంస్థలను, మైనారిటీల హక్కులను ఎలా కాపాడుకోవాలో తమకు బాగా తెలుసంటూ ఆయన స్పష్టం చేశారుఅక్బరుద్దీన్ ఓవైసీ కామెంట్స్ పై మరో కేంద్రమంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓవైసీ సోదరులు బహిరంగంగా ప్రభుత్వాన్ని, చట్టాన్ని బెదిరిస్తున్నా రేవంత్ రెడ్డి సర్కార్ ఎందుకు వెనకడుగు వేస్తోందని ఆయన ప్రశ్నించారు. ఓవైసీ అంటే రేవంత్ రెడ్డికి అంత భయమా అని నిలదీశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.ఫాతిమా విద్యాసంస్థల వ్యవహారం కేవలం ఒక భూ వివాదంగానే కాకుండా, తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారింది. ఒకవైపు హైడ్రా యాక్షన్‌తో దూసుకుపోతున్నట్లు కనిపిస్తున్నా, ఎంఐఎం నేతలకు సంబంధించిన వ్యవహారాల్లో మాత్రం వెనకడుగు వేస్తోందనే ఇంప్రెషన్ ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. ప్రభుత్వ విభాగాలు కోర్టులో పొంతన లేని సమాధానాలు చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యంపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ గ్యాప్‌ను వాడుకుని తెలంగాణలో తామే ప్రధాన ప్రత్యామ్నాయం అని నిరూపించుకునేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కోర్టు తదుపరి ఆదేశాలు ఎలా ఉండబోతున్నాయి? హైడ్రా నిజంగానే చర్యలకు ఉపక్రమిస్తుందా? లేదా ప్రభుత్వ శాఖల మధ్య ఫైళ్ల కదలికల పేరుతో కాలయాపన జరుగుతుందా? అన్నది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

# డైరీతో దొరికిపోయిన డీఎస్పీ భీమ్ రెడ్డి.. బట్టబయలైన వందల కోట్ల అక్రమాస్తులు!

**ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో డీఎస్పీ భీమ్ రెడ్డి అరెస్ట్**

**వ్యక్తిగత డైరీ ఆధారంగా వెలుగులోకి వచ్చిన భారీ అక్రమాస్తులు**

**తెలంగాణ, కర్ణాటకలో 16 ప్రాంతాల్లో ఏసీబీ ఏకకాల సోదాలు**

**భారీగా నగదు, బంగారం, వెండి, భూ పత్రాలు స్వాధీనం**

**యాత్రకు వెళ్లే ముందు డైరీని స్కాన్ చేసి కొడుకులకు పంపిన వైనం**



ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో సంచలనం సృష్టించిన తెలంగాణ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్ రెడ్డిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిన్న సాయంత్రం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్‌లో (పీసీఎస్) డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన్ను, ఇబ్రహీంబాద్‌లోని వెసెల్లా మీడోస్‌లో ఉన్న నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. ఆయనను ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. తన సర్వీసు కాలంలో అవినీతి, అక్రమ మార్గాల ద్వారా భీమ్ రెడ్డి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ తన అభియోగాల్లో పేర్కొంది.

**కీలక సాక్ష్యంగా మారిన డైరీ**

ఈ కేసు దర్యాప్తులో భీమ్ రెడ్డి చేతిరాతతో ఉన్న ఒక వ్యక్తిగత డైరీ అత్యంత కీలకమైన సాక్ష్యంగా మారింది. జులై 2న ఏసీబీ అధికారులు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని ఆయన బంధువులు, స్నేహితులు, బినామీలకు సంబంధించిన మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లోనే భీమ్ రెడ్డికి చెందిన డైరీ లభించింది. ఈ డైరీలో తన ఆస్తులు, పెట్టుబడులు, బినామీల పేర్లను ఆయన స్వయంగా రాసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఆసక్తికరంగా, మే నెలలో చార్‌ధామ్ యాత్రకు తన భార్యతో కలిసి వెళ్లే ముందు ఆయన ఈ డైరీని రాసి, దాని స్కాన్ కాపీలను తన ఇద్దరు కుమారులకు వాట్సాప్ ద్వారా పంపినట్లు దర్యాప్తులో తేలింది. ఈ డైరీ ఆధారంగానే ఏసీబీ అధికారులు అనేక ఆస్తులు, ఆర్థిక లావాదేవీలను గుర్తించగలిగారు.

**బయటపడ్డ ఆస్తుల చిట్టా**

ఏసీబీ సోదాల్లో భీమ్ రెడ్డికి సంబంధించిన భారీ ఆస్తుల చిట్టా బయటపడింది. ఆస్తుల జాబితా చూసి అధికారులు నివ్వెరపోయారు. వాటిలో ప్రధానమైనవి: హైదరాబాద్ ఇబ్రహీంబాద్‌లో ఒక విల్లా, టెలికాం నగర్‌లో +02 ఇల్లు, గచ్చిబౌలి, తెల్లాపూర్‌లలో ఫ్లాట్లు.మణికొండలో 500 గజాల స్థలంలో +05 వాణిజ్య సముదాయంలో వాటా, మర్రిచెట్టు జంక్షన్‌లో 3000 చదరపు అడుగుల వాణిజ్య స్థలం.ప్రగతి రిసార్ట్స్‌లో 500 గజాల ఓపెన్ ప్లాట్, పటాన్‌చెరు, నాగోల్, మోమిన్‌పేటలలో పలు ఓపెన్ ప్లాట్లు.సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వద్ద 3.5 ఎకరాలు, మోమిన్‌పేటలో 2 ఎకరాలు, ముచ్చింతలలో 4.20 ఎకరాల వ్యవసాయ భూమి.కర్ణాటకలో 38 ఎకరాలు, మరో 6 ఎకరాల వ్యవసాయ భూమి, బెంగళూరు దేవనహల్లి వద్ద ఒక ఎకరం భూమి.రాఘవేంద్ర రాక్ సాండ్ మినరల్స్‌లో రూ. 75 లక్షల పెట్టుబడి. వీటితో పాటు సోదాల్లో భీమ్ రెడ్డి ఇంట్లో సుమారు రూ. 3.60 లక్షల నగదు, ఆయన బినామీ ఇంట్లో మరో రూ. 40 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 2 కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులు, బ్యాంకు ఖాతాల్లో రూ. 19.91 లక్షల నిల్వలను కూడా గుర్తించారు. అరెస్ట్ చేసిన భీమ్ రెడ్డిని అధికారులు మరింత లోతుగా విచారించనున్నారు.

# బీటెక్ ఉద్యోగుల జీతాల మించి శానిటరీ ఉద్యోగుల జీతాలే...

**హైదరాబాద్, జూలై 7:**హైదరాబాద్ మహానగరపాలక సంస్థ ఐటీ నిపుణుల కొరతను తీర్చేందుకు జారీ చేసిన ఒక టెండర్ నోటిఫికేషన్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నగరంలో ఎంతో నైపుణ్యం కలిగిన ఐటీ ఉద్యోగులకు ఆఫర్ చేస్తున్న వేతనాలు శాశ్వత శానిటేషన్ కార్మికుల జీతాల కంటే చాలా తక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. జీహెచ్ఎంసీ ఒక సంవత్సరం కాల పరిమితిపై ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 25 మంది ఐటీ ప్రొఫెషనల్స్‌ను నియమించుకోవడానికి తాజాగా నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. అయితే ఇందులో ప్రతిపాదించిన పే స్కేల్ ప్రస్తుతం హాట్ టాఫిక్‌గా మారింది.ఈ అధికారిక నోటిఫికేషన్ ప్రకారం.. హార్డ్‌వేర్ ఇంజనీర్లు, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్లు, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లు, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్లు, ప్రోగ్రామర్లు, టీమ్ లీడర్లు, జీఐఎస్ అనలిస్ట్‌లు, వెబ్ డిజైనర్ల వంటి వివిధ విభాగాల నిపుణుల కోసం జీహెచ్ఎంసీ దరఖాస్తులను కోరింది. అయితే వీరికి కేటాయించిన వేతనాల వివరాలు గమనిస్తే.. 12 మంది హార్డ్‌వేర్ ఇంజనీర్ల పోస్టులకు నెలకు రూ. 28 వేల చొప్పున వేతనం ప్రతిపాదించారు. కనీసం మూడేళ్ల అనుభవంతో పాటు ఎంటెక్ ఉన్నత విద్యార్హత కలిగిన సీనియర్ జీఐఎస్ అనలిస్ట్‌కు నెలకు రూ. 37 వేలు మాత్రమే చెల్లించనున్నారు. బీటెక్ విద్యార్హతతో పాటు ఆరు సంవత్సరాల సుదీర్ఘ అనుభవం గల వెబ్ డిజైనర్ పోస్టుకు కేవలం రూ. 42 వేలు వేతనంగా నిర్ణయించారు.ఈ వేతన ప్యాకేజీలను జీహెచ్ఎంసీలోని శానిటేషన్ కార్మికుల జీతాలతో పోల్చి చూస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూశాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధుల సమాచారం ప్రకారం.. జీహెచ్ఎంసీలో కొత్తగా చేరే శానిటేషన్ కార్మికులకే (ఔట్ సోర్సింగ్ కాకుండా) ప్రారంభంలో నెలకు రూ. 30 వేల నుంచి రూ. 35 వేల వరకు వేతనం అందుతోంది. ఇక కార్పొరేషన్‌లో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న సీనియర్ శానిటేషన్ కార్మికులు తమ సర్వీసు కాలాన్ని బట్టి నెలకు రూ. 50 వేల నుంచి గరిష్టంగా రూ. 80 వేల వరకు జీతాలు అందుకుంటున్నారు. విద్యా అర్హతలతో సంబంధం లేకపోయినా సీనియారిటీ కారణంగా వారి జీతాలు ఐటీ ఉద్యోగుల కంటే ఎంతో మెరుగ్గా ఉన్నాయి.ఈ తక్కువ వేతనాల వ్యత్యాసంపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందిస్తూ.. ఐటీ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి గత ఐదేళ్లుగా ఎలాంటి పే-స్కేల్ సవరణలు జరగకపోవడమే దీనికి ప్రధాన కారణమని వివరించారు. ప్రభుత్వం 2022 సంవత్సరం నుంచి ఔట్‌సోర్సింగ్ ఐటీ పోస్టులకు సంబంధించి పీఆర్సీ నిబంధనలను అమలు చేయకపోవడంతో పాత జీతాలనే కొనసాగించాల్సి వస్తోందని పేర్కొన్నారు. కాగా, ఇలా తక్కువ జీతాలు పొందుతున్న ఐటీ ఉద్యోగులు జీహెచ్ఎంసీలో సాఫ్ట్‌వేర్ వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, సర్వర్లు, డెస్క్‌టాప్‌లు, ప్రింటర్ల నిర్వహణతో పాటు మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ విభాగానికి సలహాలు అందించడం వంటి కీలక సాంకేతిక బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

# ఏఐ రంగంలో ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ

- మొదటి పేజీ తరువాయి

చేతులు దులుపుకునే పద్ధతి కాకుండా.. పరిశ్రమలు స్థానిక నైపుణ్యాలను పెంపొందించాలి, స్వచ్ఛమైన ఇంధనాన్ని వాడాలి, మరియు రీసైకిల్ చేసిన నీటిని మాత్రమే వినియోగించాలి. ఇది కేవలం ఇంజనీరింగ్ మెరుగుదల కాదు, ఇది మన విలువలకు నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా కార్బన్ క్రెడిట్స్ గురించి చర్చిస్తున్న సమయంలో, తెలంగాణ 'పీపుల్స్ క్రెడిట్' అనే కొత్త భావనను తెరపైకి తెచ్చిందని వెల్లడించారు. ఏఐ పెట్టుబడులు కేవలం డేటా సెంటర్లకే పరిమితం కాకుండా, స్థానిక ఉపాధిని పెంపొందించడం, గ్రామీణ యువతకు నైపుణ్యాలను అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వం నిర్దేశిస్తుందని అన్నారు.పెట్టుబడులు రావాలి, కానీ అవి స్వచ్ఛమైన ఇంధనంతో, పారదర్శకతతో, ప్రజల పట్ల గౌరవంతో రావాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కంపెనీలు కేవలం ఉద్గారాలను తగ్గించడమే కాకుండా, స్థానిక మేధో సంపత్తిని మెరుగుపరిచే బాధ్యత తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.రైతులకు, సామాన్యులకు భరోసా: వ్యవసాయానికి, సామాన్యులకు దక్కాల్సిన నీటితో సాంకేతికత ఎప్పుడూ పోటీ పడకూడదని భట్టి విక్రమార్క నొక్కి చెప్పారు. నీటి వినియోగంలో అత్యంత బాధ్యతాయుతమైన విధానాలను అనుసరిస్తున్న ఏఐ వ్యవస్థలకే తెలంగాణ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఏఐ సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండాలని, భాషా అడ్డంకులను తొలగించి, మహబూబాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు ఉన్న గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ప్రకటించారు.నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు దేశం అనుసరించిన శాస్త్ర, సాంకేతిక వృద్ధి పథాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మరింత ముందుకు తీసుకెళ్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ అంటే కేవలం డేటా సెంటర్ల కేంద్రం మాత్రమే కాదు, ఆ డేటా సెంటర్లు ఎలా నిర్మించాలో ప్రపంచానికి నేర్పే 'రోల్ మోడల్' అని ఆయన గర్వంగా ప్రకటించారు.పరిశ్రమలకు స్వాగతం పలుకుతూనే, 'ప్రజల పక్షపాతి'గా తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, భవిష్యత్తులో ప్రపంచ ఏఐ ప్రమాణాలను హైదరాబాద్ నిర్ణయించే స్థాయికి తీసుకువెళ్తాయన్నారు.పాతదానికి-కొత్తదానికి మధ్య వారధిగా ఉన్న హైదరాబాద్, నేడు 'ఏఐ బాధ్యతాయుత ప్రమాణాలకు' దిక్సూచిగా మారిందన్నారు.రిశ్రమలకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న అద్భుతమైన వాతావరణం, పారదర్శకమైన పాలన, మానవీయ విలువలతో కూడిన అభివృద్ధి విధానాలు పెట్టుబడిదారులకు గొప్ప భరోసానిస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఏఐ మేధస్సుతో పాటు, మానవీయ వివేకం కూడా కలిగిన సంస్థలే ప్రపంచాన్ని ఏలుతాయని, ఆ దిశగా తెలంగాణ అడుగులు వేస్తోందని వివరించారు.

# డిజిటల్' పాలిటిక్స్ వర్సెస్ 'రోడ్ పాలిటిక్స్

- మొదటి పేజీ తరువాయి

వాగ్వాదానికి దిగి రోడ్డుపై బైఠాయించి అరెస్టయ్యారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక ఇలా లాఠీలకు ఎదురునిలిచి అరెస్ట్ అయిన దాఖలాలు లేకపోవడంతో.. బీఆర్ఎస్ కిందిస్థాయి కేడర్ ఇప్పుడు కవిత నాయకత్వం గురించి చర్చించుకుంటున్నారు. సమస్యల పై పోరాడే అసలైన వారసురాలు కవితే అనే నరేటివ్‌ను ఆమె క్షేత్రస్థాయిలో బలంగా నిర్మిస్తున్నారు. అయితే కవితకు సమస్యలు సమస్యలు వస్తున్నాయి. ఆమె ప్రతిపాదించిన తెలంగాణ రక్షణ సేన ౧ూా అనే సంక్షిప్త నామంపై తీవ్ర అభ్యంతరాలు రావడంతో.. 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని, లేదంటే అప్లికేషన్ క్లోజ్ చేస్తామని ఈౕ స్పష్టం చేసింది. అయితే, పేరు మార్చే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని కవిత సవాల్ విసిరారు.ఈ విప్లవాత్మక పోరాటాలు, కొత్త పార్టీ స్థాపన కవిత రాజకీయ భవిష్యత్తుకు ఖచ్చితంగా ఒక టర్నింగ్ పాయింట్‌గా మారేలా కనిపిస్తున్నాయి. కేసీఆర్ స్థాపించిన పాత తెలంగాణ రాష్ట్ర సమితి ని భారత్ రాష్ట్ర సమితి గా మార్చడం వల్లే తెలంగాణలో పార్టీ అధికారం కోల్పోయిందని నమ్మే పాత ఉద్యమకారులంతా ఇప్పుడు కవిత వెంటే నడవడానికి సిద్ధమవుతున్నారు. తాము రక్తం, చెమట చిందించి నిర్మించుకున్న ౧ూా అనే ఐడెంటిటీని తానే కాపాడుకుంటానని కవిత చెప్పడం సెంటిమెంట్‌గా కేడర్‌ను అమితంగా ఆకర్షిస్తోంది. ఈ కొత్త పొలిటికల్ ఈక్వేషన్ కేటీఆర్‌ను తీవ్ర రక్షణలో పడేస్తోంది. ఒకవైపు అధికార కాంగ్రెస్‌ను ట్విట్టర్‌లో ఢీకొట్టడం కంటే.. సొంత చెల్లెలు పెట్టిన పార్టీ వైపుకు తమ కేడర్ వలస వెళ్లకుండా చూసుకోవడమే కేటీఆర్‌కు ఇప్పుడు పెద్ద టాస్క్‌గా మారింది. కవిత రోడ్లెక్కి మైలేజ్ పెంచుకుంటుంటే.. బీఆర్ఎస్ ఇంకా కేవలం ట్వీట్లకే పరిమితమైతే, భవిష్యత్తులో తెలంగాణలో అసలైన ప్రతిపక్ష హోదాను కూడా కవిత కొత్త పార్టీ చేజిక్కించుకునే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముగింపుగా చూస్తే.. అన్న 'డిజిటల్ వాట్సాప్' పాలిటిక్స్ చేస్తుంటే, చెల్లెలు మాత్రం 'రోడ్ పాలిటిక్స్' తో తెలంగాణ అసెంబ్లీ సమీకరణాలను మార్చడానికి దూసుకుపోతున్నారు. ఈ అన్నదమ్ముల, అన్నాచెల్లెళ్ల పొలిటికల్ వార్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

# సింగరేణికి కేంద్రం పూర్తి సహాయ సహకారాలు

- మొదటి పేజీ తరువాయి

సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు కేటాయించామని కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 బొగ్గు గనులపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్న ఈ బ్లాక్ ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ.2,550 కోట్లు మిగులుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎలాంటి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తనివ్వం

- మొదటి పేజీ తరువాయి

సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో, రాబోయే 45 రోజుల్లో సింగూర్‌లోకి తగిన నీటి ప్రవాహం రాకపోతే సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి (పాక్షికంగా), నిజామాబాద్ (పాక్షికంగా) జిల్లాల్లోని గ్రామీణ జనావాసాలు, పట్టణ ఆధారిత నివాస ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి, ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల ఆధారిత తాగునీటి పథకాలను వినియోగించేలా తక్షణమే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే రాష్ట్రంలోని అన్ని నివాస ప్రాంతాలకు స్థానిక మంచి నీటి వనరులను వినియోగిస్తూ ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా వ్యవస్థను సిద్ధంగా ఉంచాలని సూచించారు. స్థానిక నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాల్లో బోర్‌వెల్‌లను లోతుగా తవ్వడం, ఫ్లషింగ్ చేయడం, అవసరమైతే బోర్‌వెల్‌లను అద్దెకు తీసుకోవడం వంటి చర్యలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావం లేదా ఇతర వాతావరణ పరిస్థితుల కారణంగా ఎలాంటి తాగునీటి సంక్షోభం తలెత్తకుండా ప్రభుత్వం పూర్తిస్థాయి అప్రమత్తతతో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి నివాస ప్రాంతానికి నిరంతరాయంగా సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు చర్యలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్ కృపాకర్ రెడ్డి, ఇతర చీఫ్ ఇంజనీర్లు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు

# ఉగ్రం' రైఫిల్‌కు కేంద్రం పచ్చజెండా..

- మొదటి పేజీ తరువాయి

ఎస్ఎస్‌బీ, ఎన్ఎస్‌జీ వంటి భద్రతా బలగాల్లో దీన్ని ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతం కానుంది.'ఉగ్రం' రైఫిల్ బరువు 4 కిలోల కంటే తక్కువగా ఉండి, 500 మీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదు. ఇందులో 20 రౌండ్ల సామర్థ్యం గల మ్యాగజైన్ ఉండగా, ఇది సింగిల్ మరియు ఫుల్ ఆటోమేటిక్ ఫైరింగ్ మోడ్‌లను సపోర్ట్ చేస్తుంది. ముఖ్యంగా ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు, క్లిష్టమైన ఆపరేషన్ల కోసం దీనిని ప్రత్యేకంగా రూపొందించారు.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో కేటాయించిన 13 ఎకరాల స్థలంలో ద్విప డిఫెన్స్ తన తయారీ కేంద్రాన్ని నెలకొల్పింది. ఈ విజయంపై కంపెనీ ఎండీ సిబు జోసెఫ్ స్పందిస్తూ, వివిధ భద్రతా బలగాల నుంచి ఈ రైఫిల్‌కు మంచి ఆదరణ లభించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో రక్షణ రంగ పరికరాల తయారీ కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ స్థానం మరింత పటిష్ఠమైంది.

# ప్రకాశ్ రాజ్‌పై కదిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బీజేపీ నేతలు

**హైదరాబాద్, జూలై 7:**ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్‌పై ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర బీజేపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందూ సమాజాన్ని కించపరిచేలా, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపిస్తూ కదిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు దాఖలు చేసినట్లు బీజేపీ నేతలు తెలిపారు. ఈ మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రకాశ్ రాజ్ హిందూ సమాజంపై చేస్తున్న అవమానకర వ్యాఖ్యలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను అవమానించే చర్యల వెనుక ఆయన ప్రోద్బలం ఉంది" అని ఆరోపించారు.అంతేకాకుండా, వివాదాస్పద యూట్యూబర్ జోసెఫ్‌కు, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ హిందూ సమాజాన్ని అవమానించే ప్రకాశ్ రాజ్‌కు మద్దతిస్తున్న వైసీపీ, సీపీఐ, సీపీఎం పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆ పార్టీలు, ప్రకాశ్ రాజ్ వెంటనే హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రకాశ్ రాజ్‌తో పాటు ఆయన వెనుక ఉన్న శక్తులపై చట్టపరంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వార్తాతరంగాలు
బుధవారం 08 జూలై 2026

# టీఆర్పీలపై కేంద్రం నిషేధం...

**హైదరాబాద్, జూలై 7:**టీవీ చానెల్స్ కి కేంద్ర ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. టీవీ చానెల్స్ ఆదాయానికి కొలమానం గా నిలిచే ఎ్రా రేటింగ్స్ పై నిషేధం విధిస్తు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ రేటింగ్స్ ఆధారంగానే టీవీ చానెల్స్ కి కమర్షియల్ యాడ్స్ వస్తుంటాయి. రేటింగ్స్ ని బట్టే టీవీ చానెల్స్ యాజమాన్యాలు



భారీ రేంజ్ యాడ్స్ ద్వారా డబ్బులు సంపాదిస్తూ ఉంటారు. ఇకపై అలాంటి అవకాశాలు తగ్గిపోనున్నాయి. దేశం లోని అన్ని రకాల టీవీ చానెల్స్ ర్యాంకింగ్స్ , రేటింగ్స్ ని నిలిపివేస్తూ కేంద్ర సమాచార, ప్రసారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతం లో ఈ టీఆర్పీ రేటింగ్స్ వ్యవహారం లో తీవ్రమైన వివాదాలు తలెత్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం న్యూస్ చానెల్స్ రేటింగ్స్ ని నిలిపివేసింది.ఇప్పుడు లేటెస్ట్ గా జనరల్ ఎంటర్టైన్మెంట్ , సినిమా , స్పోర్ట్స్ సహా అన్ని రకాల ఎంటర్టైన్మెంట్ చానెల్స్ కి కూడా రేటింగ్స్ ని నిలిపివేసింది. ఈ కఠిన నిర్ణయం వెనుక కారణాలు ఉన్నాయి. కొన్ని ఛానళ్ళు అనుచిత , అక్రమ పద్ధతులు అనుసరించడమే అందుకు ప్రధాన కారణం. బ్రాడ్కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ లెక్కిస్తున్న ప్రస్తుత బార్-ఓ-మీటర్ల వ్యవస్థను కొన్ని పెద్ద నెట్ వర్కులు మేనేజ్ చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. తప్పుడు పద్ధతుల్లో రేటింగ్స్ ని పెంచుకొని ప్రకటనదారులు మోసం చేస్తున్నాయనే ఆరోపణలు ఈమధ్య కాలం లో ఎక్కువగా వెల్లువెత్తాయి. కేవలం రేటింగ్స్ రేసులో ముందంజలో ఉండడం కోసం ఛానళ్ళు కంటెంట్ లోని నాణ్యత ని దిగజారుస్తున్నారని , అది సమాజం పై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది.ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ టీఆర్పీ రేటింగ్స్ విధానానికి ప్రత్యామ్నాయంగా పారదర్శకతతో కూడిన వ్యవస్థని తీసుకొని రావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సాంకేతిక నిపుణులు , ఐటీ రంగ నిపుణులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సూచనల ప్రకారం డిజిటల్ సెట్-టాప్ బాక్సుల ద్వారా వచ్చే డేటాను రియల్-టైమ్లో పారదర్శకంగా చూసే విధానాన్ని ఈ ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం పరిశీలిస్తున్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం టెలివిజన్ ఇండస్ట్రీ ని , అడ్వర్టైజింగ్ రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎందుకంటే ప్రతీ ఏటా వేల కోట్ల రూపాయిల ఆదాయం యాడ్స్ రూపం లో వచ్చేవి , ఇవన్నీ రేటింగ్స్ ఆధారంగానే జరిగేవి. ఇప్పుడు కొత్త వ్యవస్థ అమ్మల్లోకి వచ్చే వరకు రేటింగ్స్ నిలిపివేయడం వల్ల వంద కోట్ల నష్టాలు వాటిల్లే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చూడాలి.

## డైలీ షటిల్స్ బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్:**ఐటీ ఉద్యోగుల కోసం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్లో "డైలీ షటిల్స్" సేవలను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్, మరియు నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి




మాట్లాడుతూ, హైదరాబాద్ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రజా రవాణాను బలోపేతం చేస్తోందన్నారు. ఈవీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, డైలీ షటిల్స్లో కూడా ఎలక్ట్రిక్ వాహనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ మెరుగుదల, కొత్త ఆర్టీసీ బస్సులు, రోడ్డు భద్రత కోసం రిఫ్లెక్టర్ వ్యవస్థ వంటి సంస్కరణలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పైకప్పు నుంచి తోసినా చావలేదు..
## చివరికి టాయిలెట్ క్లీనర్తో భర్తను చంపిన భార్య

**పైకప్పు నుంచి తోసినా ప్రాణాలతో బయటపడ్డ బాధితుడు**

**సెలైన్ పైప్ ద్వారా టాయిలెట్ క్లీనర్ ఎక్కించి హత్య**

**ప్రియుడు, అతడి స్నేహితుడి సహకారం**

**ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం**

**మృతుడి తల్లి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన కేసు**

మొదటి ప్రయత్నంలో భవనం పైకప్పు నుంచి తోసేసినా అతడు ప్రాణాలతో బయటపడ్డాడు. దీంతో ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన తర్వాత ఐవీ ద్వారా టాయిలెట్ క్లీనర్, నిద్రమాత్రల పొడిని శరీరంలోకి ఎక్కించి హత్య చేసిన ఘటన తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో కలకలం రేపింది. ఈ



కేసులో భార్యతో పాటు ఆమె ప్రియుడు, అతడి స్నేహితుణ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. మృతుణ్ని దయిని ప్రశాంత్ (35)గా గుర్తించారు. గత రెండేళ్లుగా గల్ఫ్లో పనిచేస్తున్న అతడు జూన్ 27న స్వగ్రామానికి వచ్చాడు. ఇక విదేశాలకు వెళ్లొద్దని నిర్ణయించుకున్నాడు. అయితే ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న అతడి భార్య సంధ్య (32), తన వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా మారాడని భావించింది. దీంతో ప్రియుడు అనిల్, అతడి స్నేహితుడు వెంకట్సాయి అలియాస్ బంటీతో కలిసి హత్యకు పథకం వేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. జూన్ 29న ప్రశాంత్కు బంటీ అధికంగా మద్యం తాగించాడు. తర్వాత సంధ్య ఫోన్లో చెప్పినట్లే అతణ్ని భవనం పైకప్పుపైకి తీసుకెళ్లి కిందకు తోసేశాడు. తీవ్రంగా గాయపడినప్పటికీ ప్రశాంత్ ప్రాణాలతో బయటపడ్డాడు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కిందపడిపోయాడని నమ్మించి ముందుగా ప్రభుత్వ ఆస్పత్రికి, తర్వాత ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చారు.నర్సింగ్ శిక్షణ పొందిన సంధ్య ఇంట్లోనే ప్రశాంత్కు ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కిస్తోంది. ఇదే అవకాశంగా భావించిన ముగ్గురు నిందితులు మరోసారి హత్యకు కుట్ర పన్నారు. జూన్ 30న సంధ్య, టాయిలెట్ క్లీనర్తో పాటు నిద్రమాత్రల పొడిని కలిపి సెలైన్ ఎక్కించడానికి పెట్టే చిన్న గొట్టం ద్వారా శరీరంలోకి ఇంజెక్షన్తో పంపింది. తర్వాత మంచం మీద నుంచి కిందకు తోసేయడంతో ప్రశాంత్ మృతి చెందాడు. పైకప్పు నుంచి పడిపోవడంతో ఆరోగ్యం క్షీణించి చనిపోయినట్లు నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే ప్రశాంత్ తల్లి తన కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమారుడు ఇంటికి వచ్చిన విషయం కూడా తనకు తెలియదని, అతడి మరణం వెనుక అనుమానాస్పద పరిస్థితులు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి హత్య కుట్రను ఛేదించారు. సంధ్య, అనిల్, బంటీని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం వారిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించింది.

# గులాబీకి మల్లారెడ్డి గుడ్ బై...

**హైదరాబాద్, జూలై 7:**తనదైన డైలాగులు, విలక్షణమైన రాజకీయ శైలితో నిత్యం సోషల్ మీడియాలో, ప్రజల్లో హల్చల్ చేసే మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారాయి. తాజాగా ఓ కార్యకర్త జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆయన, "దీ=ాకు దూరమయ్యానని నన్ను మర్చిపోతున్నారు" అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ పార్టీకి ఆయన గుడ్ బై చెప్పి, త్వరలోనే భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకోబోతున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్న తరుణంలో ఈ కామెంట్స్ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ అగ్రనేతల వద్ద అత్యంత కీలక వ్యక్తిగా, పార్టీకి ప్రధాన బలంగా నిలిచిన మల్లారెడ్డి, అధికారం కోల్పోయిన తర్వాత కూడా చాలాకాలంపాటు ఆయన పార్టీలో చురుగ్గా ఉండేవారు. కానీ కొంతకాలంగా అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆయన పార్టీ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్ వైపు రావడం పూర్తిగా తగ్గించేశారు. కేటీఆర్, హరీశ్ రావు వంటి పార్టీ ముఖ్య నేతలు నిర్వహించే ప్రెస్ మీట్లు, కీలక సమావేశాల్లోనూ మల్లారెడ్డి మునుపటిలా యాక్టివ్?గా కనిపించడం లేదు. కాంగ్రెస్, బీజేపీ, చివరికి టీడీపీలో చేరేందుకు కూడా ఆయన



ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం చాలా రోజులుగా నడుస్తోంది. తాజాగా "నేను బీఆర్ఎస్కు దూరమయ్యానని నన్ను దూరం పెడుతున్నారు" అంటూ నేరుగా కార్యకర్తల సమక్షంలో వ్యాఖ్యానించడం.. ఆయన పార్టీ మారడం ఖాయమనే సంకేతాలను ఇస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మల్లారెడ్డి కుటుంబం బీజేపీ వైపు చూస్తోందనడానికి మరో ప్రధాన కారణం.. ఆయన కోడలు డాక్టర్ ప్రీతిరెడ్డి ఇటీవల చేసిన కొన్ని ఆసక్తికర కామెంట్స్ కూడా ఉన్నాయి. ఆమె ఓ ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసలు కురిపించడం పొలిటికల్ సర్కిల్స్లో హాట్ టాపిక్గా మారింది. అంతేకాకుండా, ఆమె బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి అక్కడ ఆ పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ సహా కీలక నేతలతో భేటీ కావడం చర్చకు దారితీసింది. అయితే, ఇది కేవలం డిజిటల్ ఇండియా ఈవెంట్ గురించిన భేటీ అని, రాజకీయ ప్రాధాన్యత లేదని ఆమె వివరణ ఇచ్చినప్పటికీ ఊహాగానాలు మాత్రం ఆగలేదుప్రస్తుతం మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి ఇద్దరూ బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. అయితే, భవిష్యత్తులో రాబోయే మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో ఉంచుకుని మల్లారెడ్డి ఫ్యామిలీ ఒక పెద్ద స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. తమ కుటుంబానికి రాబోయే రోజుల్లో ఒక పార్లమెంటు నియోజకవర్గంతో పాటు అందులోని నాలుగు అసెంబ్లీ టికెట్లు కేటాయించాలనే షరతుపై అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ అధిష్టానాల నుంచి గట్టి హామీ పొందే ప్రయత్నాల్లో మల్లారెడ్డి ఫ్యామిలీ ఉన్నట్లు పొలిటికల్ కారిడార్లో గట్టిగా వినిపిస్తోంది.ఈ నేపథ్యంలోనే మల్లారెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా "నన్ను మర్చిపోతున్నారు" అంటూ సానుభూతి కార్డ్ ప్లే చేశారా? లేక నిజంగానే బీఆర్ఎస్ శ్రేణులు తనను దూరం పెట్టడం వల్లే ఆవేదనతో అన్నారా? అనేది తేలాల్సి ఉంది. ఏది ఏమైనా, మల్లారెడ్డి తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేపబోతున్నాయనేది మాత్రం స్పష్టమవుతోంది.

# 70 ఏళ్ల జీ హెచ్ ఎంసీ చట్టానికి ఫుల్ స్టాప్

**హైదరాబాద్, జూలై 7:**తెలంగాణలోని సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మహానగర పాలనలో మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 70ఏళ్ల జీహెచ్ఎంసీ చట్టానికి స్వస్తి చెప్పబోతోంది. మూడు కార్పొరేషన్లు (జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ) కలిపి కొత్త చట్టాన్ని తీసుకువస్తోంది. ఈ మేరకు క్యూర్ ముసాయిదా బిల్లు (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) -2026ను ఆదివారం విడుదల చేసింది. ఈ బిల్లులో 43 చాప్టర్లు, తొమ్మిది షెడ్యూళ్లు ఉన్నాయి. జూలై 24 వ తేదీ వరకు ప్రజాభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నట్లు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి (ఎంఏయూడీ) శాఖ ప్రకటించింది.తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) 2026 ముసాయిదా బిల్లు అమల్లోకి వస్తే హైదరాబాద్ పరిధిలోని ఆస్తి యాజమానులపై పన్నుభారం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి బదులుగా, ఆస్తి మూలధన విలువ ఆధారంగా ప్రాపర్టీ ట్యాక్స్ ను నిర్ణయించే విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. అంతేకాక.. రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం నిర్ణయించే మార్కెట్ విలువను ఆధారంగా తీసుకొని స్థలాలు, భవనాలపై ఆస్తిపన్ను విధించనున్నారు. దీంతో ముఖ్యంగా పాత జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అనేక ఆస్తులపై పన్ను గణనీయంగా పెరిగే అవకాశాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఉన్న భవనాలకు పన్ను పెంపును దశలవారీగా అమలు చేసే అవకాశం ఉంది. కొత్తగా నిర్మించే భవనాలకు కొత్త విధానం వెంటనే అమల్లోకి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం తెలుస్తోందక్యూర్ ముసాయిదా బిల్లు అమల్లోకి వస్తే.. క్యూర్ పరిధిలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడతారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా.. అందులో ఎవరైనా నివాసం ఉండే పరిస్థితి ఉన్నా.. కమిషనర్లు 24 గంటల ముందు నోటీసులు ఇచ్చి సీజ్ చేయొచ్చు. ఒకవేళ ప్రజల భద్రతకు ఇబ్బందిగా ఉంటే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సీజ్ చేసే అవకాశం ఉంటుంది. క్యూర్ చట్టంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చారు. ఖాళీ స్థలాల్లో చెత్త ఉంటే ప్లాట్ మూలధన విలువలో 0.25శాతం మేర జరిమానా విధిస్తారు. చెత్త తొలగించే వరకు జరిమానాల విధింపు ఉంటుంది. ఈ విధానం ద్వారా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.క్యూర్ చట్టం ముసాయిదాలో ఆహార భద్రతకు సంబంధించి కీలక ప్రతిపాదనలు ఉన్నాయి. కొత్త చట్టంలో అధ్యాయం-33లో ఆహార భద్రత, పోషకాహారం అంశాలను చేర్చారు. దీని ప్రకారం పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి చైర్మన్గా, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కన్వీనర్గా 'ఆహార భద్రత, పోషకాహార కమిటీ' ఏర్పాటు చేస్తారు. క్యూర్ పరిధిలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల అమలును ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. పర్యావరణం పరిరక్షణకూ ఈ క్యూర్ బిల్లులో ప్రాధాన్యత ఇచ్చారు. విపత్తుల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు. ఏదైనా విపత్తు తలెత్తితే ప్రభుత్వ శాఖలను అప్రమత్తం చేయడానికి క్యూర్ స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తారు. అంతేకాక హైడ్రాకు చట్టబద్ధ గుర్తింపు కల్పిస్తూ చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో అప్పగించనున్నారు.క్యూర్ బిల్లులో సెక్షన్ -168 ప్రకారం.. అనుమతిలేని ఆస్తులు, అక్రమ నిర్మాణాల క్రయ విక్రయాలు, బదిలీలు నిషేధం, అనధికార నిర్మాణాల యాజమానులకు సంబంధిత అధికారి నోటీస్ జారీ




చేసి నిషేధిత జాబితాలో చేర్చుతారు. ఈ నూతన బిల్లు ద్వారా నైట్ ఎకానమీకి ప్రోత్సాహం అందించే కీలక ప్రతిపాదన చేశారు. పలు ప్రాంతాలను నైట్ ఎకానమీ జోన్లుగా ప్రకటించి రాత్రంతా వ్యాపారాలకు అనుమతి ఇవ్వనున్నారు. క్యూర్లోని ప్రజలకు అన్ని అత్యవసర సేవలకు ఒకే ఆన్లైన్ పోర్టల్ అందుబాటులోకి తెస్తారు.క్యూర్ బిల్లును ప్రజా సంప్రదింపుల కోసం అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వం తెలిపింది. పౌరులు తమ అభిప్రాయాలు, సూచనలను ఆన్లైన్ ద్వారా **(https://ghmc.gov.in/categoryWise InsertReport.aspx)** సమర్పించాలని పేర్కొంది. మూడు కార్పొరేషన్ల వెబ్ సైట్లలో ముసాయిదా బిల్లును అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. రాతపూర్వకంగా కూడా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ, సచివాలయం, హైదరాబాద్కు తమ సూచనలను పంపొచ్చని ప్రభుత్వం తెలిపింది. అయితే, ఈ సూచనలు, అభ్యంతరాలను కేవలం జులై 24వ తేదీ వరకు మాత్రమే స్వీకరించటం జరుగుతుందని ప్రభుత్వం ష్టం చేసింది.

# ఆహార కల్తీ నియంత్రణకు
# హైడ్రా తరహా చట్టం

**హైదరాబాద్, జూలై 7:**తెలంగాణలో ఆహారకల్తీ, డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం కొత్తగా ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయనుంది. సీఎస్ సంజయ్జాజు, డీజీపీ సీవీ ఆనంద్ల సమీక్షలో ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుకు కిందకు తెస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కొత్త శాఖకు ఒకే విభాగాధిపతి ఉంటారు. దీని పరిధిలోనే ఎన్ఫోర్స్మెంట్, ఎఫ్ఎస్ఎల్, ప్రాసిక్యూషన్ విభాగాలు పనిచేస్తాయి. కల్తీ ముఠాలపై ఉక్కుపాదం మోపేందుకు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల నుంచి వెనక్కి



వచ్చిన సిబ్బందిని ఈ కొత్త విభాగంలోకి పంపించనున్నారు.తెలంగాణలో ఆహారకల్తీ అతి పెద్ద సమస్యగా మారింది. వంటింటి సామాన్ల నుంచి పిల్లలు తినే చాక్లెట్లు, బిస్కెట్ల వరకు ప్రతిదీ కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ నేపథ్యంలో కల్తీని పూర్తిగా అణచివేసేందుకు తెలంగాణ ప్రభుత్వం వ్యూహాత్మక కార్యాచరణను ప్రారంభించింది. ఆహారకల్తీ నియంత్రణ కోసం కొత్తగా ప్రత్యేక శాఖ లేదా విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్తో పాటు పలువురు ఉన్నతాధికారులు నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.ప్రస్తుతం విడివిడిగా కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుకు కిందకు తీసుకురానున్నారు. ఈ రెండు కీలక విభాగాలనూ విలీనం చేస్తూ ఏర్పడే ఈ కొత్త సూపర్ విభాగానికి ఒకే ఒక సమర్థుడైన విభాగాధిపతి నేతృత్వం వహించేలా తగిన అధికారిక చర్యలు తీసుకుంటున్నారు. ఆహార, ఔషధ రంగానికి చెందిన నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఉక్కుపాదం మోపేలా.. ఈ సరికొత్త శాఖ పరిధిలోనే ప్రత్యేకంగా ఎన్ఫోర్స్మెంట్ వింగ్, లీగల్ సెల్, ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ ల్యాబ్స్, పటిష్టమైన ప్రాసిక్యూషన్ విభాగాలను కూడా అంతర్భాగంగా ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.మరోవైపు.. రాష్ట్రంలో యువత భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్న మాదకద్రవ్యాల కేసులను, అక్రమ రవాణాను సమూలంగా అరికట్టేందుకు కూడా ఈ శాఖ అత్యంత చురుగ్గా పనిచేస్తుందని ఉన్నతాధికారుల బృందం భావిస్తోంది. ఈ కొత్త రక్షణ విభాగానికి అత్యంత నైపుణ్యం కలిగిన బలగాల దళాన్ని కేటాయించనున్నారు. ఇందులో భాగంగానే ఇటీవలే ఎలైట్ యాంటీ-నక్సల్ ఫోర్స్ అయిన గ్రేహౌండ్స్, ఉగ్రవాద నిరోధక విభాగం ఆక్టోపస్ల నుంచి వెనక్కి పిలిపించిన అనుభవజ్ఞులైన పోలీసు సిబ్బందిని, కమాండోలను కొత్తగా ఏర్పాటు చేయబోయే ఈ ప్రతిష్టాత్మక ప్రత్యేక శాఖలోకి బదిలీ చేసేందుకు పరిపాలనాపరంగా రంగం సిద్ధం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, తయారీ కేంద్రాలలో నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించడంతో పాటు, నకిలీ మందుల ముఠాల గుట్టు రట్టు చేయడానికి ఈ కమాండో తరహా నిఘా విభాగం పగడ్బందీగా పనిచేయనుంది. అంతర్గత కసరత్తులన్నీ దాదాపు తుది దశకు చేరుకున్నందున త్వరలోనే ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ఈ సరికొత్త ఆహార, ఔషధ నియంత్రణ ప్రత్యేక శాఖ అధికారికంగా అందుబాటులోకి రానుందని అధికారులు వెల్లడించారు.

## ఆర్టిఏ కార్యాలయంలో కాంక్రీట్ మిక్సర్ కార్మికుల ఆందోళన

**హైదరాబాద్:**కాంక్రీట్ మిక్సర్ కార్మికులు మంగళవారం నాడు ఆర్టీయే కార్యాలయంలో అందోళనకు దిగారు. నగర రహదారులపై ఆర్టిఏ, ట్రాఫిక్ పోలీసుల వేధింపులు నిలిపాలని డిమాండ్ చేసారు. వందలాదిగా తరలివచ్చిన కార్మికులు లోపలికి అనుమతించకపోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. తరువాత అనంతరం కార్యాలయంలోనికి వచచి ఆర్టిఏ కమిషనర్ కార్యాలయం ముందు బయటాయించి నిరసన తెలిపారు. ట్రాఫిక్ ఆర్టిఏ వేధింపులతో తమ జీవితాలు నాశనం అవుతున్నాయి అంటూ ఆవేదన వ్యక్తం చేసారు.

## హయత్నగర్ హైవేపై కారు, లారీ ఢీ

**హైదరాబాద్:**హయత్నగర్ డిపో సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. భాగ్యలత - హయత్నగర్ మార్గంలో అతివేగంగా వచ్చిన ఓ టిప్పర్ లారీ, ముందు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా నుజ్జునుజ్జైంది. ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంతో సదరు రూట్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది

## జమ్మూకశ్మీర్లోని కిష్టవార్లో క్లౌడ్బరస్ట్

**శ్రీనగర్:**జమ్మూ కాశ్మీర్లోని కిష్టవార్లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా క్వార్ జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద క్లౌడ్బరస్ట్ సంభవించింది. దీనితో కొండచరియలు విరిగిపడి, ప్రాజెక్టు ప్రదేశంలో బురద, రాళ్లు, శిథిలాలు పేరుకుపోయాయి. అనేక వాహనాలు, ట్రక్కులు, ట్యాంకర్లతో సహా బురదలో కూరుకుపోయాయి. జమ్మూ-కిష్టవార్ జాతీయ రహదారి కూడా మూసుకుపోయింది. అధికారులు పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. దోడా జిల్లాలోని ప్రేమ్ నగర్ ప్రాంతంలో కూడా కొండచరియలు విరిగిపడి రహదారి మూసివేసారు.

## ఇంటిలో నిద్రిస్తున్న వృద్ధురాలిపై అత్యాచారయత్నం

**జనగామా:**ఇంటిలో నిద్రపోతున్న వృద్ధురాలిపై అత్యాచారానికి కాంగ్రెస్ పార్టీ 9 వ వార్డు కౌన్సిలర్ చౌదరపల్లి సంపత్ రాజ్ ప్రయత్నించాడు. వృద్ధురాలు ప్రతిఘటించడంతో బాత్రూంలోకి దూరాడు. స్తానికులు చుట్టూ పక్కల వారిని పిలిచి 100 కు డయల్ చేసారు. పోలీసులు సంపత్ రాజ్ ను స్టేషన్ కి తరలించారు. జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లులో ఘటన జరిగింది.

# ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం సహా చట్టం..

**సమాచారాన్ని అడగడం పౌరుల హక్కు.**

**అదనపు కలెక్టర్ మధు మోహన్**

**జోగులాంబ గద్వాల, జూలై 7 ( స్కై న్యూస్):** సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం వంటిదని, సమాచారాన్ని అడగడం పౌరుల హక్కు అని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సహచట్టం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి ఆయా శాఖల వారీగా వచ్చిన సహ చట్టం దరఖాస్తులు, వాటి పరిష్కారం, ఏ స్థాయిలో ఎన్ని పెండింగ్ లో ఉన్నాయనే తదితర అంశాల గురించి రాష్ట్ర సహ చట్టం కమిషన్ కు నివేదిక పంపించాల్సి ఉంటుందన్నారు. ఆయా



శాఖల అధికారులు నిబంధనలను అనుసరించి పౌరులు అడిగే సమాచారాన్ని ఇవ్వవచ్చని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేసే కొంతమంది పౌరులు వివిధ శాఖల సమాచారాన్ని అడుగుతుంటారని, సంబంధిత అధికారులు పౌరుల హక్కులకు భంగం కలగకుండా నిర్దేశిత గడువులోగా సమాచారాన్ని ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. పౌరులకు మన బాధ్యతగా చేస్తున్న సేవలపై ప్రతి ఒక్క అధికారి ఆత్మవలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టంలోని వివిధ సెక్షన్ల గురించి క్లుప్తంగా వివరించారు. అలాగే వివిధ శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారం, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఆర్టిఐ సెక్షన్ పర్యవేక్షకులు సరితా రాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అపెండెక్స్ ఆపరేషన్ చేసుకున్న మోహిని ఫార్మర్శించిన జి భాస్కర్ రెడ్డి

**చిన్న చింతకుంట జూలై 7 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండలం లాల్ కోట గ్రామంలో ఇటీవల అపెండెక్స్ ఆపరేషన్ చేసుకున్న మైనార్టీ నాయకులు మెయిన్ నివాసానికి వెళ్లి బెడ్ రెస్ట్ తీసుకుంటున్న ఆయనను పరామర్శించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సోదరులు జి. భాస్కర్ రెడ్డి పర్మర్శించారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మైనార్టీ నాయకుడు మోహిన్ ఇంటికి వెళ్లి పరామర్శించినందుకు మైనార్టీ సోదరులు జి భాస్కర్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సోదరులతో పాటు తదితరులు పాల్గొన్నారు.





# శ్రీరామ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ ద్వారా బాధితుల కుటుంబానికి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

**జోగులాంబ గద్వాల, జూలై 7(స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు శ్రీరామ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ వారు గద్వాల పట్టణంలోని సెకండ్ రైల్వే గేట్ చెందిన డేవిడ్ రాజ్ మృతి చెందారు 1లక్ష రూపాయలు ఇన్సూ రెన్స్ కట్టితే వారి కుటుంబం నామిని కుమారుడు వినోద్ కుమార్ కు 35 లక్షల వరకు ఇన్సూరెన్స్ రావడం జరిగింది మొదటి విడతగా తొమ్మిది లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా నామిని వినోద్ కుమార్ కి అందజేయడం జరిగింది. వితలివారీగా మొత్తం 35 లక్షల రూపాయలు చెక్కును అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండల పరిధిలోని కుర్తి రావులచెరువు గ్రామానికి చెందిన మునెమ్మ 20000 రూపాయలు ఇన్సూరెన్స్ లు కట్టగా శ్రీరామ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ ద్వారా వారి కుటుంబానికి నామిని కవిత కు మూడు లక్షల 50 వేల రూపాయలు చెక్కును ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా నామిని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరామ చిట్ ఫండ్స్ ఫైనాన్స్ ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు పేద, మధ్యతరగతి, ప్రజలకు బైక్ ఆటో లోన్లు వడ్డీకి రుణాలను ఇస్తూ ఇప్పుడు ఇన్సూరెన్స్ ద్వారా ఎల్ఐసి ప్రకారం కస్టమర్లు 1లక్ష ఇన్సూరెన్స్ కట్టి అనుకోకుండా ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి అండగా ఇన్సూరెన్స్ ద్వారా వచ్చే డబ్బులు 35 లక్షల వరకు అందజేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు ఇస్మాయిల్, శ్రీరామ



చిట్ఫండ్ ఫైనాన్స్ మేనేజర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థల బంద్ ను విజయవంతం చేయాలి...

**రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించాలి**

**అమరచింత జూలై 7( స్కై న్యూస్)** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించే విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని పిడిఎస్ యు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ కోరారు మంగళవారం



ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దనే విద్యా శాఖను ఉంచుకోవడం వల్ల సకాలంలో సరియైన నిర్ణయాలు తీసుకోకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 10 న నిర్వహించే బందును విజయవంతం చేయాలని కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే నిర్మాణం చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఖాళీగా ఉన్న ఆధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని విద్యార్థులకు బకాయిలో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ప్రైవేటీకరణకు ముగ్గు చూపడం వల్ల పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలను మూసివేసేందుకు కుట్రలు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు వెంకటేష్ రఘు చంటి తదితరులు పాల్గొన్నారుల

# దివ్య చేనేత సహకార సంఘం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక...

**జోగులాంబ గద్వాల, జూలై 7 (స్కై న్యూస్):** చేనేత సహకార సంఘాల ఎన్నికల సందర్భంగా మల్దకల్ మండలంలోని బూడిదిపాడు దివ్య చేనేత సహకార సంఘం (హెచ్‌డబ్ల్యూసీఎస్) నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ౘాఅవవఅ ంబఅఅయి దీవస్త్రబఎ సంఘం కమిటీ ఎన్నికలను నిర్వహించి ఫలితాలను ప్రకటించారు.సంఘ అధ్యక్షుడిగా కొంకటి ఆంజనేయులు, ఉపాధ్యక్షురాలిగా దామ సుజాత, ప్రధాన కార్యదర్శిగా పులిపాటి సుజాత, కోశాధికారిగా నీలి లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు.అలాగే సంఘ డైరెక్టర్లుగా క్యామ తిమ్మప్ప, నీలి దశరథ, పులిపాటి రంగన్న, భీంపల్లి రాజు ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారి నూతన కమిటీ సభ్యులకు సంఘ నిర్వహణ, పారదర్శకత, సభ్యుల సంక్షేమానికి సంబంధించిన పలు సూచనలు చేశారు.నూతన అధ్యక్షుడు కొంకటి ఆంజనేయులు మాట్లాడుతూ, సంఘ సభ్యుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం ద్వారా చేనేత కార్మికులకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి సభ్యునికి న్యాయబద్ధంగా, పారదర్శకంగా అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ అభివృద్ధితో పాటు సభ్యుల సంక్షేమం కోసం సమష్టిగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.



# ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు...

**ఆత్మకూర్ జులై 7( స్కైన్యూస్)** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం పలువురు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అనేక హక్కులను కల్పించడం జరిగిందని నేడు మందకృష్ణ మాదిగ వాటిని కాపాడుతూ ప్రజలను చైతన్యం చేస్తూ హక్కుల సాధనకు ఎన్నో పోరాటాలు నిర్వహించి దళిత బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారని కొనియాడారు. ఏబిసిడి వర్గీకరణతో పాటు వికలాంగుల సమస్యలపై పోరాటాలు నిర్వహించి ప్రభుత్వంతో చర్చలు జరిపి అనేక సంక్షేమ పథకాలను అందించడంలో కృషి చేశారన్నారు ఈ కార్యక్రమంలో వాడు కౌన్సిలర్ దండు శ్రీనివాసులు నాయకులు గాలి పంపు శ్రీనివాసులు సిద్దన్న కృష్ణ అంజి మహిళా హక్కుల నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు



# కాంగ్రెస్ పార్టీ బాయ్ బాయ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరిక



**దేవరకద్ర జులై 7 (స్కై న్యూస్);** దేవరకద్ర మండలం డోకూరు గ్రామానికి చెందిన నెతుల మారుతి,గుపని శివకుమార్,మల్లెల ఈరన్న,హరీష్,భాస్కర్,జంగ నాగేష్ తో పాటు కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు మంగళవారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవ్వరి బలంతం లేకుండా బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అధిష్టానం మేరకు దేవరకద్ర నియోజకవర్గం లో బి ఆర్ ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పాతవారు కొత్తవారు కలిసికట్టుగా గ్రామ బూత్ లెవెల్ నుంచి అభివృద్ధి తీసుకువస్తూ పార్టీ సభ్యత్వం ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు.

# గుడిలో అర్చకులను దూషించి మాట్లాడిన యుగంధర్ రెడ్డి

**ఆత్మకూర్ జూన్ 7(స్కై న్యూస్)** ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో పాండురంగ స్వామి ఆలయం అర్చకుడు శ్రీధర్ జోషిని చైర్మన్ యుగంధర్ రెడ్డి అర్చకుడు పైదూషించి మాట్లాడటంపట్ల బ్రాహ్మణ సంఘాలు అగ్రహం వ్యక్తం చేశాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దివాంజి శ్రీనివాసరావుమాట్లాడుతూ ఒక అర్చకుని పట్ల దూషించి మాట్లాడడం సరికాదని ఆయన చెప్పారు అర్చకుడికి యుగంధర్ రెడ్డిక్షమాపణ చెప్పకుంటే రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు శంకర్రావు ప్రభాకర్ రావు తదితర వ్యక్తులు పాల్గొన్నారు

# ధరూర్ మండలంలోని మూడు పాఠశాలలను సందర్శించిన డీ ఈవో విజయలక్ష్మి

**జోగులాంబ గద్వాల, జూలై 7 (స్కై న్యూస్):** జిల్లా ధరూర్ మండలంలోని ఎములోనిపల్లి, చిన్నచింతరేవుల, నర్సందొడ్డి ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మి గారు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పూర్తిస్థాయిలో అందాయా లేదా అనే విషయాన్ని పరిశీలించి, పంపిణీ ప్రక్రియపై ఆరా తీశారు. విద్యార్థులకు బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి దానికి అనుగుణంగా బోధనను నిర్వహించాలని సూచించి, అనంతరం విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి పఠన, రచన, గణిత సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరిచేలా నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం (వీఐవీ) అమలును కూడా పరిశీలించిన జిల్లా విద్యాశాఖాధికారి, ఆహారం నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, మెనూ అమలుపై వివరాలు



తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం సమయానికి అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యాస పురోగతి, మౌలిక సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

# అచ్చంపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

**: ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ**

**అచ్చంపేట, నాగర్ కర్నూల్ జిల్లా:** ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా అచ్చంపేట నియోజకవర్గంలో వైద్య సేవలను మరింత అందుబాటులోకి తెస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షల కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు.

**పబ్లిక్ క్లబ్ -- శ్రీ మహాలక్ష్మి మాక్స్ విజన్ సంయుక్త ఆధ్వర్యం:**

స్థానిక పబ్లిక్ క్లబ్ మరియు శ్రీ మహాలక్ష్మి మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో అత్యాధునిక పరికరాలతో నిపుణులైన వైద్య బృందం ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తోంది.

**వైద్య శిబిరం ముఖ్య విశేషాలు:**

**ఉచిత పరీక్షలు:** శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ నిపుణులైన డాక్టర్లచే ఉచిత కంటి పరీక్షలు.

**ఉచిత ఆపరేషన్లు:** పరీక్షల అనంతరం కంటి శస్త్రచికిత్సలు (ఆపరేషన్లు) అవసరమని తేలిన వారికి, నిపుణులైన సర్జన్లచే ఉచితంగా ఆపరేషన్లు



నిర్వహించనున్నారు.

**ఎమ్మెల్యే పిలుపు:** "కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు ఈ శిబిరం ఒక మంచి అవకాశం. నియోజకవర్గ ప్రజలు, పరిసర ప్రాంతాల వారు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పెద్ద సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవాలి." అని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ సభ్యులు, కార్యక్రమ నిర్వాహకులు, పట్టణ ప్రముఖులు, వైద్య సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మెడిసిటి ఇన్‌స్టిట్యూట్‌కు ప్రతిష్టాత్మక (ఎన్ఎబి హెచ్) గుర్తింపు




**మేడ్చల్ జులై 07( వార్తా తరంగాలు ):** నాణ్యమైన వైద్య సేవలకు గుర్తింపుగా ఘన్‌పూర్‌లోని 'మెడిసిటి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' ప్రతిష్టాత్మక ఎన్ ఎ బిహెచ్ అక్రిడేషన్‌ను సాధించింది. రాష్ట్రంలోని అతికొద్ది టీచింగ్ హాస్పిటల్స్‌కు మాత్రమే దక్కే ఈ గౌరవాన్ని మెడిసిటి దక్కించుకుంది.వైద్య సేవల నాణ్యతను పెంచేందుకు సంస్థ చేస్తున్న కృషికి ఈ గుర్తింపు నిదర్శనమని సీఈఓ శ్రీ ఐనిష్ మర్చంట్ తెలిపారు. 1993లోనే హైదరాబాద్‌లో బైపాస్, స్టెంట్ చికిత్సలను అందుబాటులోకి తెచ్చిన ఘనత మెడిసిటిదేనని సంస్థ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ పేర్కొన్నారు. ఈ గుర్తింపు శాశ్వతం కాదని, నాణ్యతా ప్రమాణాలను నిరంతరం కాపాడుకుంటూ ప్రతి 2-3 ఏళ్లకు పునఃసమీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందని యాజమాన్యం వివరించింది.?ఈ సమావేశంలో సీఈఓ శ్రీ ఐనిష్ మర్చంట్, ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ, ప్రిన్సిపల్ డా. దేవేంద్ర సింగ్ నేగి పాల్గొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక సేవలను అందుబాటులోకి తెస్తామని వారు ప్రకటించారు.

వార్తాతరంగాలు



## ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసిన డీ ఈ ఓ



**చర్ల జులై 7 (స్కై న్యూస్ ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల మండలం, గుంపెనగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు సేవా నిబంధనలు ఉల్లంఘించిన నేపథ్యంలో వారిపై కఠిన చర్యలు తీసుకోబడినట్లు జిల్లా విద్యాధికారి శ్రీమతి డి. వాసంతి తెలిపారు.శ్యామల సత్తిబాబు ఎస్ జీ టీ తరచూ అనుమతి లేకుండా సెలవులు తీసుకోవడం, విధులకు హాజరు కాకపోవడం,మద్యం సేవించిన స్థితిలో పాఠశాలకు రావడం వంటి ఆరోపణలు ఉన్నట్లు గుర్తించబడింది.శ్రీమతి మామిడి చూడామణి ఎస్ జీ టీ కూడా అనుమతి లేకుండా తరచుగా సెలవులు తీసుకోవడం ద్వారా విద్యా కార్యక్రమాలకు ఆటంకం కలిగించినట్లు నిర్ధారణకు వచ్చింది.ఈ చర్యలు విద్యార్థుల విద్యపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు, ప్రభుత్వ సేవా నియమాలకు విరుద్ధంగా ఉన్నాయని,అందువల్ల, తెలంగాణ సివిల్ సర్వీసెస్ నియమావళి 1991 ప్రకారం, పై ఇద్దరు ఉపాధ్యాయులను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయబడినట్లు జిల్లా విద్యాధికారి తెలిపారు.జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడానికి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై ఇలాంటి చర్యలు కొనసాగుతాయని జిల్లా విద్యాధికారి స్పష్టం చేశారు.

## అందమైన నగరంగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి

**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జూలై 07 (స్కై న్యూస్)** పిలుపునిచ్చారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా మంగళ వారం ఉదయ్ నగర్ పవర్ హౌజ్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ కంకణాల మౌనిక తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా తీర్చే క్రమంలో గత ఐదు నెలలుగా డ్రైనేజ్ లలో పూడిక తీత కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతున్నదని అన్నారు . నగర పాలక సంస్థ ఆద్వర్యంలో ఒక ప్రక్క కాలువలలో పూడిక పూడిక తీత కార్యక్రమం చేపడుతుంటే మరో ప్రక్క అదే కాలువల్లో చెత్త వేస్తుండడంతో యధావిధిగా తయారవుతున్నదని అన్నారు . చెత్త వేయవద్దని ఇన్నాళ్ళూ అవగాహన కల్పించామని ఇక జరిమానాలు విధించక తప్పదని అన్నారు. కేవలం రూ 50/- చెల్లిస్తే నెల రోజుల పాటు ఇంటి ముందుకే వచ్చి చెత్త తీసుకెళ్ళే అవకాశం ఉండగా రోడ్లపై , నాలాల్లో వేయడం సరికాదని అన్నారు . స్వచ్ఛ రామగుండంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో పాలు పంచుకోవాలని అన్నారు . గత కొన్ని సంవత్సరాలుగా ఎవరూ పట్టించుకోక పోవడంతో బొందల గడ్డ గా మారిన నగరాన్ని నవ నిర్మాణం చేస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తున్న ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ కు సహకరించాలని అన్నారు. గంగా నగర ఫ్లై ఓవర్ ప్రక్కన సర్వీస్ రోడ్డు వెంబడి వెలసిన అక్రమ కట్టడాలతో రహదారి ఇరుకుగా మారి అనేక ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాటిని తొలగించడం జరిగిందని అన్నారు. రోడ్డు కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు కూడా తొలగించడం జరిగిందని అన్నారు. రోడ్డు మీద ఉన్న విద్యుత్ స్తంభాలు కూడా వెనక్కి తరలించవల్సిందిగా ఎన్ పి డి సి ఎల్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. పదేళ్లుగా పట్టించుకోని నాలాలో యంత్రాల సహాయంతో పూడిక తొలగించి శుభ్రం చేయడం జరిగిందని అన్నారు. . ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డి .ఇ .ఇ శ్రీకాంత్ , ఎ ఇ తేజస్విని , టి పి ఎస్ నవీన్ , సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం , జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి , ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్ , సానిటరీ జవాన్ సోమేష్ , వాటర్ సప్లయ్ సూపర్వైజర్ శశి కుమార్ , స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పర్దిపూర్ గ్రామంలో నూతన "సాయి చంద్ర లేడీస్ కార్నర్" ప్రారంభోత్సవం

**సర్పంచ్ తెలుగు శివకుమార్**



**చిన్న చింతకుంట జులై 7 (స్కై న్యూస్);** చిన్నచింతకుంట మండలంలోని పర్దిపూర్ గ్రామానికి చెందిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు చంద్రన్న కుమారుడు రాజు నూతనంగా ఏర్పాటు చేసిన "సాయి చంద్ర లేడీస్ కార్నర్ " దుకాణాన్నిపర్దిపూర్ గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ మంగళవారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వ్యాపారంలో చిన్నది పెద్దది అనుకోకుండా మనకు అనుభవం ఉన్న వ్యాపారం చేసుకుని జీవనోపాధి చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరటి నర్సింహారెడ్డి , బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోట రాములు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బంధుమిత్రులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజు కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ "సాయి చంద్ర లేడీస్ కార్నర్" విజయవంతంగా అభివృద్ధి చెందాలని, రాజు వ్యాపారంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ తమ శుభాభినందనలు తెలియజేశారు

## మంత్రి పర్యటన అడ్డుకుంటాం

**మాజీ జడ్పిటిసి శ్రీశైలం**



**నాగర్ కర్నూల్ జులై 7 (స్కై న్యూస్)** రైతులను మోసం చేసి అక్రమంగా రైతుల నుండి డబ్బులు వసూలు చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు పై చర్యలు తీసుకోకపోతే మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనను అడ్డుకుంటామని మాజీ జడ్పిటిసి చిక్కంద్ర శ్రీశైలం హెచ్చరించారు మంగళవారం మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు అక్కడికి ధాన్యాన్ని తరలించిన రైతుల నుండి హమాలీ మరియు రవాణా పేరుతో ప్రతి సంచికి డబ్బులు వసూలు చేశారని అన్ని ఆధారాలను అధికారులకు వివరించిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ అండదండలతో చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని అడ్డం పెట్టుకొని ఎమ్మెల్యే ఎమ్మెల్సీ అండదండలతో భూదందాలు కూడా నిర్వహించారని ఆరోపించారు అతనిపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా తెలిసేలా తమ కార్యక్రమం రూపొందిస్తామని అన్నారు ఈ సమావేశంలో నాగార్జున రామకృష్ణారెడ్డి మన్యపురెడ్డి విష్ణు సాగర్ మాజీ మార్కెట్ చైర్మన్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

# షాద్‌నగర్‌లో సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా భారీ ధర్నా..

**జీవో నెం. 641 రద్దు చేయాలని డిమాండ్**

**ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి విమర్శలు**







**రంగారెడ్డి జిల్లా, జూలై 7 (స్కై న్యూస్):** సిద్ధాపూర్ ప్రాంతంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ షాద్‌నగర్ చౌరస్తాలో డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మే సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాలమూరు ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం ఆందోళనకారులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల రైతులు, వ్యవసాయ కూలీలు, గిరిజనులు, విద్యార్థులు, మహిళలు, పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటూ ప్రభుత్వం జీవో నెం. 641ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు సంబంధించి రూ.50 కోట్ల ముడుపులు అందినట్లు తమ వద్ద సమాచారం ఉందని ఆరోపించారు. అయితే దీనికి సంబంధించి ఎలాంటి ఆధారాలను ఆయన వెల్లడించలేదు. ముడుపులు తీసుకోకపోతే ఎమ్మెల్యే ప్రజలతో కలిసి ఉద్యమంలో పాల్గొనాలని, అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి డంపింగ్ యార్డ్‌ను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. జీవో 641 రద్దు కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే బీఆర్ఎస్ అగ్రనేతలను కూడా ఈ పోరాటంలో భాగస్వాములను చేస్తామని తెలిపారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యేలు బక్కని నరసింహులు, ప్రతాప్ రెడ్డి తదితరులు కూడా ప్రజా సమస్యపై స్పందించి ఉద్యమంలో పాల్గొనాలని నవీన్ కుమార్ రెడ్డి కోరారు. ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్న సమయంలో మౌనంగా ఉండటం సరికాదని వ్యాఖ్యానించారు. డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మే సత్యనారాయణ మాట్లాడుతూ, గతంలో "ఈ మండలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కానివ్వను" అని చెప్పిన స్థానిక ఎమ్మెల్యే ఇప్పుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీవో నెం. 641 రద్దు అయ్యే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి కూడా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించాలని కోరారు. ధర్నా కారణంగా షాద్‌నగర్ చౌరస్తాలో సుమారు 40 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి రాకపోకలను పునరుద్ధరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, కడంపల్లి శ్రీనివాస్ గౌడ్, దేవేందర్ యాదవ్, కోస్గి శ్రీనివాస్, కౌన్సిలర్ నందారం అశోక్ యాదవ్, యుగంధర్, రామకృష్ణ, దినేష్ సాగర్, శివాచారి, మధుసూదన్ రెడ్డి, వంకాయల నారాయణరెడ్డి, జూపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా రద్దు రాజ్యాంగ విరుద్ధం...

**రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలి**

**కేబీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు**





**నాగర్ కర్నూల్ జులై 7( స్కై న్యూస్)** న్యాయస్థానం దళిత క్రైస్తవులను ఎస్సీలు కాదని తీర్పులు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని కేంద్ర ప్రభుత్వం దళిత క్రైస్తవుల పక్షాన సుప్రీంకోర్టు పూర్తి బెంచ్ ని ఆశ్రయించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు మంగళవారం జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సదస్సుకు జిల్లా కార్యదర్శి పులిజాల పరుశరాములు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే రాజ్యాంగపరమైన హక్కులు ఎస్సీ హోదా రద్దవుతుందని సుప్రీంకోర్టు తీర్పుర ఇచ్చి దళితుల గుండెపై దాడి చేసిందని ఎస్సీ హోదా రద్దు అని తీర్పు ప్రకటించడం హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు . భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 మరియు 15 మరియు 16 మరియు 25 లను హత్య చేసిందని అన్నారు బౌద్ధ మరియు సిక్కు మతాలలోకి వెళితే రాజ్యాంగ హక్కులు యధావిధిగా ఉన్నప్పుడు క్రైస్తవ మతం స్వీకరిస్తే హక్కులు మరియు చట్టాలు ఎందుకు రద్దు అవుతాయని ప్రశ్నించారు. మార్చి 24న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి మత విశ్వాసాలకు సామాజిక న్యాయం రాజ్యాంగ లక్షల మీద దాడి చేసే విధంగా ఉందని అన్నారు తనకు నచ్చిన మతాన్ని స్వీకరించడం విశ్వాసాలు నమ్మకాల ఆధారంగా వస్తుందని మతం ఆధ్యాత్మిక విశ్వాసం అని అన్నారు. క్రైస్తవంలోకి వెళ్ళిన వారిలో దళితులుగా మాత్రమే కుల వివక్ష అంటరానితనానికి ఎందుకు గురవుతున్నారో చెప్పాలని దళిత పాస్టర్లు ఎందుకు దౌర్జన్యాలకు దాడులకు అర్చనకు గురవుతున్నారని అన్నారు. 1991లో చుండూరులో హత్య చోటుచేసుకుందని అందులో దళితులు ఉన్నారన్నారు. దళితులు 15% రిజర్వేషన్ పొందుతున్న వారు దళితులు క్రైస్తవ మతం పుచ్చుకుంటే ఒక్క శాతానికి వారు రిజర్వేషన్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు 27% రిజర్వేషన్ ఓసీలు 10% ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ పొందుతున్నారని అన్నారు. దళితులను గుడిలోకి రానివ్వరు అక్కడ చర్చిలోకి పోలివ్వరు మరి దళితుల బతుకులు ఎలా భరోసా కల్పిస్తారని ప్రశ్నించారు. రాజ్యాంగ విరుద్ధంగా 1950లో తెచ్చిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ను రద్దు చేయాలని కేజీ బాలకృష్ణన్ కమిషన్ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పర్వతాలు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు పాలమూరు యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ నరేందర్ దళిత పాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షులు జాన్ బుచ్చయ్య లెక్చరర్ సంపత్ జీలుకాస్ క్రిస్టఫర్ రాజరత్నం మార్టిన్ లూథర్ కెవిపిఎ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న ఉపాధ్యక్షుడు హనుమంతు అశోక్ మంత్రి వెంకటయ్య బంగారయ్య చంద్రయ్య మహేష్ తదితరులు పాల్గొన్నారు

## బస్తీ దవాఖాన చిట్టి రామవరం తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్





**కొత్తగూడెం జూలై 7( స్కై న్యూస్):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ చిట్టి రామవరం బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో అందిస్తున్న వైద్య సేవలు, రోగుల నమోదు, ఔట్ పేషెంట్ , ఇన్ పేషెంట్ సేవల వివరాలను సమీక్షించారు.అనంతరం అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి, నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, శిశువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు.ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, అతిసార వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరంతో వచ్చే ప్రతి రోగికి అవసరమైన పరీక్షలు నిర్వహించి, తక్షణ చికిత్స అందించాలని తెలిపారు.దవాఖానలో మందుల నిల్వలు, ప్రయోగశాల సేవలు, పారిశుద్ధ్యం, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ తుకారం రాథోడ్ సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అజయ్ నర్సింగ్ ఆఫీసర్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన కొత్త ముగ్గురు ఎస్సైలు

**జోగులాంబ గద్వాల, జూలై 7 (స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజక వర్గం లోని రాజోలి, ఐజ, ఉండవల్లి, పోలీస్ స్టేషన్ లకు కొత్త రాజోలి(కిరణ్ కుమార్) , ఐజ (గురుస్వామి) ఉండవల్లి(సురేష్) లు బాధ్యతలు చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా వీరు ఈరోజు ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ .ఏ .సంపత్ కుమార్ గారినీ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

## బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలి...





**ఎమ్మెల్యేకు వినతి**

**నాగర్ కర్నూల్ జులై 7( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు చెల్లించవలసిన బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి పొదిల రామయ్య మాట్లాడుతూ కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న శానిటేషన్ మరియు పేషంట్ కేర్ సెక్యూరిటీ గార్డు రంగాల కార్మికులకు గత రెండు నెలలు వేతనాలు కాంట్రాక్టర్ చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేసే కార్మికులకు ప్రతినెల వేతనాలు చెల్లిస్తే నిత్యవసర వస్తువులతో పాటు కనీస అవసరాలు తీర్చుకుంటారు కానీ నెలలుగా వేతనం చెల్లించకపోవడంతో ఎలా జీవిస్తారని ప్రశ్నించారు నిత్యం ఎంతో రద్దీగా ఉండే సాధారణ ఆసుపత్రికి వేలాదిమంది వైద్య సేవలు పొందేందుకు వస్తున్నారని అన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనం ఇవ్వవలసి ఉండగా 11 వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని 2000 రూపాయలు ఈఎస్ఐ పిఎఫ్ పేరుతో తగ్గిస్తున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ఉషారాణి కార్మికులు బాలమణి రాధా కృష్ణమ్మ రేణుక వెంకటమ్మ అలివేల భాగ్యం మహాలక్ష్మి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు

## వికెసీఎం హరితహారం కార్యక్రమంలో పాల్గొన్న

# సింగరేణి డైరెక్టర్ (పి ఉ పి) కె . వెంకటేశ్వర్లు

**సింగరేణి జూలై 7( స్కై న్యూస్):** సంస్థ చేపడుతున్న హరిత కార్యక్రమాల్లో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని వికెసీఎం నందు నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పి ఉ పి) కె , వెంకటేశ్వర్లు పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనం పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందించేందుకు హరితహారం కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డైరెక్టర్ (పి ఉ పి) వికెసీఎం వ్యూ పాయింట్ వద్ద నుంచి ప్రాజెక్టులో జరుగుతున్న ఉత్పత్తి కార్యకలాపాలను పరిశీలించారు. ఉత్పత్తి, యంత్రాల పనితీరు, భద్రతా ప్రమాణాల అమలును సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సమయానికి చేరుకునేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ఉత్పత్తి



సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, గనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్జైరెక్టర్ పి ఉ పి కె వెంకటేశ్వర్లు తో పాటు, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు , ఎన్విరాన్మెంట్ జిఎం బి సైదులు ,వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్



ఎం.వి. నరసింహారావు,ఎస్ఓటూ జీఎం ఎం గోవిందరావు , పర్సనల్ మేనేజర్ ఎల్ తిరుపతి , ఏ జీఎం (ఫైనాన్స్) బీభత్స , ఏరియా ఇంజినీర్ వి రామకృష్ణ , డిజిఎం (ఐఈడి) ఎన్ యోహాన్, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ , ఐఎన్టియుసి ఫిట్ సెక్రెటరీ గోపు కుమార్ ఏఐటియుసి ఫిట్ సెక్రెటరీ ప్రసాద్ ఏరియా అధికారులు, యూనియన్ నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

# రాజకీయ భవిష్యత్‌పై చర్చ

**రంగారెడ్డి జిల్లా, జూలై 7 (స్కై న్యూస్):** షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి రాజకీయ భవిష్యత్‌పై ఆయన అనుచరుల్లో చర్చ కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీలో చేరి చాలా కాలమైనప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి కీలక పదవి లేదా నామినేటెడ్ బాధ్యత దక్కకపోవడంతో అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది జన్మదిన వేడుకలను అభిమానుల మధ్య నిర్వహించే ప్రతాప్ రెడ్డి ఈసారి విదేశాల్లో ఉన్నట్లు సమాచారం. దీంతో



ఆయన జన్మదిన వేడుకలకు దూరంగా ఉండటం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దూసకల్ గ్రామానికి చెందిన ప్రతాప్ రెడ్డి 2009లో షాద్‌నగర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరి, 2023లో మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు భవిష్యత్తులో ఏదైనా కీలక బాధ్యత అప్పగిస్తుందా అనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## రతన్ కాలనీలో ప్రత్యేక ఓటరు సవరణ పై అవగాహా కార్యక్రమం..



**రంగారెడ్డి జిల్లా, జూలై 7 (స్కై న్యూస్):** షాద్‌నగర్ పట్టణంలోని 22వ వార్డు రతన్ కాలనీలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటింటికీ వచ్చే బూత్ స్థాయి అధికారులకు అవసరమైన వివరాలను సక్రమంగా అందజేసి దరఖాస్తులు పూర్తి చేయాలని సూచించారు. ఓటరు వివరాల్లో మార్పులు, కొత్త ఓటరు నమోదు, చిరునామా మార్పులు వంటి అంశాలను సకాలంలో నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే దరఖాస్తు సమర్పించిన తర్వాత అధికారులు ఇచ్చే రసీదును భద్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ నడికూడ అనితా రఘునాథ్ యాదవ్, బూత్ స్థాయి అధికారులు, కాలనీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# నేడు మంత్రి పొన్నం రాక....

**ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జిల్లా అధికారులు**

**నాగర్ కర్నూల్ జులై 7( స్కై న్యూస్)** జిల్లాలోని నాగర్ కర్నూల్ కొల్లాపూర్ నియోజక వర్గాలను పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేపట్టేందుకు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పర్యటించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టే కార్యక్రమాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించి సభ ఏర్పాట్లను త్వరితగతను పూర్తి చేసి విజయవంతానికి అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని తిమ్మాజీపేట మండల కేంద్రంలో టీజీఎస్ ఆర్టీసీ బస్ స్టేషన్ లో పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారని 12 గంటలకు బిజినేపల్లి మండలంలోని పాలెం గ్రామంలో నూతన సబ్ స్టేషన్ ను ప్రారంభిస్తారని వివరించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభిస్తారని అనంతరం నూతన ప్రాంతీయ రవాణా కార్యాలయం



ప్రారంభించి అత్యధిక సౌకర్యాలతో జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని ఆయన వివరించారు. నాగర్ కర్నూల్ వనపర్తి రోడ్లలో నడవనున్న నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులో ప్రారంభించిన అనంతరం సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు సాయంత్రం నాలుగు గంటలకు మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని



ప్రారంభిస్తారని వివరించారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ నూతన భవనాల శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని కార్యక్రమాలు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు

## షాద్‌నగర్‌లో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

**రంగారెడ్డి జిల్లా, జూలై 7 (స్కై న్యూస్):** షాద్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవంతో పాటు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పెంటనోల్ల నరసింహ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు



జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ, మూడు దశాబ్దాల ఉద్యమ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ



సాధ్యమైందని అన్నారు. అణగారిన వర్గాల హక్కులు, సంక్షేమం కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాడిందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, దక్కలి హక్కుల పోరాట సమితి నాయకులు, మహిళలు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ బషీర్బాగ్ నగర శాఖఆధ్వర్యంలో "క్లీన్ క్యాంపస్ - గ్రీన్ క్యాంపస్"

**హైద్రాబాద్ జులై 7;**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆలియా జూనియర్(బాలుర) కళాశాల ఆధ్వర్యంలో జూలై 9 జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా "క్లీన్ క్యాంపస్ -- గ్రీన్ క్యాంపస్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం మరియు ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. విద్యార్థుల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఏబీవీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి



సురేందర్ మాట్లాడుతూ, ఏబీవీపీ కేవలం విద్యార్థి సమస్యలపై ఉద్యమాలు చేసే సంస్థ మాత్రమే కాదని, సమాజ నిర్మాణంలోనూ తనదైన పాత్ర పోషిస్తున్న జాతీయ విద్యార్థి సంస్థ అని అన్నారు. ఏబీవీపీ పరివర్తనాత్మక ఆలోచనలతో విద్యార్థి క్షేత్రంలో సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, సామాజిక బాధ్యతా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మమత, సింధూరి, రఘునందన్, రాంప్రసాద్, అక్షిత, మరియు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమన్వయంతో అంటువ్యాధులను నివారించాలి

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ జులై 7( స్కైన్యూస్)** జిల్లాలో అన్ని శాఖల అధికారులు ఇబ్బంది సమన్వయంతో పనిచేస్తూ వర్షాకాలంలో సంభవించే అంటూ వ్యాధులను నివారించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు మంగళవారం సమావేశ మందిరంలో నిర్వహించిన రీజనల్ వ్యాధుల సమన్వయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామా పంచాయతీలలో పట్టణ వార్డులలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని మురుగు కాలువలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను దోమల పెరుగుదలను అరికట్టడానికి ఆయిల్ బాల్స్ వేయాలని ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. అధికారులు నిర్వహించే కార్యక్రమాలకు





ప్రజాప్రతినిధులు సహకరించాలని అన్నారు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని క్లోరినేషన్ చేసిన తర్వాతనే నీటిని విడుదల చేయాలని సూచించారు. డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ తదితర విష జ్వరాలు అవకాశమున్న సందర్భంలో పరీక్షలు నిర్వహించేందుకు కిట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు ఈనెల 13న నిర్వహించే జాతీయ నూలి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే కృష్ణ మెడికల్ సూపరిడెంట్ డాక్టర్ ఉషారాణి డిసిహెచ్ఎస్ డాక్టర్ రామకృష్ణ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవికుమార్ డాక్టర్ రాజశేఖర్ డాక్టర్ కృష్ణమోహన్ జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి డాక్టర్ భీమా నాయక్ డాక్టర్ తారా సింగ్ ఉపజిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి డిపిఓ రేణయ్యా ఏపీడే మియాలజిస్ట్ డాక్టర్ ప్రవళిక ఏపీవోలు విజయకుమార్ కళ్యాణ్ కృష్ణారావు సిపిఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు

## మృతి చెందిన హోంగార్డ్ కుటుంబానికి

# రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేత

**కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుంది -- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఐపీఎస్**

**నారాయణపేట జూలై 7( స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బాలకృష్ణ కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ మానవతా దృక్పథంతో అండగా నిలిచి హోంగార్డు లు సేకరించిన విరాళం. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, శ్రీవారు చేతుల మీదుగా మృతుడి భార్య భవానికి రూ. 50,000ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నారాయణపేట జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వహించిన బాలకృష్ణ, కొత్తపల్లి మండలం గోకుల్ నగర్‌కు చెందినవారు. ఆయన ఆకస్మిక మరణంతో భార్య భవాని, ముగ్గురు చిన్నారులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న హోంగార్డ్ అధికారులు, సిబ్బంది, బ్యాచ్ మిత్రులు తమ తోటి సహచరుడి కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి



రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ... పోలీస్ కుటుంబంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు అందరూ ఒక్కటిగా నిలబడటం పోలీస్ శాఖ గొప్ప సంప్రదాయమని అన్నారు. బాలకృష్ణ సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే, తమ సహచరుడి కుటుంబానికి చేయూత అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన హోంగార్డ్ అధికారులు, సిబ్బంది, బ్యాచ్ మిత్రులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవాభావం, మానవత్వం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఈ ఆర్థిక సహాయం అందించిన జిల్లా ఎస్పీతో పాటు హోంగార్డ్ అధికారులు, సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్ సిబ్బంది, మృతుడి కుటుంబ సభ్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# రూ.5.60 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జిల పనులు తుది దశలో

**రంగారెడ్డి జిల్లా, జూలై 7 (స్కై న్యూస్):** కొందుర్గు మండలంలోని రేగడి చిల్కమర్రి--రామచంద్రపురం గ్రామాల మధ్య రూ. 5.60 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జిలు, కల్వర్టుల పనులు తుది దశకు చేరుకున్నాయి. నిర్మాణ పనులను కొందుర్గు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తంరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో మండలంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణాలకు నిధులు మంజూరై పనులు పూర్తయ్యాయని చెప్పారు. కొందుర్గు మండలానికి ఏకీకృత పాఠశాల, పరిగి రహదారి నాలుగు లైన్ల విస్తరణ,



మినీ స్పోర్ట్స్ స్టేడియం వంటి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు అంజిరెడ్డి, ఏఈ తేజ్ మెహ్రాన్, కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు బుధవారం 08 జూలై 2026

## డంపింగ్ యార్డ్ హటావో -- సిద్ధాపూర్ బచావో నినాదాలతో షాద్‌నగర్‌లో ధర్నా





**రంగారెడ్డి జిల్లా, జూలై 7 (స్కై న్యూస్):** సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ "డంపింగ్ యార్డ్ హటావో -- సిద్ధాపూర్ బచావో" నినాదాలతో షాద్‌నగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొని ప్రజల ఉద్యమానికి మద్దతు తెలిపారు. ధర్నా అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన ఆందోళనకారులు, డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, ఎమ్మె సత్యనారాయణ, కడెం శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ రామకృష్ణతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు..



**రంగారెడ్డి జిల్లా, జూలై 7 (స్కై న్యూస్):** చేవెళ్ల మండలం కేసరం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి--163పై గుర్తుతెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీకొట్టి పరారైంది. ఈ ఘటనలో బాధితుడికి తలకు, కాలికి గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో బాధితుడిని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు తన పేరు పవన్, స్వస్థలం తాండూరు అని మాత్రమే చెబుతున్నాడని, ఇతర వివరాలు తెలియజేయలేకపోతున్నాడని పోలీసులు తెలిపారు. అతని వివరాలు తెలిసిన వారు వెంటనే చేవెళ్ల పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్‌హెచ్ఓ విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ధర్నా



**రంగారెడ్డి జిల్లా, జూలై 7 (స్కై న్యూస్):** విద్యుత్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు కందుకూరు మండలంలోని డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు, విద్యుత్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు.

## ప్రమాదాలకు కారణమవుతున్న డివైడర్.. మూసివేయాలని స్థానికుల విజ్ఞప్తి



**రంగారెడ్డి జిల్లా, జూలై 7 (స్కై న్యూస్):** చేవెళ్ల--షాద్‌నగర్ ప్రధాన రహదారిపై కందవాడ గ్రామానికి వెళ్లే మార్గం ఎదురుగా, విద్యావికాస్ కళాశాల సమీపంలో డివైడర్ తొలగించిన భాగం తరచూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోనే యూ-టర్న్ సౌకర్యం ఉన్నప్పటికీ, కొందరు వాహనదారులు నేరుగా డివైడర్ గ్యాప్‌ను ఉపయోగించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. అందువల్ల డివైడర్ తొలగించిన భాగాన్ని వెంటనే మూసివేసి, రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని స్థానికులు, వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## మాల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

**డా. ఉక్కుల అశోక్**



**రంగారెడ్డి జిల్లా జూలై 7 (స్కై న్యూస్):** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి కల్పించాలని దళిత చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఉక్కుల అశోక్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాసేవ, పార్టీ బలోపేతం, నియోజకవర్గ అభివృద్ధిలో మాల్‌రెడ్డి రంగారెడ్డి విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన అనుభవం, ప్రజాదరణ, పార్టీ పట్ల నిబద్ధతను గుర్తించి మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

# ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం**





**మహబూబ్ నగర్, జులై 7(స్కైన్యూస్ ):** ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ నగరంలోని మెట్టుగడ్డ ప్రాంతంలో ఉన్న సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యాలయంలో నిర్వహించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులుగా సేవలందించిన కాలంలో ప్రజల ప్రయాణ సౌకర్యాల కోసం మీరు చేసిన కృషి అపారమని కొనియాడారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా విధి నిర్వహణలో మీరు చూపిన నిబద్ధత, కర్తవ్యనిష్ఠ ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలో మీరు గడిపిన అనుభవం, ప్రస్తుతం సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని, ముఖ్యంగా మహబూబ్ నగర్ అభివృద్ధి దిశగా మీ సూచనలు, ఆలోచనలు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి నెలలో ఒక రోజు ఫోరం కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటాయని, అందుకే వారికి సమీపంలోనే వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం అవసరమని పేర్కొన్నారు. అలాగే, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అవసరమైన వారికి తక్షణ సహాయం అందేలా అధికారులతో సమన్వయం చేస్తానని హామీ ఇచ్చారు. విశ్రాంత ఉద్యోగులకు ప్రస్తుతం అందుతున్న పెన్షన్ చాలా తక్కువగా ఉందని, వారి జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని పెన్షన్ పెంపు అవసరం ఉందని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా సేకరించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. మీరు ప్రభుత్వానికి సేవ చేసిన వారిగా, ఇప్పుడు సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. యువతకు మీ అనుభవాన్ని పంచి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యేని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కార్పొరేటర్ ప్రశాంత్, సల్మాన్ , నాయకులు అబ్దుల్ హక్ , సతీష్, బాను, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షులు రాజాసింహుడు, కార్యదర్శి కె.రవీందర్ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు జగపతి రావు, నాగభూషణం, అంజన్న , నాంజనేయులు, పి.హేమంత్ కుమార్, ఆర్ నారాయణ, అబ్దుల్ కరీం, వహీద్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# అసమానతలు రూపుమాపేందుకే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం....



**నాగర్ కర్నూల్ జులై 7( స్కై న్యూస్)** 33 సంవత్సరాల క్రితం ఎస్సీ వర్గీకరణ ప్రధాన ఎజెండాగా సమాజంలో కొనసాగుతున్న అసమానతలను రూపుమాపేందుకు ఎమ్మార్పీఎస్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ ప్రభుత్వ ఉద్యోగి కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వంకేశ్వరం నిరంజన్ అన్నారు మంగళవారం జిల్లా కేంద్రంలో 33వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ జెండాను వంకేశ్వరం నిరంజన్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ పోరాటంలో భాగంగా మందకృష్ణ మాదిగ నేతృత్వంలో గుండె జబ్బు బాలల కోసం జరిపిన పోరాటాల ఫలితంగానే ఆరోగ్యశ్రీ సాధించడం జరిగిందని వృద్ధులు వితంతువుల వికలాంగుల పెన్షన్ కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల కోసం పదోన్నతులలో రిజర్వేషన్ సాధన అంతిమ లక్ష్యంగా నిర్విరామంగా పోరాటాలు చేయడం జరిగిందని వివరించారు. సమాజంలో ఉన్న మెజార్టీ ప్రజల ఆశయ సాధన అయిన రాజ్యాధికారం కోసం అన్ని వర్గాలను కలిసి పోరాటం నిర్వహిస్తామన్నారు ఈ కార్యక్రమంలో పూట విజయ్ మాదిగ దశరథం మాదిగ కొత్త గంగాధర్ యాకుబ్ మాదిగ మల్లేష్ మాదిగ వెంకటయ్య మాదిగ నిరంజన్ మాదిగ మంతటి గోపి మాదిగ జయశంకర్ మాదిగ జిలకర బాలస్వామి మాదిగ బోనాసిరాజు కోడుపర్తి రాములు మాదిగ మధు తదితరులు పాల్గొన్నారు

# రీబర్త్ సినిమాకు కళాకారుల ఎంపిక పూర్తి





**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జూలై 07(స్కై న్యూస్)** కరీంనగర్ పెద్దపల్లి మంచిర్యాల, ఆసిఫాబాద్, జిల్లాల నుంచి భారీ సంఖ్యలో కళాకారులు పాల్గొన్న ఆడిషన్స్‌నిన్న (06-07-2026) స్నేహ సాహితి గ్రంథాలయం, మార్కండేయ కాలనీ, గోదావరిఖని లో ఆసవి క్రియేషన్స్ - అమేజింగ్ స్టార్ లిఆధ్వర్యంలో త్వరలో నిర్మించబోవు చిత్రం రీబర్త్-మరో జన్మ ఉందో లేదో " కోసం ఆడిషన్స్ విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాలుగు జిల్లాల నుంచి అనేకమంది కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. నిర్మాత లిఅశోక్ వేముల మరియు దర్శకుడు కొత్తూరు ప్రసాద్ చారి గార్లు వ్యక్తిగతంగా ఆడిషన్స్ నిర్వహించి, సినిమాకు అవసరమైన కీలక పాత్రలకు కళాకారులను ఎంపిక చేశారు.

**నిర్మాత అశోక్ వేముల మాట్లాడుతూ,**

ఈ ప్రాంతంలో అద్భుతమైన కళాకారులు ఎంతోమంది ఉన్నారు. సినిమాకు అనువైన అనేక లొకేషన్లు కూడా ఇక్కడ సులభంగా అందుబాటులో ఉన్నాయి. మా రీబర్త్ మరుజన్మ ఉందో లేదో చిత్రం సందేశాత్మక ఇతివృత్తంతో తెరకెక్కుతోంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, దర్శకులు, నిర్మాతలు, సాహిత్యవేత్తలు, నటీనటులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వారందరికీ నిర్మాత ఆసవి క్రియేషన్స్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద మిషన్ భగీరథ పనుల పరిశీలన



**రంగారెడ్డి జిల్లా, జూలై 7 (స్కై న్యూస్):** షాద్‌నగర్ మున్సిపాలిటీ 7వ వార్డులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద కొనసాగుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఇలియాస్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అధైర్యం వద్దు మెరుగైన సేవలు అందుతాయి



**ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ జిల్లా 7( స్కై న్యూస్)** పాము కాటుకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వనపట్ల గ్రామానికి చెందిన కర్రెన్న ను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందని ఎలాంటి అధైర్యం చెందవద్దని త్వరగా కోలుకునే విధంగా త్వరితగతిన వైద్యం అంతే విధంగా వైద్యులు సేవలు అందిస్తున్నారని తెలిపారు అదేవిధంగా వైద్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ఉషారాణి మునిసిపల్ చైర్మన్ తీగల సునింద్ర కుమార్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ డాక్టర్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు

# తామరపువ్వు ఎడారిలో పూస్తదా?

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణలో మూడు రోజులు పర్యటించిన తర్వాత ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, గతంలో వేర్వేరు పదవుల్లో ఉండిన వాడూ అయిన ఒకరిని ఈ విషయమై అడిగినప్పుడు, ఆయన చేసిన వ్యాఖ్య ఈ విధంగా ఉన్నది. తామర పువ్వు ఎడారిల పూస్తదా?. ఆయన ఇంకా ఓ మాట కూడా అన్నాడు. మావోళ్లు ఏవో కలలు కంటుంటరు. అన్నీ పగటి కలలు. అందుకు తగ్గట్టు ఇక్కడ జరిగేది లేదు పెట్టేది లేదు, అని వ్యాఖ్యానించాడు. గతంలో జరిగిందేమిటి, జరగనిది ఏమిటి, రాగల రోజుల్లో ఏమి జరగవచ్చు, ఏమి జరగకపోవచ్చుననే మాటలు కూడా కొంత సేపు సాగాయి. అవన్నీ ఇక్కడ పేర్కొనటంలేదు. ఆయన చెప్పిన వాటి సారాంశం మాత్రం, ఒకప్పటి జనసంఘ్ కాలంలో గాని, తర్వాత వాజపేయి పాలించినప్పుడు గాని, ఇప్పుడు పన్నెండేండ్లుగా మోదీ హయాంలో గాని, ఈ ప్రాంతంలో తమ పార్టీ ఒక స్థాయికి మించి ఎప్పుడూ పైకి పోలేదు. ప్రస్తుత పరిస్థితులను చూసినా, పార్టీ పనితీరును చూసినా, భవిష్యత్తు మీద ఆశలేమీ కలగటంలేదు. రాగల కాలంలో అద్భుతాలేమన్నా జరిగితే తప్ప. చర్చలోకి వెళ్లేముందు పార్టీ అధ్యక్షుని పర్యటన వివరాలను చూద్దాము. ఆయన జూన్ 28 నుంచి మూడు రోజులపాటు తెలంగాణలో ఉన్నారు. లోగడ ఎవరు వచ్చినా ఒకటి రెండు రోజులకు మించి గడపలేదని వార్తలు చెప్పాయి. బిహార్‌కు చెందిన తనకు తెలంగాణతో ప్రత్యక్ష పరిచయం లేనందున, జాతీయ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన దరిమిలా అటువంటి పరిచయం కోసం ప్రయత్నించటం మంచిదే. ఆయన మూడు రోజులలో పలు కార్యక్రమాలలో పాల్గొని, నాయకుల నుంచి కార్యకర్తల వరకు, బీజేపీ మాతృసంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యుల వరకు అందరినీ కలిశారు. పరిస్థితులు తెలుసుకొని, ఇవ్వవలసిన ఆదేశాలు ఇచ్చి, చేయవలసిన హెచ్చరికలు కూడా చేశారు. పార్టీ తక్షణ లక్ష్యం హైదరాబాద్ మహానగరంలోని మూడు కార్పొరేషన్లలో గెలువటం, తదుపరి లక్ష్యం 2028 అసెంబ్లీ ఎన్నికలు గెలిచి రాష్ట్రం లో అధికారానికి రావటమని దిశానిర్దేశం చేశా రు. ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి, హోంమంత్రి, పార్టీ అధ్యక్షుడు ఎప్పుడు వచ్చివెళ్లినా, పార్టీలో కొత్త జోష్ వచ్చింది అని ప్రకటించటం ప్రతిసారీ ఆనవాయితీగా జరిగేదే గనుక ఈ సారి కూడా అవే మాటలు వినిపించాయి. అంతవరకు అంతా బాగున్నది. ఇప్పుడు బీజేపీ అధ్యక్షుని పర్యటన జరిగిన సమయంలో గల మూడు విధాలైన పరిస్థితులను ఒకసారి చూడాలి. మొదటిది, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో వారు పశ్చిమ బెంగాల్‌లో సాధించిన ఘన విజయం. రెండు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో కూడా పరీక్ష పత్రాలు వరుసగా లీకవుతుండటం, అతి ప్రతిష్ఠాత్మకమైన అయోధ్య రామమందిరంలో, మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో భారీ అవినీతి, కుంభకోణాలు బయటపడటం. మూడు సర్ పేరిట జరుగుతున్న ఓటర్ జాబితా సవరణలపై అనుమానాల గందరగోళం ఇంకా కొనసాగటం. ఇవి చాలవన్నట్టు అకస్మాత్తుగా,భారతీయుల పౌరసత్వానికి ఏది గుర్తింపన్న ప్రశ్న తలెత్తి కోట్లాది మంది, ఇంకా చెప్పాలంటే మొత్తం దేశ ప్రజలందరి గుర్తింపును ప్రశ్నార్థకంగా మార్చటం. ఇవి జాతీయ స్థాయి విషయాలే అయినా తెలంగాణ ప్రజలు ఆసక్తితో గమనించినవి, లేదా ఆందోళనకు గురైనటువంటివి. పరీక్ష పత్రాల లీకేజీ వల్ల నష్టపోయిన యువతీ యువకులు తెలంగాణలోనూ భారీ సంఖ్యలో ఉన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ నిరసన కార్యక్రమం జూన్‌లో హైదరాబాద్‌లో జరిగినప్పుడు వారు చాలామంది పాల్గొన్నారు. వారి సోషల్ మీడియా పోస్టింగులు హోరెత్తాయి. ప్రస్తుతం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పట్టుదలగా సాగుతున్న నిరసనను, ఈ అంశం పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని తెలంగాణ యువత కూడా గమనిస్తున్నది. నీట్ పేపర్ లీకేజీ చాలదన్నట్టు, ఒకవైపు కాక్రోచ్ నిరసనలు జరుగుతుండగానే, ఆ నిరసనలు జరిగిన మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో మరిన్ని పేపర్లు లీకయి అందరినీ దిగ్భ్రాంతికి గురి చేశాయి. ఆ రెండు చోట్ల పాలిస్తున్నది డబుల్ ఇంజిన్ సర్కార్లే. బెంగాల్ ఘన విజయం గురించి నితిన్ నబీన్ ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించారు. పార్టీ శ్రేణులను ఉత్సాహపరచటం ఆయన ఉద్దేశం. కానీ, సర్ మూలంగా ఆ గెలుపు తక్కిన దేశంలో వలె తెలంగాణ ప్రజల దృష్టిలోనూ అనుమానాస్పదంగా మారిన విషయం హైదరాబాద్ పర్యటనలో తన దృష్టికి వచ్చిందో లేదో తెలియదు. నేపథ్య పరిస్థితి ఇట్లుండగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఆ పర్యటన మరుసటి రోజున మాట్లాడుతూ, తాము బెంగాల్ కన్నా పక్కా ప్రణాళికతో వస్తున్నామనటం గమనించదగ్గది. సరిగా అవే రోజులలో తెలంగాణలో మొదలైన సర్ కార్యక్రమం ఎంత అస్తవ్యస్తంగా సాగుతున్నదో ఇదీ అది అని గాక అన్ని పత్రికలు ప్రతిరోజూ రాస్తున్నాయి. ఇతర రాష్ట్రాల అనుభవాలు, అంతకన్నా పక్కా ప్రణాళిక అనే ప్రకటనలు, మరొకవైపు క్షేత్రస్థాయిలో తెలంగాణ ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్న గందరగోళాన్ని బట్టి కలిగే అభిప్రాయం ఏమిటి? మోదీ ప్రభుత్వం గురించి, బీజేపీ గురించి, ఎన్నికల సంఘం గురించి? అనగా, 2028 ఎన్నికల నాటికి ఓటర్ల జాబితాలో తమ ఓటు హక్కుపై, ఆ జాబితా ప్రాతిపదికగా జరగగల ఎన్నికల ఫలితాలపై తెలంగాణ ప్రజలకు రెండేండ్ల ముందు నుంచే అనుమానాలు ఏర్పడాలన్నమాట. బెంగాల్ ఉదంతం నిరంతరం భయపెడుతుండాలన్నమాట. నితిన్ నబీన్ పర్యటనకు కొన్ని రోజుల ముందు బయటపడిన అవినీతి కుంభకోణాలు మొత్తం దేశంతో పాటు తెలంగాణను ఆశ్చర్యపరచాయి. ప్రశ్నపత్రాల లీక్ వలె రామమందిరం ట్రస్ట్ అవినీతి, మధ్యప్రదేశ్ భూకుంభకోణం రెండూ కూడా డబుల్ ఇంజిన్ సర్కార్‌ల గొడుగు నీడలో జరిగినవే. మధ్యప్రదేశ్‌లోనైతే సాక్షాత్తు ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్‌పై బలమైన ఆధారాలు బయటకు వచ్చాయి. అయినా తను స్వయంగా పదవి నుంచి వైదొలగకపోవటమే గాక, జాతీయ నాయకత్వం కూడా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. నరేంద్రమోదీ 2014 ఎన్నికల ప్రచారంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వపు అవినీతి కుంభకోణాలపై తీవ్రస్థాయి విమర్శలు చేశారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా అవినీతిని పూర్తిగా అదుపు చేశానని, ప్రధానిగా అవకాశమిస్తే దేశమంతటా అదే పని చేస్తానని పదేపదే నమ్మబలికారు. ప్రజలు ఆ మాట గట్టిగానే నమ్మారు. కానీ అవినీతికి సంబంధించి ప్రపంచంలో ఇండియా ర్యాంక్ 2014లో 175 దేశాల్లో 85 కాగా, 2025లో 182 దేశాల్లో 91కి పడిపోయింది. ఇతరత్రా అవినీతిని ఏమి అరికట్టారో గాని అది తగ్గినట్టు ప్రజలకైతే ఏమీ అనిపించటంలేదు. పెద్దపెద్ద పారిశ్రామికవేత్త లకు, వ్యాపార దిగ్గజాలకు తెలివైన రీతిలో దోపిడీ అవకాశాలు కల్పిస్తున్నట్టు పలువురు నిపుణులు ఎత్తి చూపుతున్నారు. అవినీతిపరులపై నిఘా ఏజెన్సీల దాడులు, కేసులు, వారు బీజేపీలో చేరగానే ఆ ఫైళ్లు మాయం కావటం బీజేపీ వాషింగ్ మెషీన్ పేరిట ప్రసిద్ధికెక్కటం తెలిసిందే.

తమ తిరుగులేని అధికారం గురించి బీజేపీ నేతలు సగర్వంగా చాటుకుంటుంటారు. కానీ అధికారంతోపాటు అవినీతి విస్తరిస్తున్నది. ఇటువంటి వారిని దృష్టిలో ఉంచుకొనే కావచ్చు బ్రిటిష్ ఎంపీ లార్డ్ ఆక్టన్ 1887లోనే, అధికారంతో అవినీతి అబ్బుతుంది, సంపూర్ణ అధికారంతో అవినీతి సంపూర్ణమవుతుంది అన్నాడు. ఇటువంటి డబుల్ ఇంజిన్ సర్కార్‌ను తెలంగాణలో ఆవిష్కరిస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణ ప్రజలకు హామీ ఇస్తున్నారు. నిజానికి తెలంగాణ బీజేపీ నేతలపై వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు, ఇక్కడ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వారి మిత్రపక్షంగా, అవినీతి ఆరోపణలు బాగానే వినిపించేవి. ఆ పార్టీకి ఇక్కడ విలువ లేకపోవటానికి అది కూడా ఒక కారణం.

నితిన్ నబీన్ ఇక్కడ బహిరంగ కార్యక్రమంలో ఏమి మాట్లాడినా, పార్టీ బాధ్యుల నిష్క్రియాపరత, క్షేత్రస్థాయికి వెళ్లకుండా ప్రజలను కలువకుండా ప్రెస్‌మీట్లకు పరిమితం కావటం గురించి అంతర్గత సమావేశాల్లో ఆక్షేపించినట్టు వార్తలు వెలువడ్డాయి. ఇవి నిజమని భావించేందుకు తగు కారణాలున్నాయి. 2025 ఎన్నికల ముందుకాలంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తరచు హైదరాబాద్ వస్తూ, లేదా ఇక్కడి నాయకులను ఢిల్లీకి పిలిపించుకొంటూ పార్టీ కార్యకలాపాల గురించి చర్చించేవారు. ఆయనతో సమావేశం అంటేనే తెలంగాణ నాయకులు భయపడుతుండేవారు. అందుకు కారణం ఎల్లప్పుడూ ఒకటే. ఈ నాయకులు అప్పుడు కూడా పని చేసేవారు కాదు. హైదరాబాద్‌లో కూర్చొని కాలక్షేపాలు సాగుతుండేవి. గ్రూపు రాజకీయాలు అందుకు అదనం. అధికారం ఇప్పుడు మరింత పెరుగుతున్నందున లార్డ్ ఆక్టన్ సూత్రీకరణను మరింత నిజం చేస్తున్నారనే మాట వినవస్తుంటుంది. ఒక నిర్మాణం శిథిలావస్థ కన్నాముందు దశకు చేరినాకొద్దీ బలహీనతలు ఒకదాని వెంట ఒకటి బయటపడుతుంటాయి. విచిత్రమైన రీతిలో సరిగా ఎప్పుడైతే చొరబాటుదారులనే వారిని సరిహద్దుల మీదుగా అవతలికి తోసివేసే కార్యక్రమం మొదలైందో, అందుకు పలువురు చప్పట్లు చరిచి అభినందిస్తున్నారో, సరిగ్గా అదే సమయంలో అసలు భారతీయ పౌరసత్వానికి గుర్తింపు ఏది అనే ప్రశ్న పిడుగుపాటు వలె వచ్చి పడింది. ఓటర్ కార్డు కాదు, ఆధార్ కాదు, పాస్‌పోర్ట్ కాదు, బర్త్ సర్టిఫికెట్ కాదు, ఇంటి నంబర్ కాదు. వీటిలో కొన్ని, లేదా అన్నీ చొరబాటుదారులు కూడా సంపాదించగలరు. మరి ఏది పౌరసత్వం? ఓ మహాత్మా, ఓ మహర్షీ! ఈ దేశం స్వతంత్రమైన నిండు 79 ఏండ్ల తర్వాత ఇదీ పరిస్థితి. ఇది మొదటిసారి ప్రశ్నగా మారింది మోదీ ప్రభుత్వంలో. నితిన్ నబీన్ మహాశయుడు తెలంగాణ ఎడారిలో తామర పువ్వును పూయించగలమని చేస్తున్న భీకరమైన ప్రతిజ్ఞ, మొదట ప్రస్తావించిన సీనియర్ నాయకునికి కేవలం ఒక పగటి కలగా తోచటం ఎందువల్లనో బహుశా ఇంకా వివరించనక్కరలేదు. వారు తమకు మొదటి నుంచి కొరుకుడుపడని దక్షిణాదికి తెలంగాణను ముఖద్వారం చేసుకుంటామని 2014లో ప్రకటించి 12 ఏండ్లు గడిచాయి. ఈ సారి కొత్త ఆశగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను కలుపుకొని, రేవంత్‌రెడ్డిని రిజర్వ్‌లో ఉంచుకొని ఇప్పుడు కొత్త ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా తమ నాయకుల ఆశలు కనిపించటంలేదు.

# అప్పులపై అబద్ధాలు.. కాళేశ్వరంపై కుట్రలు

కాళేశ్వరం ప్రాజెక్టు మీద, తెలంగాణ అప్పుల మీద కాంగ్రెస్ చేసిన, చేస్తున్న దుష్ప్రచారం అంతాఇంత కాదు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు గుప్పించి గోబెల్స్‌ను మించి అబద్ధాలను వల్లెవేశారు. అదే నిజమని కొందరు ప్రజలు ఆశపడ్డారు. కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిపాలన చేయాల్సిందిపోయి మళ్లీ అదే పనిగా బీఆర్‌ఎస్‌పై, కేసీఆర్ హయాంలో జరిగిన అప్పులపై అబద్ధాలు చెప్పడం మొదలుపెట్టారు. రెండున్నరేండ్ల పాలనలో విఫలమై తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొన్నందుకు మళ్లీ అదే పాత సూత్రాన్ని కాంగ్రెస్ నేతలు అందుకుంటున్నారు. తెలంగాణలో టీఆర్‌ఎస్ 2014లో ప్రభుత్వం ఏర్పాటుకు ముందు సమైక్య రాష్ట్రం నుంచి వచ్చిన అప్పు రూ.84,268 కోట్లు. ఇది రాష్ట్ర విభజన సందర్భంగా వారసత్వంగా వచ్చిన అప్పు. 2023 డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి 31 వరకు కాంగ్రెస్ పాలనలో ఎఫ్‌ఆర్‌బీఎం ద్వారా రూ.15,118 కోట్లు తీసుకుని దానిని బీఆర్‌ఎస్ ప్రభుత్వ లెక్కలో వేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటికి ప్రభుత్వంపై ఉన్న మొత్తం బకాయి రూ.5,16,881 కోట్లు. సమైక్య రాష్ట్రంలో నుంచి వచ్చిన అప్పు, కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌పై నెట్టిన అప్పు తీసేస్తే మొత్తం బీఆర్‌ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో చేసిన అప్పు రూ.4,17,495 కోట్లు. ఈ విషయాన్ని ఒకటికి పదిసార్లు మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో, బహిరంగ సభలు, అనేక సమావేశాలు, ప్రెస్‌మీట్‌ల ద్వారా ఆధారాలతో నిరూపించారు. తెలంగాణ బడ్జెట్ ఇన్ బ్రీఫ్ 2025-2026 14వ పేజీలో బీఆర్‌ఎస్ సర్కార్ ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలో తీసుకున్న అప్పు రూ.3,01,484 కోట్లు ం రూ.1,09,335 కోట్లు = రూ.4,10,819 కోట్లు. ఇది కాంగ్రెస్ పార్టీనే తమ బడ్జెట్‌లో పెట్టిన లెక్క. కాగ్ రిపోర్ట్ ప్రకారం..బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.4,10,819 కోట్లు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ విడుదల చేసిన శ్వేతపత్రంలోని లెక్కల ప్రకారం బీఆర్‌ఎస్ చేసిన అప్పు రూ.4,17 లక్షల కోట్లు.

పదేపదే అబద్ధాలు చెప్తూ, సవాళ్లు విసురుతూ మంత్రులు కాలుదువ్వడం.. ఆ సవాళ్లను బీఆర్‌ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ స్వీకరించి ఆధారాలతోపాటు చర్చకు వెళ్తే మంత్రులు తోకముడిచారు. బీఆర్‌ఎస్ నేతలను అరెస్టు చేసి తమ అసమర్థతను చాటుకున్నారు. వాస్తవానికి బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అప్పుతో గొప్ప సంపదను సృష్టించింది. జిల్లాకో మెడికల్, నర్సింగ్ కాలేజీ, కలెక్టరేట్లను నిర్మించింది. అద్భుతమైన సచివాలయం, భద్రతతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్, కాళేశ్వరం లాంటి అనేక ప్రాజెక్టులను చేపట్టింది. రైతుబంధు, రైతు బీమాతోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం, ఉచిత కరెంట్, గొర్రెలు, చేపల పిల్లల పంపిణీ, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయను చేపట్టింది. తెలంగాణ సంపదను పెంచిన ఘనత కేసీఆర్‌దే.



2026 మార్చి 18న అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి చెప్పిన లెక్క ప్రకారం రెండున్నరేండ్లలో చేసిన అప్పు రూ.3,47,294 కోట్లు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇపుడు చెప్తున్న లెక్క రూ.3,85,600 కోట్లు. ఈ అప్పుతో రాష్ట్రంలో కొత్తగా కట్టిన ఒక్క ప్రాజెక్టునైనా చూపించగలరా? మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగితే వాటిని రిపేర్ చేయకుండా చోద్యం చూస్తూ నాశనం చేయాలని కాంగ్రెస్ సర్కార్ చూస్తున్నది. కాళేశ్వరం ద్వారా నీళ్లు వస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే దుర్మార్గ ఆలోచనతో ప్రాజెక్టును పడావు పెడుతున్నది. పిల్లర్ల వద్ద ఇసుక తోడటం లాంటి కుట్రలకు పాల్పడుతున్నది. ప్రతి చుక్కనూ ఒడిసి పట్టుకునే అవకాశం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేసీఆర్ కల్పించారు. కాంగ్రెస్ సర్కార్ ఆ పని చేయకుండా ప్రాజెక్టుల నుంచి లక్షల క్యూసెక్కుల నీటిని రోజూ వృథాగా పోనిస్తున్నది బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్తే అడుగడుగునా అడ్డుకునే యత్నం చేసింది. కాంగ్రెస్ దుష్టపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు. త్వరలో ఓటు రూపంలో సమాధానం చెప్పి తీరుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## నిర్మాణం పూర్తయిన భవనానికి హైడ్రా అనుమతుల రద్దు

**హైదరాబాద్, జూలై 7:** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో భారీ వివాదం వెలుగులోకి వచ్చింది. నగరంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాంతమైన సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డు పార్క్ హోటల్ సమీపంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్' చేపట్టిన భారీ మల్టీ స్టోరీడ్ గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఊహించని షాక్ ఇచ్చింది. హుస్సేన్ సాగర్ గరిష్ట వరద మట్టం పరిధిని ఆక్రమించడంతో పాటు, తీవ్ర వివాదాస్పద భూమిలో ఈ ప్రాజెక్టును నిర్మించారంటూ జీహెచ్‌ఎంసీ అధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ బిల్డింగ్‌కు ఇచ్చిన నిర్మాణ అనుమతులను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ బిల్డింగ్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో.. ఈ అపార్ట్‌మెంట్‌లో కోట్లు పోసి ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారు షాక్‌కు గురవున్నారు. ప్రదీప్ రెడ్డి బద్వేలు అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి యాజమాన్యంలోని ఈ సంస్థ.. సోమాజిగూడలో 2 సెలర్స్ ం స్టిల్ట్ ం 17 పైఅంతస్తులతో పాటు ఒక భారీ క్లబ్ హౌస్‌తో కూడిన రెండు స్కైస్క్రాపర్ టవర్లను నిర్మించింది. అయితే, ఈ ప్రాజెక్ట్ నిర్మించిన ల్యాండ్ పూర్తిగా వివాదాస్పదమైనదని, పైగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందని నిర్ధారణ కావడంతో అధికారులు రంగంలోకి దిగారు. జీహెచ్‌ఎంసీ యాక్ట్, 1955 లోని సెక్షన్ 450 కింద ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు మున్సిపల్ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నిర్మాణ అనుమతులు పొందే సమయంలో బిల్డింగ్ నిర్వాహకులు అసలు నిజాలను దాచిపెట్టారని , తప్పుడు పత్రాలతో తప్పుదోవ పట్టించి పర్మిషన్లు పొందారని అధికారులు ఈ నోటీసులో ప్రాథమికంగా తేల్చారు. ఈ వివాదాలు ఉన్నందున సదరు 17 అంతస్తుల బిల్డింగ్‌కు సంబంధించి బిల్డర్ దరఖాస్తు చేసుకున్న ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ను జీహెచ్‌ఎంసీ పూర్తిగా నిలిపివేసింది. ప్రస్తుతానికి ఈ భవనానికి ఎలాంటి ఓసీ జారీ చేయలేదని అధికారులు స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ తీసుకున్న ఈ ఆకస్మిక చర్యతో సదరు అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్లు కొనుగోలు చేసిన మధ్యతరగతి, ఉన్నత వర్గాల ప్రజలంతా ఒక్కసారిగా రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. తమ జీవితకాల సంపాదనను, బ్యాంకు లోన్లను నమ్ముకుని కోట్లాది రూపాయలు వెచ్చించి ఈ 17 అంతస్తుల టవర్లలో ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారికి ఇప్పుడు ఏం చేయాలో పాలుపోవడం లేదు. చట్టప్రకారం ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేని బిల్డింగ్‌లోకి ప్రవేశించడం, నివసించడం పూర్తిగా చట్టవిరుద్ధం. ఒకవేళ విచారణ అనంతరం జీహెచ్‌ఎంసీ గనుక బిల్డింగ్ పర్మిషన్‌ను పూర్తిగా రద్దు చేస్తే.. ఈ భవనానికి విద్యుత్, తాగునీటి కనెక్షన్లు కూడా దక్కవు. హైడ్రా , జీహెచ్‌ఎంసీ జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించిన తర్వాతే ఈ అక్రమాలు వెలుగుచూశాయని టాక్ నడుస్తోంది. బిల్డర్ చేసిన తప్పుకు, తప్పుడు డాక్యుమెంట్లు నమ్మి మోసపోయిన తాము ఇప్పుడు బలిపశువులమయ్యామని కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. ఒకవైపు బిల్డింగ్ పర్మిషన్ రద్దు ముప్పు, మరోవైపు ఓసీ రాకపోవడంతో.. కొన్న ఫ్లాట్లలోకి ఎప్పుడు అడుగుపెడతామో, అసలు ఈ బిల్డింగ్ నిలుస్తుందో లేదో తెలియని అగమ్యగోచర స్థితిలోకి హోమ్ బైయర్స్ నెట్టబడ్డారు. ఈ వ్యవహారంపై ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ ఇచ్చే వివరణపైనే ఈ ప్రాజెక్టు భవితవ్యం ఆధారపడి ఉంది.

## హిందూ మఠాధిపతులను తిడితే జగన్ వెనకేసుకొస్తారా?: కోటంరెడ్డి ఫైర్

**హైదరాబాద్, జూలై 7:**:హిందూ మఠాధిపతులు, పూజారులను కించపరుస్తూ మాట్లాడిన యూట్యూబర్ రావణ్ (జోసెఫ్)ను వైసీపీ అధినేత జగన్ ఎలా వెనకేసుకొస్తారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నెల్లూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ వైఖరిని ఎండగట్టారు. తనకు దేశభక్తి లేదని స్వయంగా జోసెఫ్ బహిరంగంగా చెబుతుంటే, అలాంటి వ్యక్తిని జగన్ ఏ విధంగా సమర్థిస్తారని ఆయన సూటిగా నిలదీశారు. దేశద్రోహ వ్యాఖ్యలు చేసేవారికి వంతపాడటం నాయకత్వ లక్షణం కాదన్నారు.రావణ్ పై నమోదైన కేసుల విషయాన్ని న్యాయస్థానాలు చూసుకుంటాయని కోటంరెడ్డి స్పష్టం చేశారు. తగిన ఆధారాలు ఉన్నాయి కాబట్టే న్యాయస్థానం అతడిని రిమాండ్‌కు పంపిందని గుర్తుచేశారు. ఇలాంటి సున్నితమైన విషయంలో దేశభక్తి లేని వ్యక్తికి మద్దతు తెలుపుతున్న వైసీపీ అధినేత వైఖరి అత్యంత దుర్మార్గమని తీవ్రంగా ఖండించారు.దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన రావణ్ కు మద్దతిచ్చిన జగన్.. తక్షణమే యావత్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోటంరెడ్డి డిమాండ్ చేశారు. ఈరోజు హిందూ మత విశ్వాసాల మీద, సాధుసంతుల మీద విచక్షణారహితంగా దాడి చేసిన ఇలాంటి వ్యక్తులు... రేపు ఇతర మతాలపై దాడి చేయరని గ్యారంటీ ఏమిటని ఆయన ప్రశ్నించారు. సమాజంలో మత సామరస్యాన్ని దెబ్బతీసే వ్యక్తులను రాజకీయ స్వార్థం కోసం ప్రోత్సహించడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

## రెండు మల్టీ జోన్లు... 6 జోన్లుగా వర్గీకరణ

**విజయవాడ, జూలై 7:**ఏపీలో ఉద్యోగుల విభజన, స్థానిక క్యాడర్ల ఖరారుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని పాత 26 జిల్లాలు, 6 జోన్ల మధ్య ప్రభుత్వ ఉద్యోగుల విభజన, స్థానిక క్యాడర్ల ఖరారు ప్రక్రియకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియను ఎలా చేపట్టాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం సమగ్ర మార్గదర్శకాలు విడుదల చేశారు. నూతనంగా ఏర్పాటైన మార్కాపురం, పోలవరం జిల్లాలకు కూడా తాత్కాలికంగా ఉద్యోగులను కేటాయించాలని ఆదేశించారు. విభాగాధిపతులు ఈ నివేదికలను సిద్ధం చేసి కార్యదర్శులకు పంపించగా, వారు ఆర్థిక శాఖ పరిశీలన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ తుది ఆమోదం కోసం సమర్పించనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 28 జిల్లాలు ఉన్నప్పటికీ, రాష్ట్రపతి ఉత్తర్వులు ప్రస్తుతానికి 26 జిల్లాలకే పరిమితమయ్యాయి. వీటన్నింటినీ 6 జోన్లు, 2 మల్టీ జోన్లుగా విభజించారు. మల్టీ జోన్-1 పరిధిలోకి జోన్-1 (శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి), జోన్-2 (అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ), జోన్-3 (పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్) వస్తాయి. అలాగే మల్టీ జోన్-2 పరిధిలోకి జోన్-4 (గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు), జోన్-5 (చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప), జోన్-6 (నంద్యాల, కర్నూలు,అనంతపురం, శ్రీసత్యసాయి) జిల్లాలను చేర్చారు.

**డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, సీటీఓలు మల్టీ జోనల్ క్యాడర్లు**

ప్రతి శాఖలోని పోస్టుల క్యాడర్ స్ట్రెంత్‌ను పాత పోస్టుల కేటాయింపు నిష్పత్తి ఆధారంగా లెక్కిస్తారు. ఉదాహరణకు కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల మధ్య 40:50:10 నిష్పత్తిలోనూ, కర్నూలు, నంద్యాల మధ్య 55:45 నిష్పత్తిలోనూ పోస్టులను పంచుతారు. డెప్యుటేషన్, లీవ్, సస్పెన్షన్‌లో ఉన్న పోస్టులను ఖాళీలుగా భావించరు. డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, సీటీఓ వంటి కీలక రాష్ట్ర స్థాయి పోస్టులను ఇకపై మల్టీ జోనల్ క్యాడర్లుగా మార్చి 2 మల్టీ జోన్ల మధ్య విభజిస్తారు. ఈ మార్గదర్శకాలు పర్మినెంట్, తాత్కాలిక పోస్టులన్నింటికీ వర్తిస్తాయి. అయితే, ఆలిండియా సర్వీసెస్, జ్యుడిషియల్ అధికారులు, అసెంబ్లీ, రాజ్‌భవన్, హైకోర్టు సిబ్బందికి, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు ఇవి వర్తించవు.ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు బదిలీలు, పదోన్నతులపై విధించిన నిషేధాన్ని ప్రభుత్వం జులై 12వ తేదీ వరకు సడలించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ కార్యదర్శి వాడ్రేవు చినవీరభద్రుడు ఉత్తర్వులు జారీ చేయగా జులై 13వ తేదీ నుంచి తిరిగి నిషేధం అమల్లోకి రానుంది. మరోవైపు, ఈ స్థానిక క్యాడర్ల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి, నిరంతర పర్యవేక్షణకు గానూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ నోడల్ అధికారులను నియమించారు. వీరు రిజర్వేషన్ రోస్టర్లు, సీనియారిటీ జాబితాలను ఖరారు చేయడంతో పాటు ఏపీపీఎస్సీ ద్వారా చేపట్టే ప్రత్యక్ష నియామకాలకు సంబంధించిన ఇండెంట్లను సిద్ధం చేస్తారు.

## బిజినెస్

### జూన్‌లో ఎక్కువ మంది కొన్న కారు ఇదే!



భారత ఆటోమొబైల్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో.. వినియోగదారుల అభిరుచుల్లో కూడా గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఎస్‌యూవీ వాహనాలకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జూన్ నెలలో కార్ల అమ్మకాల్లో టాటా మోటార్స్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. జూన్ నెలలో టాటా మోటార్స్ దేశీయంగా మొత్తం 63,083 ప్రయాణికుల వాహనాలను విక్రయించింది. గత ఏడాది ఇదే నెలలో విక్రయించిన 37,237 వాహనాలతో పోలిస్తే 69 శాతం వృద్ధి నమోదు చేసింది. ముఖ్యంగా పంచ్, నెక్సాన్, టియాగో కొత్త వెర్షన్‌లకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభించింది. పెట్రోల్, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వంటి అన్ని రకాల మోడళ్లకు బుకింగ్‌లు పెరగగా, కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు కూడా 14,800 యూనిట్లకు చేరి కొత్త రికార్డు సృష్టించాయి. అమ్మకాల పరంగా టాటా పంచ్ మొదటి స్థానంలో నిలిచి 21,006 యూనిట్లు విక్రయించింది. టాటా నెక్సాన్ 18,335 యూనిట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఇక మారుతి సుజుకి డిజైర్ 17,899 యూనిట్లతో మూడో స్థానాన్ని దక్కించుకొని, దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న సెడాన్‌గా తన స్థానాన్ని కొనసాగించింది. తరువాత స్థానాల్లో వ్యాగన్‌ఆర్ (16,952 యూనిట్లు), ఎర్టిగా (16,111 యూనిట్లు), స్విఫ్ట్ (15,215 యూనిట్లు), మహీంద్రా స్కార్పియో (14,097 యూనిట్లు), ఫ్రాంక్స్ (13,135 యూనిట్లు), బాలెనో (12,488 యూనిట్లు), హ్యుందాయ్ వెన్యూ (10,776 యూనిట్లు) నిలిచాయి. టాటా మోటార్స్ తొలి రెండు స్థానాలను దక్కించుకున్నప్పటికీ, టాప్-10 జాబితాలో ఆరు మోడళ్లతో మారుతి సుజుకి ఆధిపత్యాన్ని కొనసాగించింది. డిజైర్, వ్యాగన్‌ఆర్, ఎర్టిగా, స్విఫ్ట్, ఫ్రాంక్స్, బాలెనో మోడళ్లు కలిపి 91,780 యూనిట్ల అమ్మకాలు నమోదు చేశాయి. ఇది టాప్-10 కార్ల మొత్తం అమ్మకాలలో 57 శాతానికి పైగా ఉండటం విశేషం. ఈసారి టాప్-10 జాబితాలో సాధారణంగా స్థానం సంపాదించే హ్యుందాయ్ క్రెటా కనిపించలేదు. సరఫరాదారుల ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా ఉత్పత్తి తాత్కాలికంగా అంతరాయం కలగడంతో క్రెటా అమ్మకాలు తగ్గాయి. అలాగే కొత్త వెర్షన్ విడుదలకు ముందు మారుతి సుజుకి బ్రెజ్జా అమ్మకాలు కూడా తగ్గడంతో అది కూడా టాప్-10 జాబితాలో చోటు దక్కించుకోలేకపోయింది. జూన్ నెల అమ్మకాల గణాంకాలను పరిశీలిస్తే.. భారత వినియోగదారులు ఎస్‌యూవీ వాహనాల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. టాప్-10 జాబితాలో పంచ్, నెక్సాన్, స్కార్పియో, ఫ్రాంక్స్, వెన్యూ వంటి ఐదు ఎస్‌యూవీలు చోటు దక్కించుకున్నాయి. అయితే ఎస్‌యూవీల హవా కొనసాగుతున్నప్పటికీ, డిజైర్ అత్యధికంగా అమ్ముడైన సెడాన్‌గా తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం.

# ఏటీఎఫ్ సబ్సిడీ.. మాకొద్దులే!

పశ్చిమాసియా ప్రభావంతో పెరుగుతున్న ఇంధన ధరల భారం నుంచి ఎయిర్‌లైన్స్‌కి ఊరట కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిన ధరల స్థిరీకరణ పథకానికి ఆదరణ కరువైంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో దీన్ని ఉపయోగించుకోవడంపై విమానయాన సంస్థలేవీ ఆసక్తి చూపలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. వివరాల్లోకి వెళ్తే .. ప్రభుత్వం రూ. 10,000 కోట్లతో జెట్ ఫ్యూయల్ రేట్ల స్థిరీకరణ పథకాన్ని ప్రకటించింది. ఎయిర్‌లైన్స్ ఇందులో స్వచ్ఛందంగా చేరొచ్చు. దీని ప్రకారం మూడేళ్ల పాటు పన్నులు మొదలైనవన్నీ కలిపి లీటరుకు రూ. 115 రేటు (ఢిల్లీ ధర) చొప్పున చెల్లించి కొనుక్కునేలా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోవాల్సి ఉంటుంది. సబ్సిడీపై విక్రయించడం వల్ల ఆయిల్ కంపెనీలకు నష్టాలేవైనా వాటిల్లితే ప్రభుత్వం దాన్ని భర్తీ చేస్తుంది. ఈ స్కీములో చేరని కంపెనీలు మార్కెట్ ధరలను చెల్లించి కొనుక్కోవాల్సి ఉంటుంది. పథకాన్ని ప్రకటించిన జూన్ 3 నాడు రేట్లు సుమారు రూ. 142 స్థాయిలో ఉండగా రూ. 115 రేటును ప్రతిపాదించారు. కానీ ప్రస్తుతం ఆ రెండింటి కన్నా ఏటీఎఫ్ ధర గణనీయంగా తగ్గి రూ. 110 స్థాయికి తగ్గింది. నిర్వహణ వ్యయాలు పెరిగిపోవడం, డాలరుతో



రూపాయి మారకం విలువ పడిపోవడం తదితర అంశాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీ విమానయాన సంస్థల పనితీరుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపనున్నాయి. 2026--27లో ఎయిర్‌లైన్స్ నష్టాలు ఏకంగా రూ. 36,000--38,000 కోట్లకు పెరగనున్నాయి. రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. వాస్తవానికి 2027 ఆర్థిక సంవత్సరంలో నష్టాలు రూ. 11,000--12,000 కోట్లకు తగ్గుతాయని ముందుగా అంచనా వేసినప్పటికీ, ఆ తర్వాత పరిస్థితులు మారిపోయినట్లు వివరించింది.

# ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ కీలక మార్పులు

## ఇకపై ఆ సేవలు కూడా 'ఉమంగ్' లోనే..!

జ్యూఖీూ : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తన సేవలను ఆధునికీకరించే ప్రక్రియలో భాగంగా ఇప్పుడు కీలక మార్పులు చేసింది. సిస్టమ్ అప్‌గ్రేడ్ తర్వాత సరికొత్త యూనిఫైడ్ మెంబర్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ మార్పులవల్ల పీఎఫ్ ఖాతాదారులకు వేగవంతమైన, మరింత సురక్షితమైన సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇప్పటివరకు ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న కొన్ని ముఖ్యమైన సేవలను ప్రభుత్వానికి చెందిన 'ఉమంగ్' యాప్‌కు బదిలీ చేసింది. ముఖ్యంగా యూనివర్సల్ అకౌంట్ నంబర్ (ఖూాచీ) యాక్టివేషన్, కొత్త యూఏఎన్ జనరేషన్ వంటివి ఇకపై ఉమంగ్ యాప్‌లో మాత్రమే అందుబాటులో ఉంటాయి. వీటికి ఆధార్ ఆధారిత ఫేస్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేసింది. ఈ కొత్త మార్పులు, వాటి ప్రభావంపై పూర్తి వివరాలు ఇక్కడ ఉన్నాయి.

**ఉమంగ్ యాప్‌కు యూఏఎన్ సేవలు..**

ఈపీఎఫ్ఓ తీసుకొచ్చిన అతిపెద్ద మార్పుల్లో ఇది ప్రధానమైనది. ఖాతాదారుల గుర్తింపును మరింత పటిష్టంగా ధ్రువీకరించుకోవడానికి, సేవలను సురక్షితంగా మార్చడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇకపై పీఎఫ్ సభ్యులు తమ యూఏఎన్‌ను యాక్టివేట్ చేసుకోవాలంటే ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్‌లో సాధ్యంకాదు. దానికి బదులుగా కింది పద్ధతిని అనుసరించాలి. మొదటగా మీ స్మార్ట్‌ఫోన్‌లో ఉమంగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఓపెన్ చేయాలి. అందులో




ఈపీఎఫ్ఓ సర్వీసుల విభాగానికి వెళ్లాలి. అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఆ తర్వాత క్లిక్ చేయాలి. ఆధార్ ఆధారిత ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను పూర్తిచేసి, స్క్రీన్‌పై వచ్చే సూచనలను పాటించాలి. ఈ వెరిఫికేషన్ విజయవంతం కాగానే మీ యూఏఎన్ యాక్టివేట్ అవుతుంది.

**యూఏఎన్ లేని పాత సభ్యుల పరిస్థితి..!**

ఇప్పటికే పీఎఫ్ ఖాతా ఉండి యూఏఎన్ కేటాయించని సభ్యులు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారు కూడా ఉమంగ్ యాప్ ద్వారా కొత్త యూఏఎన్‌ను పొందవచ్చు. ఈ ప్రక్రియలో భాగంగా వారు తమ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను ధ్రువీకరించాలి. ఆ తర్వాత అవసరమైన సభ్యుల వివరాలను నమోదు చేసి, ఆధార్ ఫేస్ అథెంటికేషన్‌ను పూర్తిచేయాలి. ఇలా జనరేట్ అయిన కొత్త యూఏఎన్‌ను వారి పాత పీఎఫ్ ఖాతాతో లింక్ చేస్తారు. దీనివల్ల పాత ఖాతాలోని బ్యాలెన్స్ కొత్త యూఏఎన్‌కు సురక్షితంగా బదిలీ అవుతుంది.

**మర్చిపోయిన యూఏఎన్‌ను పొందడం ఎలా..?**

కొత్తగా అప్‌గ్రేడ్ అయిన పోర్టల్‌లో యూఏఎన్‌ను మర్చిపోయిన వారు తిరిగి పొందే ప్రక్రియను ఈపీఎఫ్ఓ సులభతరం చేసింది. దీనికోసం సభ్యులు తమ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయాలి. గుర్తింపు లేదా చిరునామా రుజువు పత్రాన్ని అప్‌లోడ్ చేసి, మొబైల్‌కు వచ్చిన ఓటీపీని వెరిఫై చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక వారి యూఏఎన్ వివరాలు తెలుసుకోవచ్చు.

**డెత్ క్లెయిమ్‌ల సేవలో నో చేంజ్..**

యూఏఎన్‌కు సంబంధించిన కొన్ని సేవలు ఉమంగ్ యాప్‌కు మారినప్పటికీ, డెత్ క్లెయిమ్‌లను దాఖలు చేసే సదుపాయం మాత్రం పాత ఈపీఎఫ్ఓ పోర్టల్‌లోనే కొనసాగుతుంది. మరణించిన సభ్యుని నామినీలు లేదా లబ్ధిదారులు క్లెయిమ్ దాఖలు చేయడానికి ముందు కొన్ని పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్, రద్దు చేసిన చెక్కు లేదా పాస్‌బుక్ వంటి బ్యాంక్ ఖాతా రుజువు, సభ్యుని మరణ ధ్రువీకరణ పత్రం, అవసరమైతే లబ్ధిదారుని పుట్టిన తేదీ రుజువు వంటివి సమర్పించాల్సి ఉంటుంది. డాక్యుమెంట్లను పీడీఎఫ్ (పీడీఎఫ్) ఫార్మాట్‌లో, 2ఎంబీ పరిమితికి మించకుండా, ఫైల్ పేరులో స్పేస్‌లు లేకుండా అప్‌లోడ్ చేయాలని ఈపీఎఫ్ఓ స్పష్టం చేసింది.

## అర్ధ శతకాలతో మెరిసిన జురెల్, సరాన్ష్..

# స్వల్ప ఆధిక్యంలో భారత-ఏ..!

రెండో అనధికారిక టెస్టులో భారత ఏ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ సాయి సుదర్శన్(168), దేవ్‌దత్ పడిక్కల్(94)లు శతక భాగస్వామ్యంతో బలమైన పునాది వేయగా మిడిలార్డర్‌లో ధ్రువ్ జురెల్(53), సరన్ష్ జైన్(68 నాటౌట్) హాఫ్ సెంచరీలతో కదం తొక్కారు. మూడో రోజు ఆరంభంలోనే వికెట్లు తీసిన శ్రీలంక ఏ బౌలర్లను విసిగించిన ఈ ద్వయం స్కోర్ నాలుగొందలు దాటించింది. షేక్ రషీద్(45) కూడా నిలబడడతో ఆట ముగిసే సరికి ఇండియా ఏ 8 వికెట్ల నష్టానికి 541 రన్స్ కొట్టింది. శ్రీలంక పర్యటనలో భారత -ఏ జట్టు గర్వించదగ్గ ప్రదర్శన చేస్తోంది. రెండో అనధికారిక టెస్టు మ్యాచ్‌లోనూ బ్యాటర్లు రెచ్చిపోవడంతో ఐదొందలు కొట్టిన ఇండియా-ఏ స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. రెండో రోజు లంక ఏ బౌలర్లను బెంబేలెత్తిస్తూ వరసగా రెండో శతకం బాదిన ఓపెనర్ సాయి సుదర్శన్(168) మూడో రోజు దంచాడు. కానీ, దేవ్‌దత్ పడిక్కల్(94) ఓవర్‌నైట్ స్కోర్ వద్దే వెనుదిరిగి సెంచరీ చేజార్చుకున్నాడు. అనంతరం రుతురాజ్ గైక్వాడ్(13) రిటైర్డ్ హర్ట్‌వ్వగా.. ధ్రువ్ జురెల్(53) జతగా సాయి ఇన్నింగ్స్ నిర్మించాడు. జోరుమీదున్న సాయిని డిల్షాం సుదీరా బౌల్డ్ చేసి లంకకు ఉపశమనమిచ్చాడు. కానీ, ఆ తర్వాత సరాన్ష్ జైన్(68 నాటౌట్)తో క్రీజునంటుకున్న జురెల్ అర్ధ శతకంతో చెలరేగాడు. వీరిద్దరూ ఆతిథ్య బౌలర్లను కాచుకొని స్కోర్ నాలుగొందలు దాటించారు. కేశర నువంత(4-158) ధాటికి ఆఖర్లో వరసగా వికెట్లు పడినా.. షేక్ రషీద్(45), అకీబ్



నబీ(30)లు గొప్పగా ఆడారు. దాంతో, మూడో రోజు ఆట ముగిసే సరికి ఇండియా-ఏ 8 వికెట్ల నష్టానికి 541 పరుగులు చేసిన భారత్.. 171 రన్స్ ఆధిక్యంలో నిలిచింది.

**బ్రార్, జైన్ దెబ్బకు..**

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత -ఏ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఏను గొప్పగా కట్టి చేసింది. కెప్టెన్ సహన్ అరాచ్చిగా(127) శతకం బాదినా.. మిగతా బ్యాటర్లు తేలిపోయారు. గుర్నూర్ బ్రార్, సరాన్ష్ జైన్ నాలుగేసి వికెట్లు తీయగా.. లంక నాలుగ్గొందలలోపే పరిమితమైంది. బ్రార్, జైన్ ధాటికి ఆతిథ్య లంక 366 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లలో యశ్ ఠాకూర్ రెండు వికెట్లతో రాణించాడు.

### రంగారెడ్డిపై ఖమ్మం ఏసెస్ విజయం

తెలంగాణ టీ20 లీగ్ (టీజీ20)-2026లో ఖమ్మం ఏసెస్ రంగారెడ్డి రైజర్స్‌ను చిత్తు చేసింది. ఉప్పల్ వేదికగా శనివారం నాటి మ్యాచ్‌లో ఐదు వికెట్ల తేడాతో రంగారెడ్డిపై విజయం సాధించింది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో టాస్ గెలిచిన రంగారెడ్డి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో రంగారెడ్డి తొమ్మిది వికెట్ల నష్టానికి కేవలం 147 పరుగులు సాధించింది. ఓపెనర్లు ఆరోన్ జార్జ్ (4), అరవెల్లి అవినాశ్ రావు (12) విఫలం కాగా.. జ్ఞానప్రకాశ్ రెడ్డి (36), ఆదిత్య జవ్వాజి (43) జట్టును ఆదుకున్నారు. ఖమ్మం బౌలర్లలో కెప్టెన్ సీవీ మిలింద్ మూడు వికెట్లతో సత్తా చాటగా.. హర్షిత్ సాయి, వేద్ రెడ్డి తలా రెండు వికెట్లు దక్కించుకున్నారు. విద్యానంద రెడ్డి, షేక్ అజర్ చెరో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. ఈ క్రమంలో నామమాత్రపు లక్ష్యంతో బరిలోకి దిగిన ఖమ్మం జట్టుకు ఆదిలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్లు వాఫీ కచ్చి (4), ప్రతీక్



రెడ్డి (17).. వన్‌డౌన్ బ్యాటర్ జీఎస్‌కే రెడ్డి (14) పూర్తిగా నిరాశపరిచారు. ఇలాంటి తరుణంలో కొడిమెల హిమతేజ, మికిల్ జైస్వాల్ మెరుపులు మెరిపించారు. హిమతేజ 28 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 45 పరుగులు చేయగా.. మికిల్ 22 బంతుల్లో 30 పరుగులతో రాణించాడు. ఆఖర్లో సీవీ మిలింద్ 21 బంతుల్లో 29 పరుగులతో అజేయంగా నిలవగా.. సహేంద్ర మల్లు 4 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈ క్రమంలో 17.1 ఓవర్లలో కేవలం ఐదు వికెట్లు నష్టపోయి 150 పరుగులు చేసిన ఖమ్మం.. రంగారెడ్డిని ఐదు వికెట్ల తేడాతో ఓడించింది.

## స్పోర్ట్స్

### శాంసన్ ఔట్..

### డెబ్యూ క్యాప్ అందుకున్న వైభవ్..!



భారత క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ కల నిజమైంది. ఐపీఎల్- 19తో విధ్వంసక ఆటతో జాతీయ జట్టుకు ఎంపికైన ఈ చిచ్చరపిడుగు అంతర్జాతీయ అరంగేట్రానికి వేళైంది. ఇంగ్లండ్ పర్యటనతో అతడు టీమిండియా తరఫున టీ20లో అరంగేట్రం మ్యాచ్ ఆడుతున్నాడు. మాంచెస్టర్‌లో రెండో టీ20 టాస్‌కు ముందు తిలక్ వర్మ అతడికి డెబ్యూట్ క్యాప్ అందించాడు. అనంతరం ఓపెనర్ అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లు వైభవ్‌కు అభినందనలు తెలిపారు. అభిమానుల ఎదురుచూపులు ఫలించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తొలి మ్యాచ్ ఆడుతున్నాడు. మాంచెస్టర్‌లో ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టీ20లో అతడు డెబ్యూ క్యాప్ అందుకున్నాడు. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. తాము ఒక మార్పుతో ఆడుతున్నామని చెప్పిన అయ్యర్.. సంజూ శాంసన్ స్థానంలో వైభవ్ సూర్యవంశీని ఆడిస్తున్నామని పేర్కొన్నాడు. భారత తుది జట్టు : వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ, శివం దూబే, హర్షిత్ రానా, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి.

**ఇంగ్లండ్ తుది జట్టు**

ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్(వికెట్ కీపర్), హ్యారీ బ్రూక్(కెప్టెన్), జాకబ్ బెథెల్, టామ్ బ్యాంటన్, సామ్ కరన్, విల్ జాక్స్, లియాం డాసన్, ఆదిల్ రషీద్, ఆర్చర్, జోష్ టంగ్.



## వెంకీ-కళ్యాణ్ రామ్ మల్టీస్టారర్ మలయాళ రీమేక్ కాదు.. రూమర్లకు చెక్ పెట్టిన కీర్తి సురేష్!

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌లో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న తాజా మల్టీస్టారర్ చిత్రంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతన్న సంగతి తెలిసిందే. పృథ్వీరాజ్ సుకుమారన్, బేసిల్ జోసెఫ్ నటించిన మలయాళ సూపర్ హిట్ కామెడీ చిత్రం 'గురువాయూర్ అంబలనాడైల్'కు ఇది రీమేక్ అంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఈ రూమర్స్‌పై స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ స్పందించి గట్టి క్లారిటీ ఇచ్చారు. ఈ రూమర్లన్నీ ముమ్మాటికీ వాస్తవ దూరం అని తేల్చి చెబుతూ, ఇది ఏ సినిమాకూ రీమేక్ కాదని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. దర్శకుడు అనిల్ రావిపూడి తన సొంత శైలిలో రాసుకున్న పక్కా ఒరిజినల్ స్క్రిప్ట్‌తో, హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్ మరియు ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తూ, సురేష్ ప్రొడక్షన్స్ సమర్పిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో వెంకటేష్ సరసన కీర్తి సురేష్ నటిస్తుండగా, కళ్యాణ్ రామ్ జోడీగా కృతి శెట్టి నటిస్తోంది. జాతీయ అవార్డు గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 2027 సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా రీమేక్ కాదని, స్ట్రెయిట్ ఒరిజినల్ కథేనని కన్ఫర్మ్ కావడంతో అటు విక్టరీ వెంకటేష్, ఇటు నందమూరి కళ్యాణ్ రామ్ అభిమానులు ఫుల్ హ్యాపీగా ఉన్నారు.





## 'నాగబంధం'లో అసలైన సర్‌ప్రైజ్ విలన్..
## అబ్దాలీగా రిషబ్ సాహ్నీ నటనకు ప్రేక్షకుల ఫిదా!


యంగ్ హీరో విరాట్ కర్ణ ప్రధాన పాత్రలో, దర్శకుడు అభిషేక్ నామా తెరకెక్కించిన డివైన్ మైథలాజికల్ థ్రిల్లర్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' జూలై 3న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సనాతన ధర్మం, పురాతన ఆలయాల రహస్యాలు, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని విజువల్స్‌తో పాటు విలన్ పాత్రలో నటించిన రిషబ్ సాహ్నీ నటన ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమాలో 'అబ్దాలీ' పాత్రలో కనిపించిన రిషబ్ సాహ్నీ తన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తున్నాడు. ప్రతి సన్నివేశంలోనూ తన కళ్లలో కనిపించే తీవ్రత, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీతో ఒక భయానక ప్రతినాయకుడిగా ఆకట్టుకున్నాడు. తెరపై ఆయన కనిపించిన ప్రతిసారీ కథలో ఉత్కంఠ మరింత పెరిగిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సోషల్ మీడియాలో కూడా రిషబ్ నటనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. అబ్దాలీ ఎంట్రీతో థియేటర్‌లో వాతావరణమే మారిపోయింది , హీరోతో సమానంగా విలన్ పాత్రకు బలం తీసుకొచ్చాడు , రిషబ్ సాహ్నీ కెరీర్‌లో ఇదే బెస్ట్ పెర్ఫార్మెన్స్ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. 'నాగబంధం' కథ శ్రీరంగపురంలోని ఓ పురాతన ఆలయాన్ని కేంద్రంగా సాగుతుంది. అక్కడ దాగి ఉన్న బ్రహ్మకమలం, మహాశక్తివంతమైన 'నాగబంధం' గ్రంథాన్ని సొంతం చేసుకుని అమరత్వం పొందాలని ప్రయత్నించే దుష్టశక్తుల కుట్ర చుట్టూ కథ తిరుగుతుంది. ఈ ప్రమాదాన్ని అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన యువకుడు 'రుద్ర' చేసే సాహసయాత్ర ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని అందిస్తుంది. పురాణ గాథలు, ఆలయ రహస్యాలు, మిస్టరీ, యాక్షన్ అంశాలను సమన్వయం చేస్తూ దర్శకుడు అభిషేక్ నామా సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించారు. విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి.

## 'ది ప్యారడైజ్' కోసం నాని భారీ త్యాగం..
## రెండు క్రేజీ సినిమాలకు నో చెప్పిన నేచురల్ స్టార్!



నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాని 'జడల్' అనే పూర్తి స్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కయాదు లోహర్ 'సుబ్బలక్ష్మి' పాత్రలో నటిస్తోంది. విలక్షణ నటుడు మోహన్ బాబు ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనుండగా, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ సెప్టెంబర్ 25కు మారే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు పలు అంతర్జాతీయ భాషల్లో కూడా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 'ది ప్యారడైజ్'పై పూర్తి దృష్టి పెట్టిన నాని, ఇతర సినిమాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యం కావడం వల్ల ఆయన రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. మొదటిది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సిద్ధం చేసిన కొత్త సినిమా. కథ నచ్చినా డేట్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆ ప్రాజెక్ట్‌ను వేరే హీరోతో ముందుకు తీసుకెళ్లాలని నాని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కథ విజయ్ దేవరకొండ వద్దకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రెండోది, 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందించాలనుకున్న చిత్రం. కథపై నానికి మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదని తెలుస్తోంది. ప్రస్తుతం జ్ఞానవేల్ హీరో సూర్యతో తన తదుపరి చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'ది ప్యారడైజ్' పూర్తైన తర్వాత దర్శకుడు సుజీత్‌తో కలిసి 'బ్లడీ రోమియో' అనే సినిమా చేయాలని నాని భావిస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయితే సుజీత్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్తో 'ఓజీ-2' ప్రాజెక్ట్‌పైనా దృష్టి పెట్టడంతో, నాని-సుజీత్ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

## పెద్ది ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్..
## రామ్ చరణ్ బ్లాక్‌బస్టర్ డిజిటల్ స్ట్రీమింగ్ ఎప్పటి నుండి అంటే..!




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. గ్రామీణ క్రీడల నేపథ్యంతో రూపొందిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. థియేటర్లలో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. 'పెద్ది' ఓటీటీ విడుదల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అభిమానులకు మేకర్స్ శుభవార్త చెప్పారు. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది. జూలై 9 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఒకేసారి స్ట్రీమింగ్ చేయనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది. దీంతో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇంట్లోనే ఈ చిత్రాన్ని ఆస్వాదించే అవకాశం దక్కనుంది. విడుదలైన తొలి రోజు నుంచే 'పెద్ది'కి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామీణ నేపథ్యంలో స్పోర్ట్స్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామా అంశాలను సమతుల్యంగా మిళితం చేసిన బుచ్చిబాబు కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, పాత్రలోని తీవ్రత, భావోద్వేగ సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో భారీ విజయంగా నిలిచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటించి తన నటనతో ప్రశంసలు అందుకుంది. అలాగే దివ్యేందు, బొమన్ ఇరానీ, జగపతిబాబు, రవికిషన్ తదితరులు కీలక పాత్రల్లో మెప్పించారు. ప్రతి పాత్ర కథకు బలం చేకూర్చేలా దర్శకుడు తీర్చిదిద్దిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు, ఇషాన్ సక్సేనా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్స్, సంగీతం, ఎమోషనల్ కథనం కలిసి 'పెద్ది'ని ఈ ఏడాది అతిపెద్ద విజయాల్లో ఒకటిగా నిలబెట్టాయి.థియేటర్లలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలో కూడా అదే స్థాయి ఆదరణ దక్కించుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



## ప్రెగ్నెన్సీలోనూ ఫుల్ బిజీగా సమంత..
## కొత్త టాక్ షోతో ఓటీటీలో సందడి చేయనున్న స్టార్ హీరోయిన్?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత జీవితంలో 2026 సంవత్సరం ఎంతో ప్రత్యేకంగా మారింది. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా వరుస సంతోషాలను ఆస్వాదిస్తున్న ఆమె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదించేందుకు సిద్ధమవుతోంది. గతేడాది డిసెంబర్‌లో దర్శకుడు రాజ్ నిడిమోరును వివాహం చేసుకున్న సమంత, ఈ ఏడాది విడుదలైన 'మా ఇంటి బంగారం' చిత్రంతో భారీ విజయాన్ని అందుకుంది. అదే సమయంలో ఆమె గర్భవతి అనే శుభవార్త కూడా అభిమానులతో పంచుకుంది. ప్రెగ్నెన్సీ కారణంగా సమంత కొంతకాలం పూర్తిగా విశ్రాంతి తీసుకుంటారని అభిమానులు భావించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం ఆమె మరో కొత్త ప్రాజెక్ట్‌తో ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. సమంత మరోసారి హోస్ట్‌గా మారనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రముఖ ఓటీటీ వేదిక కోసం చేసిన 'సామ్ జామ్' టాక్ షో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సినీ ప్రముఖులతో సమంత జరిపిన ఆసక్తికర సంభాషణలు ఆ షోకు మంచి ఆదరణ తీసుకొచ్చాయి. ఇప్పుడు ప్రముఖ ఓటీటీ సంస్థ సోనీలివ్ తమిళ్ కోసం సమంత ఓ ప్రత్యేక టాక్ షో చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా సోనీలివ్ తమిళ్ తమ సోషల్ మీడియా ఖాతాలో "సమంతతో కలిసి ఓ స్పెషల్ ప్రాజెక్ట్‌పై పని చేస్తున్నాం. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం" అంటూ చేసిన పోస్ట్‌ను సమంత కూడా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేయడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది.వీశీజఱవం ఈ టాక్ షో ప్రధానంగా తమిళ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందనున్నట్లు సమాచారం. ఇందులో సమంత తమిళంతో పాటు ఇంగ్లీష్‌లో కూడా సెలబ్రిటీలతో సరదాగా ముచ్చటించనున్నట్లు తెలుస్తోంది. ఆమె హోస్టింగ్ స్టైల్‌కు ఇప్పటికే మంచి గుర్తింపు ఉండటంతో, ఈ కొత్త షోపై కూడా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం సమంత గర్భవతిగా ఉండటంతో భారీ యాక్షన్ సన్నివేశాలు, డ్యాన్స్‌లు లేదా దీర్ఘకాలిక షూటింగ్‌లకు దూరంగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కువ శారీరక శ్రమ అవసరం లేని టాక్ షో చేయడం ఆమెకు అనుకూలంగా ఉంటుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. టాక్ షో ఫార్మాట్‌లో ఎక్కువగా కూర్చుని సంభాషణలు సాగుతాయి కాబట్టి, ప్రెగ్నెన్సీ సమయంలో కూడా ఈ తరహా ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. అయితే ఈ టాక్ షో ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయంపై మాత్రం ఇంకా అధికారిక సమాచారం వెలువడలేదు.

# ఆలయానికి కొత్తగా సీఈఓ

అయోధ్య: రామమందిర ఉద్యమాన్ని ముందుండి నడిపించిన బీజేపీ, సంఘ్ పరివార్‌లు అయోధ్య రామమందిరంలో కోట్ల రూపాయల చందా చోరీ ఉదంతంతో మసకబారిన ఆలయ ప్రతిష్ట పునరుద్ధరించేందుకు నడుంబిగించాయి. ఆలయ నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా కొత్తగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ) పదవిని ఏర్పాటుచేయాలని సోమవారం జరిగిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక భేటీలో నిర్ణయించారు. సీఈఓ పదవికి అర్హతలున్న వ్యక్తి ఎంపిక బాధ్యతలను ముగ్గురు సభ్యుల కమిటీకి అప్పగించారు. ఈ కమిటీలోకి సభ్యులుగా విశ్రాంత న్యాయమూర్తి ప్రమోద్ కోహ్లీ, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ విష్ణుకాంత్ చతుర్వేది, ట్రస్టీ సురేశ్ హవారేలను తీసుకున్నారు. లక్షలాది మంది భక్తులు సమరి?పంచిన నగదు, స్వర్ణాభరణ కానుకలను కాజేసిన ఉదంతంలో నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామాచేస్తూ చంపత్ రాయ్ తీసుకున్న నిర్ణయాన్ని సోమవారం ఆలయ కాంప్లెక్స్‌లోని గెస్ట్‌హౌస్‌లో మధ్యాహ్నం మూడుగంటలపాటు జరిగిన భేటీలో ట్రస్ట్ సభ్యులు ఆమోదించారు. ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామానూ ఆమోదించారు. ప్రస్తుతం ట్రస్టీగా ఉన్న కృష్ణమోహన్‌ను తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ సమావేశంలో సభ్యులు నిర్ణయం తీసుకు న్నారు.



**ఎవరైనా వచ్చి సరిచూసుకోవచ్చు: కృష్ణమోహన్**

భేటీ తర్వాత తాత్కాలిక ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్ మీడియాతో మాట్లాడారు. "రామమందిరానికి భారీ స్థాయిలో బంగారం, వెండి, ఇతరత్రా అత్యంత విలువైన ఆభరణాలు, వస్తుసామగ్రిని ఇచ్చిన దాతలు తామిచ్చిన విరాళాలు ఉన్నాయో లేదో సరిచూసుకునేందుకు అవకాశం కల్పిస్తాం. నగదుకాని 2,926 కానుకల సంబంధ రికార్డులు, డాక్యుమెంట్లను బహిరంగంచేస్తాం. ఎవరైనా వచ్చి వాటిని సరిచూసుకోవచ్చు. చోరీకి పాల్పడిన వారికి తగిన శిక్ష పడేలా చేస్తాం. చోరీ ఘటనతో ఆలయంపై ఆరోపణల మచ్చ పడింది. ఇలాంటివి పునరావృతంకాకుండా, మళ్లీ ప్రజల విశ్వాసం చూరగొనేలా ట్రస్ట్ సభ్యులంతా ఎంతో పారదర్శకంగా పనిచేస్తారు. ఆలయాన్ని మరింత సమర్థవంతంగా, ఆదర్శప్రాయంగా నిర్వహించేందుకు, నిపుణుల నుంచి సలహాలు తీసుకోబోతున్నాం"అని తాత్కాలిక ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్ అన్నారు. శతాబ్దాలపోరాట ఫలితంగా సాకారమైన ఆలయంలో కొంతకాలంగా హుండీల నుంచి విరాళాలు చోరీ అవుతున్నాయన్న విషయం తెలియగానే ట్రస్ట్ సభ్యులు, భక్తులు ఎంతో కలతచెందారని, ఇది నిజంగా చాలా ఇబ్బందికర పరిస్థితి అని ట్రస్ట్ కోశాధికారి గోవింద్‌దేవ్ గిరి వ్యాఖ్యానించారు. ఈనెల 22వ తేదీన ట్రస్ట్ మరోసారి సమావేశంకానుంది. సోమవారంనాటి భేటీలో ట్రస్ట్ చైర్మన్ నృత్యగోపాల్ దాస్‌సహా ఏడుగురు శాశ్వత సభ్యులు హాజరయ్యారు. సాయంత్రం ఆరున్నరదాకా భేటీ కొనసాగింది.

## పక్కనే ఉన్న ఆంధ్రాను చూసి కర్ణాటక చాలా నేర్చుకోవాలి

అభివృద్ధి విషయంలో కర్ణాటక ప్రభుత్వం పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌ను చూసి నేర్చుకోవాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హితవు పలికారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేయడంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. సోమవారం బెంగళూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అభివృద్ధి విషయానికి వస్తే, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఆంధ్రప్రదేశ్‌లోని నాయకులంతా ఏకతాటిపై నిలుస్తారని కుమారస్వామి ప్రశంసించారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోవడంలో ఏపీ చూపుతున్న చొరవను కర్ణాటక ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీ, అనకాపల్లిలో ఏర్పాటు చేయనున్న గ్రీన్ స్టీల్ ప్లాంట్ వంటి అంశాలను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక కృషి చేశారని, అనకాపల్లి ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి స్వయంగా హాజరు కావాలని తనను కోరారని కుమారస్వామి గుర్తుచేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిణామాల నేపథ్యంలో అక్కడి ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి సైతం ఎలక్ట్రిక్ బస్సులు, స్టీల్ ప్లాంట్ వంటి ప్రాజెక్టుల కోసం కేంద్ర సహకారాన్ని పదేపదే కోరుతున్నారని ప్రస్తావించారు. "తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ, ఆయన పలుమార్లు కేంద్రం పెద్దలను కలిసి రాష్ట్రం ప్రయోజనాల కోసం విజ్ఞప్తులు చేశారు" అని పేర్కొన్నారు. కానీ, కర్ణాటకలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉందని కుమారస్వామి ఆరోపించారు. కుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీకి సంబంధించిన మైనింగ్ కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వమే అడ్డంకులు సృష్టిస్తోందని, దీనివల్ల వేలాది మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పరిస్థితి విషమిస్తే అందుకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యక్ష బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. బెంగళూరు నగరంలో చెట్లను పెంచామని ఒక రాష్ట్ర మంత్రి చెబుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వరి నాటు వేసినట్లుగా చెట్లను నాటారని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్రంలో తాను భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తోందని కుమారస్వామి మండిపడ్డారు.

## ఉగ్రం' రైఫిల్‌కు కేంద్రం పచ్చజెండా..



కేవలం 100 రోజుల రికార్డు సమయంలో రూపకల్పన, ప్రోటోటైప్

రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో మరో కీలక ముందడుగు పడింది. తెలంగాణకు చెందిన స్టార్టప్ సంస్థ 'ద్విప డిఫెన్స్' స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 7.62ఞ51 ఎంఎం 'ఉగ్రం' అసాల్ట్ రైఫిల్, భారత సైన్యం మరియు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఏ) నిర్వహించిన కఠిన పరీక్షల్లో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించింది. ఈ ఫలితంతో కేంద్ర సాయుధ పోలీస్ బలగాల (సీఏపీఎఫ్) అమ్ములపొదిలోకి ఈ స్వదేశీ ఆయుధం చేరేందుకు మార్గం సుగమమైంది. రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) పరిధిలోని 'ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్' (ఏఆర్‌డీఈ) సహకారంతో ద్విప డిఫెన్స్ కేవలం 100 రోజుల రికార్డు సమయంలో ఈ రైఫిల్ ప్రోటోటైప్‌ను సిద్ధం చేసింది. దేశంలోని విభిన్న వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించిన ఫీల్డ్ ట్రయల్స్, విశ్వసనీయత మరియు సామర్థ్య పరీక్షల్లో ఇది తన సత్తా చాటింది. దీంతో సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, ఎన్ఎస్‌జీ వంటి భద్రతా బలగాల్లో దీన్ని ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతం కానుంది.

**రైఫిల్ ప్రత్యేకతలు**

'ఉగ్రం' రైఫిల్ బరువు 4 కిలోల కంటే తక్కువగా ఉండి, 500 మీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదు. ఇందులో 20 రౌండ్ల సామర్థ్యం గల మ్యాగజైన్ ఉండగా, ఇది సింగిల్ మరియు ఫుల్ ఆటోమేటిక్ ఫైరింగ్ మోడ్‌లను సపోర్ట్ చేస్తుంది. ముఖ్యంగా ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు, క్లిష్టమైన ఆపరేషన్ల కోసం దీనిని ప్రత్యేకంగా రూపొందించారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో కేటాయించిన 13 ఎకరాల స్థలంలో ద్విప డిఫెన్స్ తన తయారీ కేంద్రాన్ని నెలకొల్పింది. ఈ విజయంపై కంపెనీ ఎండీ సిబు జోసెఫ్ స్పందిస్తూ, వివిధ భద్రతా బలగాల నుంచి ఈ రైఫిల్‌కు మంచి ఆదరణ లభించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో రక్షణ రంగ పరికరాల తయారీ కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ స్థానం మరింత పటిష్ఠమైంది.

## ఆమీర్ మూడో పెళ్లి: అంబానీ కుటుంబానికి తృటిలో తప్పిన ప్రమాదం

ప్రముఖ పారిశ్రామిక వేత్త, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కుటుంబానికి తృటిలో భారీ ప్రమాదం తప్పింది. ముంబైలోని బాంద్రా ప్రాంతంలో కుండపోత వర్షాలు, బలమైన గాలుల మధ్య అంబానీ భద్రతా కాన్వాయ్ ముందు ఒక చెట్టు కూలిపోవడంతో, కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాపిక్‌లో కొద్దిసేపు ఆగిపోవాల్సి వచ్చింది. అంబానీ కుటుంబం బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మూడో వివాహ వేడుకకు వెళు ్లండగా ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. అంబానీ కుటుంబానికి ఖరీదైన కార్లంటే ఎంత ఇష్టమో అందరికీ తెలిసిందే. అనేక విలాసవంతమైన, సౌకర్య వంతమైన కార్లు వారి సొంతం. పలు భద్రతా ఫీచర్లతో కూడిన లగ్జరీ అంబానీ కాన్వాయ్ సాఫీగా సాగేందుకు గాను , వారి వ్యక్తిగత భద్రతా వాహనాలు ట్రాఫిక్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం కూడా గతంలో చూశాం. అయితే తాజాగా ముంబైలో భారీ వర్షాలకు, దేశంలోనే అత్యంత సంపన్న కుటుంబానికి కూడా ఇక్కట్లు తప్పలేదు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఎశ్రీఱఎనెయిఖఎష్ట్రఱఅ' షేర్ చేశారు. దీని ప్రకారం అంబానీ కాన్వాయ్ రోడ్డు మధ్యలో ఆగిపోవడం కనిపిస్తుంది. ముందు వరుసలో రేంజ్ రోవర్ (ఞఱఅస్త్రవ =శీజవతీ) ఉండగా, దాని వెనుక మెర్సిడెస్-బెంజ్ ఎస్-క్లాస్ (వీవతీఎవసవం-దీవఅఓ ూ-జశ్రీఞం) ఉంది. ఎస్-క్లాస్ వెనుక టయోటా ఫార్చ్యూనర్ (ుశీఎశ్ఞ ఖీశీతీబఱవతీ) ఇతర వాహనాల వరుసను ఈ వీడియోలో చూడవచ్చు. చెట్లు నేలకూలి రోడ్డుపై పడి ఉండటం వల్ల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ట్రాఫిక్‌ను పూర్తిగి స్తంభించిపోవడంతో కాసేపు అంబానీ కుటుంబం రోడ్డుపైనే ఆగిపోవాల్సి వచ్చింది. అటు అంబానీ కుటుంబ భద్రతా సిబ్బంది చేయలేకపోయింది. మెర్సిడెస్-బెంజ్ ఎస్-క్లాస్ బుల్లెట్-రెసిస్టెంట్ (బుల్లెట్ ప్రూఫ్) మెర్సిడెస్-బెంజ్ ూ680 గార్డ్ సెడాన్. వీడియోలో కనిపిస్తున్న వాహనం బంగారు రంగు (గోల్డ్ షేడ్)లో ఉన్నట్లు అనిపిస్తోంది. ఈ కుటుంబం వద్ద ఉన్న నాలుగు ూ-క్లాస్ గార్డ్ సెడాన్లలో ఇది ఒకటని సమాచారం. ఈ కారు ఔ223 తరానికి చెందినది మరియు వూూవీ ఎ=10 ధృవీకరణను కలిగి ఉంది; పౌర వినియోగ వాహనాలకు లభించే అత్యున్నత స్థాయి బాలిస్టిక్ రక్షణగా దీనిని పరిగణిస్తారు. ఇది బాలిస్టిక్ ముప్పుల నుండి రక్షణ కల్పించడమే కాకుండా, పేలుడు పదార్థాల నుండి కూడా కాపాడుతుంది.

# చర్చల యుద్ధానికి సిద్ధం

లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లు, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టి భంగపడిన అధికార ఎన్‌డీఏ కూటమి ఈసారి మరింత పదునైన వ్యూహంతో ముందుకొస్తోంది. త్వరలో ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కీలక బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవాలని మోదీ సర్కార్ కృతనిశ్చయంతోఉంది. అయితే బడ్జెట్ సమావేశాల్లో ఐక్యత చాటి మహిళా రిజర్వేషన్ చట్టసవరణ బిల్లును వీగిపోయేలా చేసినట్లే ఈసారి ఉమ్మడిగా ఎన్‌డీఏ కూటమిని ఎదుర్కోవాలని విపక్షాలు పట్టుదలగా ఉన్నాయి. దీంతో జూలై 20వ తేదీ నుంచి ఆగస్ట్ 13వ తేదీదాకా ఈసారి వర్షాకాల సమావేశాలు వ్యూహప్రతివ్యూహాలతో హోరాహోరీగా సాగనున్నాయి. మొత్తంగా ఈసారి 19 సార్లు ఇరుసభలు సమావేశంకానున్నాయి. బడ్జెట్ సెషన్‌లో మహిళా రిజర్వేషన్ చట్టసవరణ బిల్లును వీగిపోయేలా చేసినప్పటికీ ఇప్పటికీ అధికార, విపక్షల బలాబలాల్లో మార్పులొచ్చాయి. ఇటీవల రాజ్యసభలో ఖాళీ అయిన 27 స్థానాల కోసం జరిగిన ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో గెలిచి ఎన్‌డీఏ తన బలాన్ని పెంచుకుంది. వీళ్లుగాక స్వతంత్రులు, నామినేటెడ్ సభ్యులు, చిన్న పార్టీల మద్దతునూ కూడగడుతోంది. దీంతో రాజ్యసభలో ఎన్‌డీఏ బలం 150కి చేరుకోబోతోంది. ఇది రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి కావాల్సిన మూడింట రెండొంతుల సంఖ్యాబలం(160)కి సమీపంలో ఉండటం గమనార్హం. పశ్చిమబెంగాల్‌లో ఖాళీగాఉన్న మరో మూడు రాజ్యసభ స్థానాలనూ కైవసం చేసుకోవడం ద్వారా బీజేపీ తన సంఖ్యాబలాన్ని మరింత పెంచుకోనుంది. దీంతోపాటు లోక్‌సభలోనూ బీజేపీ బలం ఎక్కువకానుంది.



**తగ్గిన విపక్షాల బలం**

ఇటీవల వెలువడిన పలు రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ఫలితాల తర్వాత విపక్ష పార్టీల సంఖ్యాబలం తగ్గిపోయింది. దీంతో విపక్ష పార్టీల మధ్య ఐక్యత సైతం బలహీనపడింది. తమిళనాడులో ప్రభంజనం సృష్టించిన అధికార పగ్గాలు చేపట్టిన విజయ్ జోసెఫ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడం సుతరామూ ఇష్టంలేని మిత్రపక్షం డీఎంకే తన మైత్రిబంధానికి చరమగీతం పాడింది. వీటికితోడు పశ్చిమబెంగాల్‌లో మమత బెనర్జీని షాక్‌కు గురిచేస్తూ 20 మంది టీఎంసీ ఎంపీలు సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియాకి మద్దతు పలికారు. ఈ పార్టీ ఇప్పటికే ఎన్‌డీఏకూ మిత్రపక్షంగా ఉంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రేకు గుడ్‌బై చెప్పి ఆరుగురు శివసేన(యూబీటీ) ఎంపీలు పరోక్షంగా బీజేపీకి మద్దతు పలకడంతో లోక్‌సభ, రాజ్యసభలో ఎన్‌డీఏ మరింత బలం పుంజుకుంది.

ప్రతిష్టాత్మకమైన నీట్ ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, సీబీఎస్ఈ పన్నెండో తరగతి విద్యార్థుల డిజిటల్ మూల్యాంకనం తప్పులతడకగా మారడం, అయోధ్యలోని రామమందిరానికి వచ్చిన కోట్ల రూపాయల విరాళాలు, స్వర్ణాభరణాలు చోరీకి గురికావడం, దేశంలో నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని తాకడం, పశ్చిమాసియా యుద్ధాగ్ని జ్వాలల భారత్‌లో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సెగలు పుట్టించడంతో ప్రభుత్వ అంతర్గత, విదేశాంగ విధానం విఫలమైందంటూ విపక్షాలు పార్లమెంట్ వేదికగా పదునైన విమర్శనాస్త్రాలు సంధించనున్నాయి. టీఎంసీ, శివసేన(యూబీటీ) తిరుగుబాటుఎంపీల మద్దతులో లోక్‌సభలో ఎన్‌డీఏ బలం 318 లేదా 319కి పెరిగే వీలుంది. అయినాసరే మూడింట రెండొంతుల(360) బలానికి బీజేపీ 40 స్థానాలను సమకూర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

**సభలో ప్రవేశపెట్టబోయే బిల్లులు, నివేదికలు..**

ఢిల్లీలో అధికారిక నివాసంలో కాలిన కరెన్సీ కట్టలు వెలుగుచూసిన ఉదంతంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంతవర్మను పదవి నుంచి తొలగించేందుకు, కేసు దర్యాప్తు కోసం ఏర్పాటైన ముగ్గురు సభ్యుల కమిటీ తన నివేదికను లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. ఇప్పటికే ఈ అంశంలో అధికార, విపక్షాలు ఏకతాటిమీదకొచ్చాయి.

**ఇవీ బిల్లులు..**

1. రాజ్యాంగ(130వ) సవరణ బిల్లు

తీవ్రమైన నేరాలకు పాల్పడి అరెస్టయి ఏకధాటిగా 30 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీలోనే ఉండిపోయిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులను పదవుల నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన బిల్లు సభ ముందుకురావొచ్చు. అయితే ఇప్పటికే ఈ బిల్లు సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది.

2. విదేశీ విరాళాల(నియంత్రణ) సవరణ బిల్లు, 2026

ఈ ఏడాది మార్చి 25వ తేదీన ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

3. వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు

గత ఏడాది డిసెంబర్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఇప్పటికే సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది.

4. సెక్యూరిటీస్ మార్కెట్ బిల్లు, 2025

ఈ బిల్లును 2025 డిసెంబర్ 18వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఇప్పటికే సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది.

5. కార్పొరేట్ చట్టాల(సవరణ)బిల్లు, 2026

2026 మార్చి 23వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఇప్పటికే సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది.

# వయనాడ్‌లో సొరంగం నిర్మాణ ప్రాంతంలో ప్రమాదం..

**కొండచరియలు విరిగిపడి ఇద్దరు మృతి**

**హైదరాబాద్, జూలై 7:** కల్లాడిలోని మీనాక్షి వంతెన సమీపంలో సొరంగం నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశంలో మంగళవారం కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో పది మంది వరకు మట్టిపెళ్లల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అనక్కంపొయిల్-కల్లాడి-మెప్పాడి జంట సొరంగం రహదారి పనులు సాగుతున్న క్రమంలో, ఒక్కసారిగా కొండ పైనుంచి భారీగా మట్టి, రాళ్లు విరిగిపడ్డాయి. సమాచారం అందిన వెంటనే జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), అగ్నిమాపక మరియు పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో గాయపడిన సుమారు ఎనిమిది మందిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేరళ మంత్రి టి. సిద్దిఖీ స్పందిస్తూ, ఇది ముమ్మాటికి మానవ తప్పిదమేనని విమర్శించారు. వదులుగా ఉన్న మట్టిని తొలగించాలని జూన్ 20వ తేదీనే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఈ ఘటనపై అత్యవసర సమావేశం నిర్వహించి, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు మంత్రులను ఘటనా స్థలానికి పంపారు.గత 24 గంటల్లో వయనాడ్ జిల్లాలో 265 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ జిల్లాకు 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన ఈ ప్రాంతంలో 2024లో సంభవించిన పెను విపత్తులో సుమారు 300 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కురుస్తున్న వర్షం సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్నప్పటికీ, శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137